సోమవారం
8•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 13
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




## నాలుగు చట్టాలతో

# నూతన పట్టణ విధానం

### రెండురోజుల్లో ముసాయిదా రూపొందించాలి

- అర్బన్ పాలసీతోపాటే.. గ్రామీణ, రెవెన్యూ విధానాలు
- ప్రజలకు పారదర్శకంగా సేవలందేలా కొత్త చట్టాలు
- రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరగాలి
- గ్రామాల అభివృద్ధికి ఐదేండ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చుచేస్తాం
- మూడునెలల్లో గ్రామాల్లో మార్పు కనిపించాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు
- రాష్ట్రంలో నాలుగుచోట్ల పంచాయతీరాజ్ సమ్మేళనాలు
- త్వరలో హైదరాబాద్‌లో కలెక్టర్ల సదస్సు
- ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం కేసీఆర్



ఆదివారం ప్రగతిభవన్‌లో రాష్ట్ర నూతన పట్టణ విధానం రూపకల్పనపై ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అవినీతికి ఆస్కారం లేకుండా, ప్రజలకు పారదర్శకంగా సేవలందేలా, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరిగేవిధంగా నూతన పాలసీలు రూపొందించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. నూతన పట్టణ పాలసీతోపాటు కొత్త గ్రామీణ పాలసీ, కొత్త రెవెన్యూ పాలసీ కూడా రూపొందించాలన్నారు. నూతన పట్టణ పాలసీలో భాగంగా నాలుగు నూతన చట్టాలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ చట్టాల ముసాయిదాను రెండురోజుల్లో రూపొందించాలని నిర్దేశించారు. కొత్తగా రూపొందించే చట్టప్రకారమే పరిపాలన జరుగాలని, దీనికి అధికారులు, ప్రజాప్రతినిధులను బాధ్యులను చేయాలని తెలిపారు. బాధ్యతలను విస్మరించిన వారిపై కఠినచర్యలు తీసుకునే అధికారం కూడా చట్టం కల్పిస్తుందని సీఎం స్పష్టంచేశారు. పల్లెలు పరిశుభ్రతతో కళకళలాడాలని, మూడునెలల్లో అన్ని పల్లెల్లో మార్పు కనిపించాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ఏటా రూ.ఏడువేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.35వేల కోట్ల నిధులు ఖర్చుచేస్తామని, వీటిని స్థానికసంస్థలు సమర్థంగా వినియోగించాలని చెప్పారు.

**నూతన అర్బన్ పాలసీలో కొత్త చట్టాలు**

- కొత్త మున్సిపల్ చట్టం
- కొత్త కార్పొరేషన్ల చట్టం
- కొత్త హైదరాబాద్ నగర కార్పొరేషన్ చట్టం
- ఇతర నగరాల అభివృద్ధి సంస్థల చట్టం

ఈ మేరకు రాష్ట్రంలో నాలుగు చోట్ల సమ్మేళనాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామని సీఎం తెలిపారు. గ్రామాభివృద్ధిని నిత్యం పర్యవేక్షించడానికి

మిగతా 2వ పేజీలో


ఆదివారం కన్నెపల్లి పంప్‌హౌస్ గ్రావిటీ కెనాల్ డెలివరీ సిస్టర్న్ వద్ద 1, 6వ మోటర్ల నుంచి వస్తున్న గోదావరి నీరు

## అన్నారం వైపు
# గోదారి పరుగులు

- ఆదివారం కన్నెపల్లిలో రెండు మోటర్లతో నీటి విడుదల
- నేటి మధ్యాహ్నానికి 4 మోటర్లు నడిపే అవకాశం
- అన్నారం బరాజ్‌లోకి 4,600 క్యూసెక్కుల జలాలు
- మేడిగడ్డ జలశోభితం ▪ బరాజ్ వద్ద 30 వేల క్యూసెక్కుల ప్రవాహం
- ఉప్పొంగుతున్న ప్రాణహిత ▪ దేవాదుల వద్ద కొనసాగుతున్న పంపింగ్

2




## ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు

### టీఆర్‌ఎస్‌లో జోరందుకున్న ప్రక్రియ

### పార్టీ నేతలను సమన్వయం చేస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో స్వచ్ఛందంగా టీఆర్‌ఎస్ సభ్యత్వాన్ని తీసుకుని చూపుతున్న 72 ఏండ్ల వృద్ధురాలు ఏసు అంశోజమ్మ




5

## భూమి ఉన్నా దక్కని రైతు బీమా

**ధర్మగంట**

- రికార్డులు ఆన్‌లైన్ అయినా కొత్త పాస్‌బుక్ ఇవ్వని అధికారులు
- పాస్‌బుక్ లేకుండా బీమాకు ఎన్‌రోల్ చేయని వ్యవసాయశాఖ
- నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో రైతు కుటుంబం వెతలు

**రైతు** అకాల మరణం చెందితే.. ఆ కుటుంబం రోడ్డున పడకూడదనే ఆలోచనతో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బీమా పథకాన్ని ప్రారంభించారు. గుంట భూమి ఉన్నా 5 లక్షల రూపాయల ఆర్థిక సాయంతో ఆ కుటుంబానికి భరోసా ఇచ్చినప్పటికీ, రెవెన్యూ వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల నల్లగొండ జిల్లాకు చెందిన ఓ రైతు కుటుంబం రోడ్డున పడింది. భూమి ఉండి, అర్హత ఉండి కూడా పట్టాదారు మరణించిన తర్వాత బీమాకు నోచుకోలేకపోయింది. ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదైనా ఏడాది దాకా పాస్‌బుక్ ఇవ్వకపోవడంతో ఆ కుటుంబానికి బీమా వర్తించకుండా పోయింది. దీంతో న్యాయం కోసం బాధితులు ధర్మగంటను ఆశ్రయించారు.


భూమిపత్రాలు చూపుతున్న నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలానికి చెందిన నాగులంచ లింగారావు కుమారుడు శ్రీనివాసరావు


4



# యాసంగి పంటల బకాయి రూ.150 కోట్లు విడుదల

- మద్దతు ధరకు వివిధ పంటలను సేకరించిన ప్రభుత్వం
- త్వరలో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తాం
- ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగిలో రైతుల నుంచి మద్దతు ధరకు సేకరించిన నాలుగు రకాల పంటలకు సంబంధించిన మొత్తం బకాయి రూ.150.17 కోట్లను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. రైతుల వద్ద కొనుగోలు చేసిన పంటలకు ఎలాంటి బకాయి లేకుండా నిధులు విడుదల చేయాలన్న సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు.. నిధులు విడుదల చేస్తూ శనివారం వ్యవసాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. త్వరలో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో మద్దతు ధర కింద వివిధ సంస్థల ద్వారా కొనుగోలు చేసిన శనగ, మినుము, జొన్న, పొద్దుతిరుగుడు రైతులకు మొత్తం బకాయిలు చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. పంటలకు మద్దతు ధరల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాల్లో స్పష్టతలేదని, పరిమిత పంటలకే కేంద్రం మద్దతు ధరకు అనుమతి ఇస్తున్నదని తెలిపారు. మిగిలిన పంటల విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నదన్నారు. కేంద్రం మద్దతు ధర ఇచ్చే పంటలకు కూడా మద్దతు ధర కింద కేంద్రం అనుమతించేదానికి, క్షేత్రస్థాయి దిగుబడికి పొంతన ఉండటం లేదని తెలిపారు. ఇక్కడ కూడా రైతు ప్రయోజనాల కోసమే పరిమితికి మించి కొనుగోలు చేసినట్టు చెప్పారు. బకాయిలు విడుదలచేసిన సందర్భంగా సీఎం కేసీఆర్‌కు మంత్రి నిరంజన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## కొండగట్టు గుట్టల్లో యువతి అనుమానాస్పద మృతి

**మల్యాల (కొడిమ్యాల):** జగిత్యాల జిల్లా కొండగట్టు గుట్టల్లో ఓ యువతి అనుమానాస్పదంగా మృతిచెందింది. వై జంక్షన్ నుంచి జేఎన్టీయూ కాలేజీకి వెళ్లే రహదారి వద్ద కాంటూరు కందకాల్లో యువతి మృతదేహాన్ని భక్తులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం కొండగట్టు దర్శనానికి వచ్చిన భక్తులు పొదల్లో యువతి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కొడిమ్యాల ఎస్సై సతీశ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహం పక్కన బండరాయికి రక్తపు ఆనవాళ్లు కనిపించడంతో హత్యకేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. ఘటనాస్థలిలో కాంటాలు, పిన్నీసులు దొరికాయి. యువతిని ఇక్కడే హత్యచేశారా.. లేక ఎక్కడైనా హత్యచేసి ఇక్కడికి తీసుకొచ్చారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. మృతురాలి వివరాలు అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించి వాకబుచేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం పూర్తివివరాలు తెలియనున్నాయని.. కేసులో పురోగతి సాధించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.



# నూతన పట్టణ విధానం


మొదటిపేజీ తరువాయి...


వంద ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటుచేసి నిత్యం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై వేటువేయడానికి ఏమాత్రం వెనుకాడబోమని స్పష్టంచేశారు. గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇందుకోసం త్వరలోనే హైదరాబాద్‌లో కలెక్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించాలని అధికారులకు సీఎం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర నూతన పట్టణ పాలసీ రూపకల్పనపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, సీఎం ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, పురపాలకశాఖ కమిషనర్ శ్రీదేవి, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ, సీఎం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

### తెలంగాణ మరో మెట్టు ఎక్కాలి

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే, రాష్ట్ర ప్రాధాన్యాలను గుర్తించాం. సంక్షేమరంగానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చాం. విద్యుత్ సంక్షోభాన్ని పరిష్కరించుకున్నాం. మంచినీళ్ల సమస్యను తీర్చుకున్నాం. సాగునీటి కోసం ప్రాజెక్టులు కడుతున్నాం. పారిశ్రామికాభివృద్ధి కోసం టీఎస్ ఐపాస్ చట్టం చేసుకున్నాం. ఇప్పుడు తెలంగాణ మరో మెట్టు ఎక్కాలి. దీనికోసం మంచి విధానాలు రావాలి. కొత్తగా పంచాయతీరాజ్ చట్టం చేసుకున్నాం. ఇదేవిధంగా రెవెన్యూ, మున్సిపల్ చట్టాలు కూడా రావాలి. పరిపాలన పారదర్శకంగా, వేగంగా, అవినీతికి ఆస్కారం లేని విధంగా సాగాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షించారు.



ఆదివారం ప్రగతిభవన్‌లో నూతన పట్టణ పాలసీపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎం ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, పురపాలకశాఖ కమిషనర్ శ్రీదేవి, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు తదితరులు కూడా ఉన్నారు.

### ఒక పద్ధతి ప్రకారం పాలన సాగాలి

**'నూతన** పట్టణపాలసీలో భాగంగా నూతన మున్సిపల్ చట్టం, నూతన కార్పొరేషన్ల చట్టం, నూతన హైదరాబాద్ నగర కార్పొరేషన్ చట్టం తీసుకురావాలి. హెచ్‌ఎండీఏతోపాటు ఇతర నగరాల అభివృద్ధి సంస్థల పాలనకు సంబంధించి కూడా కొత్త చట్టం రూపొందించాలి. రెండు మూడు రోజుల్లోనే ఈ చట్టాల డ్రాఫ్ట్ తయారుచేయండి. త్వరలోనే అసెంబ్లీని సమావేశపరిచి కొత్త చట్టాలు తెస్తాం. అవినీతికి ఆస్కారం లేని విధంగా, అక్రమ కట్టడాలకు ఏ మాత్రం వీలులేని విధంగా, పచ్చదనం-పరిశుభ్రత వెల్లివిరిసేలా నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దడానికి ఉపయోగపడేలా కొత్త చట్టాలుండాలి. ఈ చట్టాల ప్రకారమే నగర పాలన జరిగే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు బాధ్యత అప్పగించాలని నిర్ణయించినం. బాధ్యతలను విస్మరించిన వారిపై కఠిన చర్యలు తీసుకునే అధికారాలను కూడా చట్టంలో కల్పించాలి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పరిస్థితిని చక్కదిద్దే బృహత్తర ప్రయత్నంలో కలెక్టర్లు క్రియాశీల బాధ్యత పోషించేలా చట్టంలో నిబంధనలు పెడతాం. ఎవరిష్టం వచ్చినట్లు వారు నిధులు ఖర్చుచేయకుండా, ఆయా నగరాలు, పట్టణాల ప్రాధాన్యాలు, సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం మాత్రమే నిధులు వెచ్చించాలి. మున్సిపాలిటీలకు ఆదాయం రావాలి. వచ్చిన ఆదాయం సద్వినియోగం కావాలి. రాష్ట్రంలో ఓ పద్ధతి ప్రకారం నగర పట్టణ పాలన సాగేందుకు నూతన పాలసీ, కొత్త చట్టాలు ఉపయోగపడాలి' అని సీఎం అధికారులకు స్పష్టంచేశారు.

### ప్రజాప్రతినిధులు గ్రామాల వికాసానికి పూనుకోవాలి

'గ్రామాల అభివృద్ధికి ఏటా దాదాపు ఏడువేల కోట్ల రూపాయలు, ఐదేండ్లలో 35వేల కోట్ల రూపాయలను గ్రామాల అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని నిర్ణయించినం. ఈ నిధులను సమర్థంగా వినియోగించుకునేవిధంగా జిల్లా పరిషత్తులు, గ్రామీణ స్థానిక సంస్థలు బలోపేతం కావాలి. తెలంగాణ పల్లెలు పచ్చదనంతో, పరిశుభ్రతతో కళకళలాడాలి. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు గ్రామాల వికాసానికి పూనుకోవాలని పిలుపు ఇస్తున్నా. కొత్త పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించడంతోపాటు, గ్రామాల వికాసానికి ప్రభుత్వంచేస్తున్న ప్రయత్నాలను వివరించడానికి త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ సమ్మేళనాలను నిర్వహించాలని నిర్ణయించినం. రాష్ట్రంలో నాలుగుచోట్ల ఈ సమ్మేళనాలు నిర్వహిస్తాం. ఈ సమ్మేళనాలకు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ చైర్‌పర్సన్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు, ఎంపీడీవోలు, డీఎల్పీవోలు, సీఈవోలను ఆహ్వానిస్తాం. గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా తయారుకావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి బాధ్యతలు నిర్వహించాలనే విషయాన్ని ఈ సమ్మేళనాలలో చర్చిస్తారు. సమ్మేళనాల తరువాత అధికారులతో కూడిన వంద ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటుచేస్తాం, అవి గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు జరుపుతాయి. పచ్చదనం, పరిశుభ్రత విషయంలో అలసత్వం ప్రదర్శించినట్లు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే వెంటనే కఠినచర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో మూడు నెలల్లో మార్పు కనిపించాలి' అని సీఎం కేసీఆర్ అధికారులకు స్పష్టంచేశారు.



ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్. చిత్రంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం కూడా ఉన్నారు.

## వందేండ్ల దూరదృష్టితో నిర్మాణం

- భవిష్యత్ అవసరాలకనుగుణంగా సచివాలయం, అసెంబ్లీ భవనాలు
- కేంద్ర బడ్జెట్‌పై ఒక్కటైన బీజేపీ, కాంగ్రెస్
- టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భవిష్యత్‌తరాల అవసరాలు, అధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా నూతన అసెంబ్లీ, సచివాలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. వందేండ్ల అవసరాలకు అనుగుణంగా ఈ నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామిక తెలంగాణ పేరుతో పనిలేనివాళ్లు, తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన వాళ్లు, మేధావులు అని చెప్పుకొనేవాళ్లు, ఏ పార్టీలో పోవాలా అని చూసే వాళ్లు ఏదేదో మాట్లాడుతారని ధ్వజమెత్తారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ పనిచేసినా వ్యతిరేకించాలనే ఏకైక లక్ష్యంతోనే వారు విమర్శలు చేస్తుంటారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ భవనాన్ని కూలగొడుతారనేది తప్పుడు ప్రచారమని స్పష్టంచేశారు. పార్లమెంట్‌కు కొత్తభవనం నిర్మించాల్సిన అవసరం ఉన్నదని అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడుకు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ లేఖ రాశారని, దానిని సమర్థిస్తూ మరో కేంద్రమంత్రి నఖ్వీ కూడా మాట్లాడారని నాటి రికార్డులను సుమన్ మీడియాకు వినిపించారు. 2018లో గుజరాత్ అసెంబ్లీ మరమ్మతులకే రూ.132 కోట్లు ఖర్చు చేశారని, కానీ, ఇక్కడి బీజేపీ నాయకులు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. గుజరాత్, మహారాష్ట్రలో వేల కోట్లు ఖర్చుచేసి విగ్రహాలను ఏర్పాటుచేశారని ఆరోపించారు. బీజేపీపై పోరాడుతానని రాహుల్‌గాంధీ అంటుంటే ఇక్కడి కాంగ్రెస్ నాయకులు మాత్రం ఆ పార్టీ నాయకులతో అలయ్‌బలయ్ అంటూ తిరుగుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ఏంటో తెలంగాణ ప్రజలకు తెలుసునని, ఇక్కడి ప్రజల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అవినీతి రహితపాలన అందించాలనే సంకల్పంతో కేసీఆర్ ముందుకెళుతున్నారని, టీఆర్‌ఎస్ నాయకులెవరూ బీజేపీతో టచ్‌లో లేరని పేర్కొన్నారు.

### తెలంగాణపై సవతి తల్లి ప్రేమ

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిందని బాల్క సుమన్ చెప్పారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై రాష్ట్రంలోని ప్రతిపక్ష నేతలెవ్వరు స్పందించడంలేదని, పీసీసీ అధ్యక్షుడు ఇంతవరకు మాట్లాడలేదని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి వారికి పట్టడంలేదని, తెలంగాణ ప్రజలు ఈ విషయాన్ని గుర్తించారని తెలిపారు. ఐదురోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తామని చెప్పి దాని ప్రస్తావనే లేదని విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకే నిధులు కేటాయించిందని చెప్పారు. బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిన విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకురాలేకపోయారని అన్నారు.

# అన్నారం వైపు గోదారి పరుగులు

### ఆదివారం కన్నెపల్లిలో రెండు మోటర్లతో నీటి విడుదల

- నేటి మధ్యాహ్నానికి 4 మోటర్లు నడిపే అవకాశం
- అన్నారం బరాజ్‌లోకి 4,600 క్యూసెక్కుల జలాలు
- మేడిగడ్డ జలశోభితం
- బరాజ్ వద్ద 30 వేల క్యూసెక్కుల నీరు
- ఉప్పొంగుతున్న ప్రాణహిత
- దేవాదుల వద్ద కొనసాగుతున్న పంపింగ్

**హైదరాబాద్/కాళేశ్వరం, నమస్తే తెలంగాణ:**

గోదావరిలో వరద ఉధృతి క్రమంగా పెరుగుతుండటంతో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి జలాల ఎత్తిపోత కొనసాగుతున్నది. ఆదివారం కన్నెపల్లి మీదుగా సుమారు 25 వేల నుంచి 26 వేల క్యూసెక్కుల నీరు గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌లోకి ప్రవహించినట్లు ఇంజినీర్లు తెలిపారు. మేడిగడ్డ బరాజ్ నుంచి కూడా కొన్ని గేట్లను తెరిచి నీటిని విడుదలచేస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో ఎత్తిపోత ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇంజినీర్లు కసరత్తుమొదలుపెట్టారు. సీఎం కేసీఆర్ ఆదేశంతో గత మంగళవారం నుంచి కన్నెపల్లి వద్దే ఉన్న ఈఎన్సీ వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, ఇతర ఇంజినీర్లు.. కన్నెపల్లిలో నడిపే మోటర్ల సంఖ్యను పెంచేదిశగా ప్రయత్నాలుచేస్తున్నారు. ప్రస్తుతం పంప్‌హౌస్‌లోని ఒకటి, ఆరో మోటర్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది. ఒక్కో మోటర్ నుంచి సుమారు 2,300 క్యూసెక్కుల చొప్పున 4,600 క్యూసెక్కుల జలాలను ఎత్తిపోస్తున్నారు. గ్రావిటీ కాల్వ ద్వారా అన్నారం బరాజ్‌లోకి గోదావరి జలాలు చేరుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు అన్నారం బరాజ్‌లోకి 0.8 టీఎంసీల నీరు చేరినట్లు ఈఎన్సీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రాత్రి మూడో మోటర్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయి. సోమవారం సాయంత్రం వరకు పంప్‌హౌస్‌లో నాలుగు మోటర్లను నడిపించాలని ఇంజినీర్లు భావిస్తున్నారు. అన్నారం బరాజ్‌లోకి నీటి విడుదల కొనసాగుతున్నందున, మరో పది పదిహేనురోజులైతేగానీ అన్నారం పంప్‌హౌస్‌పై అధికారులు దృష్టిసారించే పరిస్థితి లేదు. అన్నారం బరాజ్‌లో నీటి నిల్వ పెరిగి పంప్‌హౌస్ దగ్గర నీటి లభ్యత మొదలయ్యాక అక్కడి మోటర్లను నడిపేందుకు ఇంజినీర్లు సిద్ధం కానున్నారు. ప్రస్తుతానికి కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వచ్చే జలాలే అన్నారం, సుందిల్ల పంప్‌హౌస్‌లకు ఆధారం కానున్నాయి.



గ్రావిటీ కెనాల్ నుంచి అన్నారం బరాజ్‌కు వెళ్తున్న గోదావరి జాలాలు

### సందర్శకుల తాకిడి

కన్నెపల్లి పంప్‌హౌస్‌లో రెండు మోటర్ల నుంచి గోదావరి నీరు గ్రావిటీ కెనాల్ నుంచి వెళ్తుండటంతో ఆ ప్రాంతమంతా జలకళ సంతరించుకొన్నది. ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం సుమారు ఐదువేల మంది పర్యాటకులు ప్రాజెక్టును సందర్శించినట్లు అధికారులు తెలిపారు. రహదారిపైనుంచి కాళేశ్వరం వైపు వెళ్లే ప్రయాణికులు వాహనాలు ఆపి గోదావరిని చూసి సంతోషం వ్యక్తంచేస్తున్నారు. మేడిగడ్డకు పెద్దఎత్తున గోదావరి ప్రవాహం వస్తుండటంతో అక్కడికి కూడా సందర్శకులు తరలివస్తున్నారు.

### దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద 76.5 మీటర్ల ప్రవాహం

**ఏటూరునాగారం (ములుగు):** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటెత్తుతున్నది. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం సమీపంలోని దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటి ప్రవాహం 76.5 మీటర్లు ఉండటంతో ఇక్కడి మోటర్లను ఆన్‌చేసి నీటిని విడుదలచేస్తున్నారు. మరోవైపు తుపాకులగూడెం బరాజ్ వద్ద గోదావరి పొంగి ప్రవహిస్తున్నది. గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో బరాజ్ పనులకు ఆటంకం ఏర్పడింది.

### ఆల్మట్టికి 32,190 క్యూసెక్కుల వరద

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టికి వరద కొనసాగుతున్నది. ఆదివారం 32,190 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. దీంతో 129.72 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ఆల్మట్టి జలాశయంలో ప్రస్తుతం నీటిమట్టం 33.07 టీఎంసీలకు చేరింది. ఈ నీటి సంవత్సరంలో ఇప్పటివరకు 11.22 టీఎంసీల కృష్ణాజలాలు ఆల్మట్టికి చేరాయి. నారాయణపూర్‌కు స్వల్పంగా 233 క్యూసెక్కుల వరద వస్తున్నది. ఉజ్జయినికి 741 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. తుంగభద్రను ఇంకా వరద పలుకరించలేదు.

### గోదావరిలో పెరుగుతున్న ఇన్‌ఫ్లోలు

మరోవైపు గోదావరిలో ఇన్‌ఫ్లో స్థాయి క్రమంగా పెరుగుతున్నది. కడెం ప్రాజెక్టుకు 349 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి కేవలం 179 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తున్నది. మిగతా ప్రాజెక్టుల వద్ద ఇన్‌ఫ్లోలు నమోదు కావడం లేదు. పేరూరు వద్ద గోదావరి వరద ప్రవాహం 36,887 క్యూసెక్కులుగా ఉంది. దిగువన ధవళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో 26,292 క్యూసెక్కులు ఉండగా.. అధికారులు 14,500 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. గత జూన్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు సుమారు నాలుగు టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి.

### మంగపేట పుష్కర్‌ఘాట్ వద్దకు గోదావరి


**మంగపేట:** ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల ప్రభావంతో గోదావరి ప్రవాహం ఆదివారం సాయంత్రానికి మంగపేట పుష్కరఘాట్ సమీపానికి వచ్చింది. దీంతో ఈ ప్రాంత జాలరులు చేపల వేటకు ఉపయోగించే పడవలను పుష్కరఘాట్ వద్ద ఉన్న తీరంలో కట్టేశారు.



ములుగు జిల్లా మంగపేట పుష్కరఘాట్ వద్దకు వచ్చిన గోదావరి నీరు

### మేడిగడ్డ జలశోభితం

**మహదేవపూర్ (జయశంకర్ భూపాలపల్లి):** కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్ వద్ద జలకళ ఉట్టిపడుతున్నది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మేడిగడ్డ బరాజ్‌లోకి పెద్ద ఎత్తున నీరు చేరుతున్నది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ప్రాణహిత, గోదావరి జీవనదులు ఏకమై మేడిగడ్డ బరాజ్‌కు జీవం పోస్తున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు మేడిగడ్డ వద్ద గోదావరి ప్రవాహం 30 వేల క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.



మేడిగడ్డ బరాజ్‌లోకి చేరిన నీరు

### ఉప్పొంగుతున్న ప్రాణహిత

**కోటపల్లి:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగుతున్నది. నదిలోకి భారీగా వరద నీరు వస్తుండటంతో కళకళలాడుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆయువుపట్టయిన ప్రాణహితలోకి నీరు పెద్ద మొత్తంలో రావడంతో కాళేశ్వరం సమీపంలోని త్రివేణి సంగమం జలకళ సంతరించుకున్నది.



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామం సమీపంలో ప్రాణహిత నదిపై నిర్మించినవంతెన వద్ద ప్రాణహిత నది ప్రవాహం

### ముహూర్తం

సూర్యోదయం: 5.51 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, షష్ఠి ఉదయం 7.44 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: ఉత్తర సాయంత్రం 6.34 వరకు, తదుపరి హస్త, అమృతఘడియలు: ఉదయం 11.52 నుంచి మధ్యాహ్నం 1.28 వరకు, రాహుకాలం: ఉదయం 7.29 నుంచి 9.06 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.55 నుంచి మధ్యాహ్నం 12.47 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 4.15 వరకు, వర్జ్యం: లేదు.

### లోకం పోకడ




ఇంటింటికి నీళ్లేమో గానీ,
మన ఆశలమీద నీళ్లు చల్లారు!

## మట్టి వాసనల మకరందం
# బోనాల పండుగ



- మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ మట్టి వాసనల మకరందం బోనాల పండుగ అని టీఆర్‌ఎస్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. స్త్రీని అమ్మగా, ఆదిశక్తిగా కొలిచే మహోన్నత సాంస్కృతిక వారసత్వం ఇది అని కొనియాడారు. బోనాలు ప్రారంభమవుతున్న సందర్భంగా ఆదివారం ట్విట్టర్ ద్వారా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు ఆమె తెలిపారు. ఆ అమ్మల గన్న అమ్మ చల్లని దయ మనందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకొంటున్నానని అన్నారు.

# బాసర కీచక అధ్యాపకునిపై చర్యలు

- విధుల నుంచి తొలిగించిన ఏవో
- పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

**బాసర:** పరీక్షల్లో పాస్ చేస్తానంటూ విద్యార్థినులను మభ్యపెడుతున్న బాసర ట్రిపుల్ ఐటీ కీచక అధ్యాపకుడిపై కళాశాల ఏవో శ్రీహరి చర్యలు చేపట్టారు. కెమిస్ట్రీ విభాగంలో హెచ్‌వోడీగా పనిచేస్తున్న రవి వరాలని విధుల నుంచి తొలిగిస్తూ నిర్ణయించారు. వివరాల్లోకి వెళితే పదేండ్లుగా కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో పనిచేస్తున్న రవి కళాశాలలోని పీయూసీ-1, పీయూసీ-2 విద్యార్థినులతో చనువుగా ఉంటూ పరీక్షల్లో పాస్ చేస్తానంటూ మభ్యపెట్టి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా ఇదేతరహాలో శనివారం ఓ విద్యార్థినితో చాటింగ్ చేస్తూ వార్డెన్‌కు దొరకడంతో ఆమె కళాశాల ఏవోకు సమాచారం ఇచ్చారు. దీంతో కళాశాల వీసీ అశోక్‌కుమార్ వ్యవహారంపై విచారణ కమిటీ వేశారు. విచారణ అనంతరం విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. కళాశాల ఏవో శ్రీహరి ఫిర్యాదు మేరకు సెక్షన్ 409, 420, 506 కింద కేసు నమోదు చేసినట్లు బాసర ఎస్సై రాజు తెలిపారు. కెమిస్ట్రీ హెచ్‌వోడీ వ్యవహారం బయటకు పొక్కడంతో కళాశాలలో మరికొన్ని విభాగాల అధిపతులు కూడా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పు చేస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని కళాశా అధికారులు హెచ్చరించారు. సోమవారం నుంచి తరగతులు ప్రారంభమవుతుండడంతో విద్యార్థులతోపాటు అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.




రవి వరాల (ఫైల్)

## హన్మకొండలో లెక్చరర్ అరెస్టు

**వరంగల్ క్రైం:** ఇంటర్ విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న జూనియర్ కళాశాల లెక్చరర్‌ను ఆదివారం అరెస్టుచేసినట్లు వరంగల్ క్రైం ఏసీపీ బాబురావు చెప్పారు. ములుగు జిల్లా ఇంచర్లకు చెందిన తొంబురపు రంజిత్‌కుమార్ హన్మకొండలోని ఓ కళాశాలలో లెక్చరర్. ఈ క్రమంలో చదువులో వెనుకబడిన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు చెప్తానని ఫోన్‌నంబర్లు తీసుకొని మాటల్లో పెట్టి అసభ్యకరమైన సందేశాలను, చిత్రాలను పోస్ట్ చేసేవాడు. స్పెషల్ క్లాసుల పేరుతో లైంగిక వేధింపులకు గురవుతున్న విద్యార్థుల్లో ఒకరు ఈ వ్యవహారాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తుచేసిన పోలీసులు రంజిత్‌కుమార్‌పై హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి ఆదివారం అరెస్ట్‌చేశారు.





ఆదివారం చారిత్రక గోల్కొండలోని జగదాంబ అమ్మవారికి రెండో బోనం సమర్పించడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సందడిగా మారిన కోట పరిసరాలు (ఇన్‌సెట్) బోనంతో యువతి

# జోర్దార్‌గా గోల్కొండ బోనాలు

- జగదాంబకు రెండోబోనం సమర్పణ
- భక్తులతో కిక్కిరిసిన కోట పరిసరాలు
- ఘనంగా ఉజ్జయినీ ఘటోత్సవం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో ఆషాఢ బోనాల ఉత్సవాలు జోరందుకున్నాయి. బైండ్ల కళాకారుల డప్పుల దరువు, పోతరాజుల నృత్యాలు, జానపద కళాకారుల ఆటపాటలు, శివసత్తుల పూనకం, భక్తుల కోలాహలం నడుమ ఆదివారం గోల్కొండలోని జగదాంబ అమ్మవారికి రెండో బోనాన్ని సమర్పించారు. గత గురువారం భక్తులు తొలిబోనం పెట్టగా.. ఆదివారం రెండో బోనం సమర్పించారు. జోగినీలు తలపై బోనంతో నృత్యంచేస్తూ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం పెట్టారు. చేతిలో చెర్నాకోలలతో పోతరాజులు వీరంగంచేస్తూ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. వివిధరంగాలవారికి ఆదివారం సెలవుదినం కావడంతో గోల్కొండ బోనాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గోల్కొండ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పలువురు ప్రముఖులు, పలు పార్టీల నాయకులు, అధికారులు, అనధికారులు వేలల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్‌లోని పలుచోట్ల కూడా భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ముషీరాబాద్ డివిజన్ వైఎస్సార్ పార్కు ఎల్లమ్మ దేవాలయంలో బోనాల వేడుకలు జరిగాయి. రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

### ఘనంగా లోథ్‌లు బోనాల ఉత్సవాలు

గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని ధూల్‌పేట ప్రాంతంలో లోథ్‌లు ఆదివారం బోనాల (భగీచే) ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా జరుపుకొన్నారు. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న లోథ్‌లు ధూల్‌పేటలోని గంగాబౌలిలోని పహాడ్‌వాలి మాతా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలను సమర్పించుకున్నారు. ప్రతిఏటా గోల్కొండ బోనాలు ఆరంభమైన మొదటి ఆదివారం ధూల్‌పేటలో భగీచే ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. లోథ్ క్షత్రియ సదర్ పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గోషామహల్ ఎమ్మెల్యే టీ రాజాసింగ్ లోథా, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

### ఘటోత్సవ అలంకరణను ప్రారంభించిన మంత్రి తలసాని

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవాల్లో భాగంగా ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఘటోత్సవ అలంకరణను ప్రారంభించారు. దేవాలయం నుంచి మధ్యాహ్నం అమ్మవారిని అలంకరణ నిమిత్తం కర్బలా మైదానానికి తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారికి మంత్రి తలసాని పూజలు చేశారు. రాత్రి ఏడు గంటలకు కర్బలా మైదానంలో ముస్తాబైన అమ్మవారిని ఘటం ఊరేగింపుగా తిరిగి భక్తుల నృత్యాల మధ్య మహంకాళి దేవాలయానికి తరలించారు.

# మబ్బుల మురిపెమే!

- మందగమనంలో రుతుపవనాలు
- బంగాళాఖాతం మీదుగా నెలకొన్న ప్రతికూల పవనాలే కారణం
- రాష్ట్రంలో 48% లోటు వర్షపాతం
- మరో నాలుగురోజులు ప్రతికూలతే
- ఆ తర్వాత భారీ వానలు పడొచ్చు
- వాతావరణ కేంద్రం వెల్లడి
- కరీంనగర్, కుమ్రంభీం జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయి. బంగాళాఖాతం మీదుగా నెలకొన్న ప్రతికూల పవనాల ప్రభావంతో రుతుపవనాలు నెమ్మదించాయి. కొంత ఆలస్యంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన రుతుపవనాలు మొదట్లో జోరుచూపించి.. ఆ తర్వాత మందగించాయి. రోజూ దట్టంగా కమ్ముకొంటున్న మేఘాలు చినుకు రాల్చకుండానే కనుమరుగవుతున్నాయి. దీంతో రాష్ట్రంలో లోటు వర్షపాతం 48 శాతానికి చేరుకున్నది. రెండు జిల్లాల్లో మినహాయించి మిగతా అన్నిచోట్ల లోటువర్షపాతమే నమోదైంది. జూన్ 22న నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకగా, కొద్దిరోజులే మంచి వర్షాలు పడ్డాయి. రుతుపవనాలు ఉత్తర భారతం వైపు బలంగా కదులుతుండటం, గాలిలో తేమ కూడా తగ్గిపోవడంతో తెలంగాణ, ఏపీల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

### పెరిగిన వర్షపాతం లోటు

రుతుపవనాలు మందగించి రాష్ట్రంలో వర్షపాతం లోటు బాగా పెరుగుతున్నది. జూన్‌లో 35 శాతం వరకు ఉన్న లోటు.. ప్రస్తుతం 48 శాతానికి పెరిగింది. ఈ నెలలో మొదటి రెండ్రోజులు కురిసిన భారీ వర్షాలకు లోటు 30 శాతానికి తగ్గింది. ఆ తర్వాత ప్రతికూల పరిస్థితులతో భారీగా లోటు వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌తోపాటు ఉత్తర తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మాత్రమే భారీ వానలు కురువగా, మిగతాచోట్ల ఆ స్థాయి వర్షాలు పడలేదు. కరీంనగర్, కుమ్రంభీం జిల్లాల్లో మాత్రమే సాధారణం కంటే అధిక వర్షం పడింది. కరీంనగర్‌లో 4 శాతం, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 3 శాతం ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, మిగతా అంతటా లోటు వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లాలో 76 శాతం, నల్లగొండలో 63 శాతం, సూర్యాపేటలో 59 శాతం, కొత్తగూడెంలో 52 శాతం, యాదాద్రి భువనగిరిలో 51 శాతం, రాజన్న సిరిసిల్లలో 49 శాతం, నిర్మల్‌లో 48 శాతం, పెద్దపల్లిలో 46 శాతం, జోగుళాంబ గద్వాల, వరంగల్ రూరల్ జిల్లాల్లో 44 శాతం చొప్పున, మేడ్చల్ మల్కాజిగిరిలో 36 శాతం, సంగారెడ్డిలో 35 శాతం, వనపర్తిలో 34 శాతం, మెదక్‌లో 33 శాతం, ఆదిలాబాద్ జిల్లాలో 32 శాతం, మంచిర్యాలలో 31 శాతం, వికారాబాద్‌లో 29 శాతం, నిజామాబాద్‌లో 28 శాతం, రంగారెడ్డిలో 27 శాతం, కామారెడ్డిలో 25 శాతం, సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్ జిల్లాల్లో 20 శాతం చొప్పున, మహబూబాబాద్‌లో 19 శాతం, నాగర్‌కర్నూల్‌లో 18 శాతం, జనగామలో 16, హైదరాబాద్‌లో 10 శాతం, జగిత్యాలలో 7 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

### అల్పపీడనం తర్వాత వానలు

బంగాళాఖాతం మీదుగా గాలులు అనుకూలంగా లేకపోవడతోరుతుపవనాలు మందగమనంలో సాగుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. ఈ కారణంగా వచ్చే నాలుగురోజుల వరకు పెద్దగా వర్షాలు పడకపోవచ్చని తెలిపారు. సాధారణంగా రుతుపవనాలు ఉత్తర భారతం వైపు మళ్లినప్పుడు.. రాష్ట్రంలో వాటి ప్రభావం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ నెల పదిన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదన్నారు. అల్పపీడనం ఏర్పడ్డాక రెండు రోజులకు తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురువొచ్చని కరుణాకర్‌రెడ్డి చెప్పారు.

### గ్రేటర్ హైదరాబాద్‌లో ఈదురుగాలులు

**హైదరాబాద్ సిటీబ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్‌లో రాగల మూడ్రోజుల వరకు పెద్దగా వర్షాలు ఉండబోవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడొచ్చని పేర్కొన్నారు. దక్షిణ, పశ్చిమ దిశనుంచి పవనాలు వీస్తున్నందున గ్రేటర్‌లో ఈదురుగాలులు ఉన్నాయని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 33, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.3 డిగ్రీలు, గాలిలో తేమ 52 శాతంగా నమోదైందన్నారు.

### పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం ఓ మోస్తరు వానలు పడ్డాయి. నిజామాబాద్‌లో సాయంత్రం అరగంటపాటు భారీ వర్షం పడింది. డిచ్‌పల్లి, ఇందల్వాయి, బోధన్, ఎడపల్లి, మోపాల్ తదితర మండలాల్లో వాన కురిసింది. సిద్దిపేటలో చిరుజల్లులు పడ్డాయి. కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. హుజూరాబాద్, జమ్మికుంట, సైదాపూర్, ఇల్లందకుంట, మానకొండూర్, చొప్పదండి, గంగాధర, రామడుగు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడగా, కరీంనగర్, తిమ్మాపూర్, గన్నేరువరం, చిగురుమామిడి, శంకరపట్నం తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. జగిత్యాల జిల్లాలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.

# అవసరాలు తీరాకే నీటిని తరలించాలి

- గోదావరి జలాల తరలింపును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలి
- ఆల్మట్టి ఎత్తు పెంపు దృష్ట్యా కృష్ణాను శ్రీశైలానికి పరిమితం చేయాలి
- గోదావరి మథనం రౌండ్‌టేబుల్‌లో ఇంజినీర్ల మనోగతం



ఖైరతాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పరిధిలోని గోదావరి, కృష్ణా బేసిన్‌లో భవిష్యత్ తాగు, సాగునీటితోపాటు పారిశ్రామిక ఇతర అవసరాలను అంచనా వేసి.. వాటిని తీరుస్తూనే గోదావరిజలాల తరలింపు చేపట్టాలని పలువురు ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు. రెండుతెలుగు రాష్ట్రాలు కృష్ణా బేసిన్‌కు గోదావరి జలాల తరలింపుపై మథనం చేస్తున్న దరిమిలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణశాఖ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. గత అనుభవాల దృశ్య రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జరిగే ఒప్పందాల్ని పకడ్బందీగా చేసుకోవాలని పలువురు ఇంజినీర్లు పేర్కొన్నారు. గోదావరి జలాల తరలింపు ప్రక్రియ భారీ వ్యయంతో కూడుకున్నదని, అందుకే ఈ ప్రాజెక్టును జాతీ య ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఇంజినీర్ల అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తామని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణశాఖ చైర్మన్ రామేశ్వరరావు తెలిపారు.

### సీఎం కేసీఆర్ నిర్ణయం సరైనదే..

ఖర్చుఎంతైనా సరే.. రైతులకు సాగునీరు అందించడం ప్రధానమన్న సీఎం కేసీఆర్ నిర్ణయం సరైనదేనని ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి అన్నారు. దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోని ప్రాంతాలకు మానవత్వకోణంలో నీటిని అందించాలన్నారు. గోదావరిజలాల్ని లక్ష్మీదేవిపల్లికి తరలించి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా శ్రీశైలం, జూరాలకు తరలించాలని రిటైర్డ్ ఎస్‌ఈ రామలింగారెడ్డి తెలిపారు. నదీజలాల్ని రెండురాష్ట్రాలు వినియోగించుకోవాలని విశ్రాంత ఇంజినీర్ లక్ష్మీనారాయణ సూచించారు. ఒప్పందాల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, జూరాల ఆయకట్టుకు సైతం రక్షణ కల్పించేలా చూడాలని ఇంజినీర్ల జేఏసీ కార్యదర్శి విజయ్‌కుమార్ చెప్పారు. విశ్రాంత ఇంజినీర్లు దామోదర్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు అభిప్రాయాలను వ్యక్తంచేశారు.

### బేసిన్ అవసరాలు తీర్చాలి

ఇతర బేసిన్‌కు జలాల్ని తరలించాల్సి వచ్చినపుడు ముందుగా ఆ బేసిన్ అవసరాల్ని పూర్తిగా తీర్చాల్సిన అవసరముంది. దీంతోపాటు 20-30 ఏండ్ల తర్వాత నీటి లభ్యత ఎలా ఉంటుందనేది కూడా అంచనావేయాలి. కేవలం కాగితాలపై నీటి లభ్యత కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన జరుగాలి.

– సానా మారుతి

### ఒప్పందాలు పకడ్బందీగా ఉండాలి

రెండు రాష్ట్రాల మధ్య జల వనరుల ఒప్పందాలు చాలా పకడ్బందీగా ఉండాలి. లేకపోతే గతంలోని బాబ్లీ పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉన్నది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణం రేపు ఉంటుందా? అనే కోణంలో కూడా ఆలోచించాలి.

– అనంతరాములు

### కృష్ణాజలాల్ని శ్రీశైలం వరకు వాడుకోవచ్చు

ఆల్మట్టి ఎత్తు దరిమిలా మున్ముందు కృష్ణాజలాల్ని శ్రీశైలం వరకు అవసరాలకు వాడుకుంటే బాగుంటుంది. నాగార్జునసాగర్‌కు గోదావరి జలాలను తరలించాలి. శ్రీశైలానికి గోదావరిజలాల్ని తరలించడం చాలా క్లిష్టం. 450 కిలోమీటర్ల అలైన్‌మెంట్‌లో 150 కిలోమీటర్ల మేర సొరంగ మార్గాన్ని నిర్మించాల్సి ఉంటుంది. పోలవరం నుంచి రెండు టీఎంసీలను సాగర్‌కు తరలించేందుకు ఏపీ ఇంజినీర్లు కూడా ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు.

– ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి

### జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలి

గోదావరి జలాలను శ్రీశైలానికి తరలించేందుకు రూపొందిస్తున్న ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపడితే బాగుంటుంది. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వరకు గోదావరి జలాల్ని తరలిస్తే అటు శ్రీశైలం, జూరాలతోసహా ఎటువైపైనా తరలించేందుకు సౌలభ్యం ఉంటుంది.

– రంగారెడ్డి


JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY, HYDERABAD.
Memorandum of Cooperation
Blekinge Institute of Technology (BTH), Sweden.
STUDY IN INDIA AND SWEDEN
Admission Notification for 10th Batch

Applications are invited for admission into 5-Year Integrated Double Degree Masters' Programs (IDDMP) offered by JNTUH, India collaboration with Blekinge Institute of Technology, Sweden (Estd. Government of Sweden) in the faculty of ECE and CSE for the academic year 2019-20. The student will undergo mandatory education of 3.5 years at College of Engineering, JNTUH Kukatpally campus and 1.5 years at BTH, Sweden.

| Branch Intake | Last date for submission of application | Admission Counselling | For Brochure/Application Tuition Fee/other details |
|---|---|---|---|
| ECE-(30) CSE-(40) | 13-07-2019 16-07-2019 (with fine of Rs.1000/- | 18-07-2019 Time:11.00 A.M. | www.jntuh.ac.in |

Awareness Session : Prospective applicant's/parent's can attend session scheduled on 13-07-2019, (2.30 to 3.30PM) Venue: Seminar Hall UGC - HRDC building, JNTU Hyderabad, Kukatpally Campus.
Advt. Released by BTH with reference to notification released by JNTUH on 03-07-2019



TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION HYDERABAD
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TSECET-2019 ADMISSIONS
FINAL PHASE & SPOT ADMISSIONS NOTIFICATION
PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING

The Qualified candidates of TSECET-2019 (Diploma Holders including Pharmacy & B.Sc Mathematics Candidates) Who have participated or not participated in first phase of counselling and desirous of seeking admission into University and Private Engineering & Pharmacy colleges of Telangana State Under lateral entry system are informed that final phase web counselling will commence on 11-07-2019. The spot admissions into Private Engineering & Pharmacy colleges will be conducted on 20-07-2019. Further details are placed in the website:https://tsecet.nic.in

Date: 06-07-2019 Sd/- Navin Mittal, IAS
Place: Hyderabad Convenor, TSECET-2019&CTE
DIPR RO. No. 556-DP/CL/Advt/1/2019-20, Dt: 06/07/2019


## మైనార్టీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1 శిక్షణకు దరఖాస్తుల గడువు పెంపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1 ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20 వరకు గడుపు పొడిగించినట్టు మైనార్టీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బీ షఫీ ఉల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. దరఖాస్తులను అబిడ్స్‌లోని తెలంగాణ స్టేట్ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో సమర్పించాలని కోరారు.

## 25 టన్నుల బియ్యం పట్టివేత

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ :** అక్రమంగా తరలిస్తున్న 25 టన్నుల బియ్యాన్ని ఆదివారం ఆదిలాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ నుంచి మహారాష్ట్రలోని నాగాపూర్‌కు లారీలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు 25 టన్నుల బియ్యంలోడు లారీని పట్టుకున్నారు.

# తుది అంకానికి గోదావరి మథనం

- రాంపూర్ అలైన్‌మెంట్‌తోనే తెలంగాణ ఇంజినీర్ల నివేదిక
- డిండికి అనుసంధానించాలని ప్రతిపాదించనున్న కమిటీ
- నేడు కొలిక్కిరానున్న ప్రాథమిక అంచనా వ్యయం
- రేపు ఏపీ ఇంజినీర్లతో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గోదావరి జలాల తరలింపుపై తెలంగాణ ఇంజినీర్ల మథనం తుది అంకానికి చేరింది. పోలవరం నుంచి నాగార్జునసాగర్‌కు రోజుకు రెండు టీఎంసీల గోదావరిజలాల తరలింపుపై ఏపీ ఇంజినీర్లు నివేదిక రూపొందిస్తుండగా... రాంపూర్ నుంచి జలాల తరలింపుపై తెలంగాణ ఇంజినీర్ల కమిటీ కసరత్తు చేస్తున్నది. పలు దఫాలుగా భేటీఅయిన కమిటీ చివరకు రాంపూర్ అలైన్‌మెంట్‌పైనే ప్రభుత్వానికి తుది నివేదిక ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ అలైన్‌మెంట్‌కు అనుగుణంగా చేపట్టే ప్రాజెక్టుకు ప్రాథమికంగా రూ.70 వేల నుంచి 80 వేల కోట్ల వ్యయమవుతుందని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. ప్రాథమిక అంచనా వ్యయం సోమవారం కొలిక్కి వచ్చే అవకాశమున్నది. దీంతో మంగళవారం ఏపీ ఇంజినీర్లతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ ఇంజినీర్ల కమిటీ పలుదఫాలుగా సమావేశమై ములుగు జిల్లా పరిధిలోని రాంపూర్ పాయింట్ నుంచి గోదావరిజలాల్ని మళ్లించాలనే ప్రతిపాదనపై అధ్యయనం చేసింది. రాంపూర్ నుంచి రోజుకు రెండు టీఎంసీల చొప్పున లక్నవరం.. ఆపై డీబీఎం-38 ద్వారా కాకతీయకాల్వలోకి తరలిస్తారు. ప్రస్తుతం కాకతీయ కాల్వ 8,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో ఉన్నది. దీనిని రెండు టీఎంసీల తరలింపునకు అనుగుణంగా వెడల్పు చేయాల్సి ఉంటుందని కమిటీలో చర్చించారు. కాకతీయ కాల్వ నుంచి జలాలు మూసీలోకి చేరి ఆపై నల్లగొండ సమీపంలోని ఉదయసముద్రంలోకి చేరతాయి. ఇక్కడ ఒకమార్గంలో గ్రావిటీతో నాగార్జునసాగర్‌కు చేరతాయి. మరో మార్గంలో ఉదయసముద్రం అలుగుపోయడంతో అడవిదేవులపల్లి చెరువు ద్వారా సాగర్‌కు చేరతాయి. ఇలా ఒక్క టీఎంసీ నీటిని తరలించాలనేది కమిటీ ప్రతిపాదన. ఉదయసముద్రం దగ్గరే మరోమార్గం ద్వారా శ్రీశైలం జలాశయానికి మార్గాన్ని కూడా ఈ ప్రతిపాదనలో జోడించారు. నల్లగొండ సమీపంలోని చర్లపల్లి వద్ద జలాలను మళ్లించి.. కనగల్, డిండి మీదుగా వనపర్తి జిల్లా పరిధిలోని ఎల్లూరు దగ్గర శ్రీశైలం జలాశయంలో పోస్తారు. అయితే ఇందుకుగాను దాదాపు 90 కిలోమీటర్ల మేర సొరంగమార్గాన్ని నిర్మించాల్సి వస్తుంది. ఇప్పటివరకు కమిటీ రూపొందించిన ప్రతిపాదనలో ఈ అలైన్‌మెంట్‌తోపాటు అదనంగా శ్రీశైలానికి జలాల తరలింపు క్రమంలోనే నాంపల్లి దగ్గర (సొరంగ మొదలయ్యే పాయింట్) డిండి ఎత్తిపోతల పథకానికి అనుసంధానించాలని కూడా ప్రతిపాదించారు.

**తెలంగాణ అవసరాలకు పెద్దపీట**

రాంపూర్ అలైన్‌మెంట్‌లో ఇంజినీర్ల కమిటీ ఒకవైపు సాగర్, శ్రీశైలానికి గోదావరిజలాల తరలింపును దృష్టిలో ఉంచుకుంటూనే మార్గమధ్యంలోని ఆయకట్టు స్థిరీకరణకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ఎస్సారెస్పీ ఒకటి, రెండు దశలతోపాటు, ఉదయసముద్రం, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుల కింద ఆయకట్టు స్థిరీకరణకు కూడా గోదావరిజలాలను వినియోగించాలని ప్రతిపాదిస్తున్నారు. అంతేగాకుండా డిండి ఎత్తిపోతల పథకాన్ని కూడా అనుసంధానిస్తుండటంతో అవసరమైతే రాంపూర్ నుంచి రెండున్నర టీఎంసీలను తరలించాలనే అంశాన్ని కూడా ప్రతిపాదనలో పొందుపరుస్తున్నట్టు సమాచారం. అలైన్‌మెంట్‌కు అనుగుణంగా ఎంత ఖర్చవుతుందనే దానిపై సోమవారం ఒక స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలిసింది. ప్రాథమికంగా రూ.70 వేల నుంచి 80 వేల కోట్ల వ్యయమవుతుందని అంచనావేస్తున్న ఇంజినీర్లు.. ఇందులో రాంపూర్ వద్ద బరాజ్, కాల్వ, సొరంగమార్గం ఇలా దేనికి ఎంత వ్యయం అవుతుందనే దానిపై ప్రాథమిక వివరాల్ని ప్రతిపాదనలో పొందుపరచనున్నారు. వ్యయం అంచనాను కొలిక్కి తీసుకువచ్చిన తర్వాత మంగళవారం ఏపీ ఇంజినీర్లతో సంయుక్త సమావేశానికి తెలంగాణ కమిటీ సిద్ధమవుతున్నది.




## నా భూమి ఇతరులకు పట్టాచేశారు



**అక్కన్నపేట:** నా పేరు ఎడబోయిన నారాయణరెడ్డి. నేను రిటైర్డ్ టీచర్‌ను. మాది సిద్దిపేట జిల్లా, అక్కన్నపేట మండలం, రామవరం గ్రామం. నాకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 160లో 7.36 ఎకరాల భూమి ఉన్నది. 20 ఏండ్ల నుంచి రెవెన్యూ రికార్డుల్లో నా పేరిటే ఈ భూమి ఉన్నది. అయితే ఇటీవల రెవెన్యూ అధికారులు నందారం గ్రామానికి చెందిన కొందరి వద్ద పైసలు తీసుకొని నాకు తెలియకుండా అక్రమంగా, అన్యాయంగా ఆర్వోఆర్ ద్వారా నా భూమిని వాళ్లకు పట్టాచేశారు. కొత్త పాస్‌పుస్తకాలు, రైతుబంధు చెక్కులు వాళ్లకే వచ్చాయి. విషయం తెలిసి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి అధికారులను నిలదీయగా పాస్‌పుస్తకాలు, రైతుబంధు చెక్కులు నిలిపివేశారు. అనంతరం హుస్నాబాద్ ఆర్డీవోకు ఫిర్యాదుచేశా. నా భూమిని నందారం గ్రామానికి చెందిన వ్యక్తుల పేరిట ఎలా మార్పిడి చేశారో తెలుపాలని సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు కూడా చేశా. అలాగే ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లా. ఇప్పటివరకు నాకు న్యాయం జరుగలేదు. ఇప్పటికైనా ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి నా భూమి నాకు పట్టా చేసి పాస్‌పుస్తకాలు, రైతుబంధు వచ్చేలా చూడాలని ధర్మగంట ద్వారా అధికారులను కోరుతున్నా.

**- ఎడబోయిన నారాయణరెడ్డి, రిటైర్డ్ టీచర్**

## పైసలిస్తేనే పట్టా చేస్తారట!

- దుగ్గొండిలో రెవెన్యూ అధికారుల ఇష్టారాజ్యం
- న్యాయం కోసం రైతు వేడుకోలు



పోరెడ్డి సాంబరెడ్డి

**దుగ్గొండి:** వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం బంధంపల్లి గ్రామానికి చెందిన పోరెడ్డి సాంబరెడ్డి తండ్రి వీరయ్యకు సర్వే నంబర్లు 105 బీ 4,105సీ, 122 బీ 3, 550 బీ, 122 ఏ 1,551 డీ, 552 బీ, 552 డీ లో 2.22 ఎకరాల భూమి ఉన్నది. దీనికి 2010లో రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్‌పుస్తకం అందించారు. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా 2017లో సాదాబైనామాకు దరఖాస్తు చేసుకొన్నారు. కానీ రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ రికార్డుల్లో సాంబరెడ్డి భూమిని ఎక్కించలేదు. బాధిత రైతు రెండేండ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులిస్తేనే పనిచేస్తామని ఆఫీస్ చుట్టూ తిప్పుకొంటున్నారని సాంబరెడ్డి వాపోయారు. అధికారుల చుట్టూ తిరగ్గా తిరగ్గా పాస్‌పుస్తకం ఇచ్చినా.. అందులో 24 గుంటల భూమిని ఎక్కించలేదు. ఇదేమిటని వీఆర్వోను అడిగితే, అది ప్రభుత్వ భూమి అని చెప్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అదే సర్వే నంబర్లలోని మిగతా రైతులకు పూర్తి విస్తీర్ణంలో పట్టాలు ఇచ్చి తనకు మాత్రం ఇవ్వలేదని తెలిపారు. ఇదే విషయాన్ని వీఆర్వోను అడిగితే.. వాళ్లు డబ్బులివ్వడం వల్ల పూర్తి విస్తీర్ణం రికార్డుల్లోకి ఎక్కిందని, మీరు కూడా డబ్బులు ఇస్తే వెంటనే రికార్డుల్లోకి ఎక్కించి పాస్‌పుస్తకం ఇస్తామని నిస్సిగ్గుగా అడిగినట్టు పేర్కొన్నారు. పని కావాలంటే డబ్బులివ్వక తప్పదు కాబట్టి వీఆర్వోకు సొమ్ములిచ్చామని.. ఆ తర్వాత కూడా వీఆర్వో పని చేయలేదని రైతు సాంబరెడ్డి తెలిపారు. పాస్‌పుస్తకాలు ఎందుకు రావట్లేదని అధికారులను అడిగితే, 'మా ఇబ్బందులు మాకున్నాయని, మా పైఅధికారులకు డబ్బులివ్వకపోతే మా ముఖం చూస్తలేరు' అని చెప్తున్నట్టు బాధిత రైతు వాపోయారు. తనకే కాకుండా అనేక మంది రైతులు ఇలాంటి సమస్యలే ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఉదాహరణకు దుగ్గొండి మండలంలోనే లక్ష్మీపురం గ్రామ శివారులోని సర్వే నంబర్లు 105 బీ 4, 105 సీ, 122 బీ 3, 550 బీ, 122 ఏ 1, 551 డీ, 552 బీ, 552 డీ లో ఉన్న రైతులందరికీ పూర్తి విస్తీర్ణంతో పాస్‌పుస్తకాలు వచ్చాయి కానీ, అదే బంధంపల్లి గ్రామానికి తనకు 550 బీ, 552 డీ సర్వే నంబర్లలోని 24 గుంటల భూమికి పాస్‌బుక్ రావటం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు.

## రెవెన్యూ ప్రక్షాళనతోనే రైతులకు న్యాయం



రెవెన్యూశాఖను ప్రక్షాళన చేస్తేనే సామాన్య రైతులకు సరైన న్యాయం జరుగుతుంది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకున్న నిర్ణయం సరైనదే. రెవెన్యూ వ్యవస్థలో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకొని కొంత మంది అమాయకులను పీడిస్తున్నారు. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిందే. ధర్మగంట ద్వారా భూసమస్యలను వెలుగులోకి తెస్తూ రైతులకు అండగా నిలుస్తున్న 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ధన్యవాదాలు. ధర్మగంట ద్వారా ఇన్నాళ్లకు రైతులకు ఓ పరిష్కార వేదిక, భరోసా దొరికినట్టయింది.

**- పంగ విజయ్‌కుమార్, కోనాపూర్, సారంగాపూర్ మండలం, జగిత్యాల జిల్లా**

# భూమి ఉన్నా దక్కని రైతుబీమా

రికార్డులు ఆన్‌లైన్ అయినా కొత్త పాస్‌బుక్ ఇవ్వని అధికారులు

పాస్‌పుస్తకం లేకపోవడంతో బీమాకు ఎన్‌రోల్ చేయని వ్యవసాయశాఖ

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో రైతు కుటుంబం వెతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఇందులూరు గ్రామానికి చెందిన నాగులంచ లింగారావుకు అదే గ్రామంలోని వివిధ సర్వే నంబర్లలో 1.32 ఎకరాల పట్టా భూమి ఉన్నది. ఇది వారసత్వంగా వచ్చిన భూమి. దీనికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నాయి. భూరికార్డుల ప్రక్షాళన అనంతరం నాగులంచ లింగారావుకు కొత్త పాస్‌పుస్తకం రాలేదు. ఇందుకోసం లింగారావు, అతడి కుమారుడు శ్రీనివాసరావు రెవెన్యూ అధికారులను పలుమార్లు కలిసి విన్నవించుకొన్నారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. మరోవైపు వ్యవసాయ అధికారులు రైతుబీమా కోసం ఎన్‌రోల్ చేసుకోవాలంటే కొత్త పాస్‌పుస్తకం కావాలని అడిగారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపినా.. వాళ్లు స్పందించలేదు. జూన్ 3వ తేదీన లింగయ్య మరణించారు. దీంతో రెవెన్యూ అధికారులను గట్టిగా నిలదీయడంతో పట్టాదారు పాస్‌పుస్తకం ఆన్‌లైన్ కాపీని అందజేశారు. చిత్రమేమంటే.. ఈ కాపీ ప్రకారం 2018 మే నెలలోనే కొత్త రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. ఈ వివరాలతో లింగయ్య కుమారుడు శ్రీనివాసరావు వ్యవసాయాధికారులను అడిగితే.. రైతు చనిపోవడానికి ముందు ఎన్‌రోల్ చేసుకోలేదు కాబట్టి బీమా వర్తించదని తేల్చిచెప్పారు. ఇదే ఆన్‌లైన్ పాస్‌బుక్ కాపీని రెవెన్యూ అధికారులు ముందే ఇచ్చి ఉంటే.. లింగయ్య కుటుంబానికి బీమా అయినా వచ్చేది. రెవెన్యూ అధికారుల అలసత్వం కారణంగా లింగయ్య కుటుంబం దారుణంగా నష్టపోయింది. ఏడాది క్రితం రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదైనా.. ఇప్పటివరకు పాస్‌పుస్తకం అందివ్వకపోగా, కనీసం దాని ఆన్‌లైన్ కాపీని కూడా ఇవ్వకపోవడం వల్ల లింగయ్య కుటుంబానికి బీమా కింద వచ్చే రూ.5 లక్షలు రాకుండా పోయాయి. భూమి ఉండి కూడా ఒక రైతు కుటుంబం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి బలైపోయింది.

### తీవ్రంగా నష్టపోతున్నాం



నాన్న పేరు మీద పట్టా ఉన్నది. అది వారసత్వంగా వచ్చిన భూమి. అయితే కొత్త పాస్‌పుస్తకం లేకపోవడంతో రైతుబీమా అందలేదు. ముందుగా రైతుబీమా కోసం ఎన్‌రోల్ చేసేందుకు నాన్న, నేను రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగాం. కానీ పాస్‌పుస్తకం ఇవ్వలేదు. పాస్‌బుక్ లేదని వ్యవసాయశాఖ అధికారులు పేరు చేర్చుకోలేదు. అమ్మ రైతు కూలీగా జీవనం కొనసాగిస్తున్నది. పోయిన భర్తను ఆమెకు ఎలాగూ తీసుకురాలేం.. కనీసం సీఎం కేసీఆర్ ఇస్తున్న రైతుబీమా రూ. 5 లక్షలు వచ్చేలాచేయాలని అధికారులను వేడుకొంటున్నాం.

**- శ్రీనివాస్ రావు, లింగారావు కుమారుడు**

### రెవెన్యూ నిర్లక్ష్యం లేదు

పాస్‌పుస్తకాలు ప్రింట్ అయి వచ్చిన వెంటనే అందరికీ ఇస్తున్నాం. ఇందులో మా నిర్లక్ష్యం ఏమీ లేదు. రైతుబీమాకు సంబంధించి వ్యవసాయ అధికారులదే పూర్తి బాధ్యత.

**- విజయ్‌కుమార్, తిప్పర్తి తాసిల్దార్**

### ఎన్‌రోల్ చేసుకోలేదు


రైతు బతికి ఉన్నప్పుడు రైతుబీమా కోసం ఎన్‌రోల్ చేసుకోలేదు. కాబట్టి రైతుకు భూమి ఉండి కూడా అర్హత కోల్పోయాడు. అకాల మరణానికి ముందే భూమి వివరాలు ఇచ్చి ఉంటే రూ.5 లక్షలు వచ్చేవి. ఇప్పుడు రైతుబీమా వచ్చేందుకు అవకాశం లేదు. పట్టాదారు పాస్‌పుస్తకం బదులు ఆన్‌లైన్ కాపీ అయినా ముందే ఇచ్చి ఉండాల్సింది.

**- బాలరాజు, అసిస్టెంట్ ఏవో**

## కబ్జాదారులకే రెవెన్యూ అండ

- ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఆక్రమించుకొన్న భూస్వాములు
- అసైన్‌మెంట్ చట్టం యథేచ్ఛగా ఉల్లంఘన
- నిర్లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెవెన్యూ అధికారుల తీరు
- అశ్వారావుపేటలో భూమికోసం దశాబ్దాలుగా ఓ రైతు పోరాటం

**అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని శీమకుర్తి శివయ్య బజార్‌కు చెందిన రొయ్యల చిన్నోడు, ఆయన భార్య మాణిక్యం 1968 నుంచి సర్వే నంబర్ 911 సరిహద్దులోని 946, 947 (క్ర.సం.46, 47)లో పదెకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 1970 లో నిరుపేదలకు భూ పంపిణీ చేయాలన్న నిర్ణయం మేరకు ప్రభుత్వ భూమిని సాగుచేసుకొంటున్న పేద రైతులకు అప్పటి సర్కారు హక్కు పట్టాలను జారీచేసింది. ఈ క్రమంలో చిన్నోడు, అతని భార్య మాణిక్యంకు (పట్టా నంబర్ ఆర్సీ ఏ8/753/3/70, తేదీ 02.02.1970) ఐదెకరాల చొప్పున భూమి లభించింది. దీనిపై వీళ్లు భూమి శిస్తు కూడా చెల్లించారు. వీరు సాగు చేసుకొనేందుకు ప్రభుత్వం బోరు కూడా వేసింది. కొన్నాళ్ల తర్వాత ఒక ప్రమాదంలో చిన్నోడు మరణించడంతో భార్య మాణిక్యం కొన్ని నెలలపాటు భూమివైపు వెళ్లలేదు. తాను కుదుటపడిన తర్వాత సాగుచేసుకోవడానికి భూమ్మీదకు వెళ్లేసరికి కొందరు భూస్వాములు వీరి భూమిని కబ్జాచేశారు. దీంతో బాధిత రైతు రెవెన్యూ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. కానీ సమాధానం రాలేదు. 1998లో ప్రభుత్వం చేపట్టిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో అప్పటి తాసిల్దార్ కుమారస్వామి భూవివాదమై విచారణకు హాజరు కావాల్సిందిగా మాణిక్యంకు నోటీసు ఇచ్చారు. విచారణకు మాణిక్యం హాజరైనప్పటికీ ప్రత్యర్థులు రాకపోవడంతో మరోసారి విచారణకు ఇరువర్గాలను



20-01-1977న రెవెన్యూ అధికారులు జారీచేసిన భూమి తాత్కాలిక శిస్తు రసీదు

పిలుస్తానని చెప్పి మాణిక్యంను పంపించివేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరుగలేదు. కలెక్టర్, పాల్వంచ ఆర్డీవో, తాసిల్దార్లకు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం దక్కలేదు. 2000 సంవత్సరంలో మాణిక్యం కూడా అనారోగ్యంతో మరణించడంతో ఆమె కుమారుడు వెంకటరామారావు భూమి కోసం పోరాడుతున్నారు. 2017లో ఈ పహాణీ తీసుకొన్నారు. ఈ పహాణీలో సర్వే నంబర్లు 911/67/1లో 31 గుంటలు, 911/111/1లో 5 ఎకరాలు పట్టా కింద మాణిక్యం పేరిటే ఉన్నది. గ్రామ పహాణీలో ఇవే సర్వే నంబర్లలో రొయ్యల మాణిక్యం పేరు పట్టాదారు కాలంలో ఉండగా అనుభవ కాలంలో మాత్రం ఏకయ్య, చంద్రయ్య పేర్లు ఉన్నాయి. ఇక్కడ వీరి ఇంటి పేర్లను కూడా చూపలేదు. తమ తల్లి దండ్రులకు చెందిన భూమి రికార్డుల్లో తారుమారయిందని, వీటిని సవరించాలని అధికారులను బాధితుడు వేడుకొంటున్నారు.



### మా భూమిని అప్పగించండి

భూమి కోసం మా అమ్మ మాణిక్యం శాయశక్తులా పోరాటం చేసింది. అయినా ఫలితం రాలేదు. రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి సహకారం అందటం లేదు. ఆక్రమణదారులు యథేచ్ఛగా సాగు చేసుకొంటున్నారు. పేదల భూములను భూస్వాములు ఆక్రమించుకొంటుంటే కొందరు రెవెన్యూ అధికారులు అసైన్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించి వారికి కూడా హక్కు పట్టాలు జారీచేస్తున్నారు. భూస్వాములు ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములకు ఎలా అర్హులు? అన్నది రెవెన్యూ అధికారులకే తెలియాలి. ఆక్రమణకు గురైన భూమిని సాధించే వరకు పోరాటం కొనసాగిస్తా.

**- రొయ్యల వెంకట రామారావు**

### లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తాం

రొయ్యల వెంకట రామారావు సమస్య మా దృష్టికి రాలేదు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకొంటాం. రికార్డులు ఉంటే బాధిత రైతుకు తప్పకుండా న్యాయం చేస్తాం.

**- రాఘవరెడ్డి, తాసిల్దార్, అశ్వారావుపేట**

## పట్టా ఇచ్చి.. పొజిషన్ మరిచారు

- భూమికోసం 18 ఏండ్లుగా మాజీ సైనికుడి యుద్ధం
- పంచనామా చేసినా సర్వే చేయని రెవెన్యూ అధికారులు
- పోరాటంలో అలసి.. పక్షవాతంతో మంచంపట్టిన మాజీ జవాను

అతనో మాజీ సైనికుడు. భారత్-చైనా యుద్ధానంతరం పదవీవిరమణ పొందిన ఈ మాజీ జవాను.. ప్రభుత్వం తనకు కేటాయించిన భూమిని పొందడానికి రెవెన్యూశాఖతో పోరాడి పోరాడి అలసిపోయారు. రెవెన్యూశాఖతో పోరాడటం కంటే చైనాతో యుద్ధంచేయడం తేలికనే స్థితికి చేరుకొన్నారు. రెవెన్యూశాఖ చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయారు. పక్షవాతం సోకి.. మంచానపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రేపాక మధుసూదన్‌రెడ్డిది అంతులేని ఆవేదన. ఎప్పటికైనా తనకు న్యాయం జరుగకపోతుందా.. అని ఇప్పటికీ తన భూమి కోసం పోరాడుతూనే ఉన్నారు.



బాధితుడు మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్ సిటీబ్యూరో నమస్తే తెలంగాణ:** రెడ్లరేపాక గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి భారత్- చైనా మధ్య యుద్ధం జరిగిన రోజుల్లో సైన్యంలో చేరారు. 1962 నుంచి 1966 వరకు సైన్యంలో పనిచేశారు. ఉపాధి లేకపోవడం, పింఛన్‌కు నోచుకోకపోవడంతో తనకు మాజీ సైనికుల కోటా క్రింద ప్రభుత్వ భూమిని కేటాయించాలని 1999లో అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఆయనకు 2001లో అప్పటి కలెక్టర్ రెడ్లరేపాకలోని సర్వే నంబర్ 24లో 2.15 ఎకరాల భూమి కేటాయించి.. పాస్‌బుక్ జారీచేశారు. అయితే అధికారులు పొజిషన్ ఇవ్వడం మరిచారు. సర్వే నిర్వహించి కేటాయించిన స్థలానికి హద్దులు చూపించాల్సి ఉండగా విస్మరించారు. తన స్వగ్రామంలోనే స్థలాన్ని కేటాయించడంతో సర్వే నంబర్‌పై అవగాహన ఉన్న మధుసూదన్‌రెడ్డి ఎట్టకేలకు ఎకరం భూమిని స్వాధీనపరుచుకోగలిగారు. అదే సర్వే నంబర్‌లో ప్రభుత్వం మరికొందరికి భూమి కేటాయించగా, వారంతా ఎవరికి తోచినట్టు వారు హద్దులు పాతుకొని సాగుచేసుకొంటున్నారు. మధుసూదన్‌రెడ్డి చేతిలో కేవలం ఎకరం మాత్రమే ఉండగా, మిగతా 1.15 ఎకరాల భూమి ఇతరుల చేతిలో ఉన్నది. రెవెన్యూ అధికారులు 18 ఏండ్లుగా పొజిషన్ చూపించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటున్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో మధుసూదన్‌రెడ్డికి కొత్త పాస్‌బుక్‌ను జారీచేసి, 2.15 ఎకరాలకు రైతుబంధు పథకాన్ని సైతం వర్తింపజేశారు. కానీ, ఇప్పటికీ భూమిని మాత్రం చూపించలేదు. ఈ సమస్యపై మధుసూదన్‌రెడ్డి పలుమార్లు తాసిల్దార్లు, ఆర్డీవో తదితర రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. మధ్యలో ఒకసారి తాసిల్దార్, సర్వేయర్ వచ్చి పంచనామాచేసి ఏదీ తేల్చకుండానే, డీడీ కట్టి సర్వేచేయించుకోవాలని సూచించారు. డీడీ కట్టినా.. ఇంతవరకు సర్వేచేయలేదు. తిరిగి తిరిగి వేసారిపోయిన మధుసూదన్‌రెడ్డి ప్రస్తుతం పక్షవాతంతో మంచానపడ్డారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా తన పరిస్థితిని అర్థం చేసుకొని స్పందించి తనకు కేటాయించిన భూమికి పొజిషన్ ఇప్పించాలని బాధితుడు కోరుతున్నారు.

## 'ఏడిపిస్తున్నారు

- 30 గుంటల భూమి కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- అంతా సవ్యంగా ఉన్నా పార్ట్ బీలోకి నెట్టేసిన ఘనులు
- నాలుగేండ్లుగా నరకం చూపిస్తున్న అధికారులు


కామారెడ్డి జిల్లాలో రెవెన్యూ లీలలు ఎంత చెప్పుకొన్నా తక్కువే. ఎలాంటి వివాదాలు లేని భూములను కూడా పార్ట్ -బీలోకి చేర్చి అర్హులైన భూ హక్కుదారులను ముప్పుతిప్పలు పెడుతున్నారు.పైసలకు కక్కుర్తి పడ్డ సిబ్బంది ఏండ్ల తరబడి రైతులను తిప్పించుకొంటూ ఏడిపిస్తున్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండల తాసిల్ కార్యాలయంలోని పరిస్థితి ఇది. శ్రీనివాస్ అనే వ్యక్తి కష్టపడి ఎకరం నాలుగు గుంటల భూమిని కొన్నారు. ఇందులో 14 గుంటల భూమి తనదేనంటూ మరో వ్యక్తి తప్పుడు కాగితాలతో ఫిర్యాదుచేశారు. మిగతా 30 గుంటల భూమి విషయంలో ఎలాంటి వివాదం తలెత్తలేదు. కానీ అధికారులు మాత్రం మొత్తం ఎకరం నాలుగు గుంటలను వివాదాస్పదం చేసి పార్ట్ బీ లోకి నెట్టేశారు. దీంతో శ్రీనివాస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తప్పుడు కాగితాలతో అందిన ఫిర్యాదును పరిష్కరించకపోగా మిగతా భూమిని కూడా వివాదం చేశారని వాపోతున్నారు.



పాస్‌పుస్తకం, పహాణీ చూపుతున్న బాధితుడు జేపీ శ్రీనివాస్‌గౌడ్

**కామారెడ్డి, నమస్తే తెలంగాణ:**

కామారెడ్డి జిల్లా భిక్కనూరు గ్రామ శివారులో సర్వే నంబర్ 1316, 1317 లో జేపీ శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి వేర్వేరుగా 1.04 ఎకరాల భూమిని కొన్నారు. 2016లో రిజిస్ట్రేషన్ నంబర్లు 121/2016 ద్వారా 14 గుంటలు, 4603/2015 ద్వారా 20 గుంటలు, 4598/2015 ద్వారా 10 గుంటల భూమిని కొనుగోలుచేశారు. ఇందులో 14 గుంటల భూమి జాతీయ రహదారి పక్కనే ఉండటంతో కొందరు వ్యక్తులు తమదేనంటూ నకిలీ కాగితాలు సృష్టించి రెవెన్యూశాఖలో ఫిర్యాదుచేశారని శ్రీనివాస్ తెలిపారు. దీంతో రెవెన్యూ అధికారులు సదరు 14 గుంటలతోపాటు.. విడిగా కొన్న 30 గుంటలను కూడా పార్ట్



శ్రీనివాస్‌గౌడ్ పాత పాస్‌పుస్తకం

బీలో చేర్చారు. ఈ 30 గుంటలకు ఎలాంటి వివాదం లేకపోయినా పాస్‌బుక్ ఇవ్వకుండా సతాయిస్తున్నారని వాపోతున్నారు. గ్రామ వీఆర్వో మొదలుకొని తాసిల్దార్‌కు, ఆర్డీవోకు పలుమార్లు వినతిపత్రం అందజేసినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. ఆన్‌లైన్ పహాణీ.. జేపీ శ్రీనివాస్ పేరుమీదే వస్తున్నప్పటికీ అధికారులు నూతన పాస్‌పుస్తకాన్ని ఇవ్వటంలేదు. వివాదరహిత భూమికి వివాదంలో ఉన్న భూమి అంటూ పార్టు బీలో ఉంచి ముప్పుతిప్పలు పెడుతున్నారు. తన భూమికి పాస్‌పుస్తకం అందజేయాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలుచేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారుల చర్యల కారణంగా ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలు వర్తించడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తన భూమికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని వేడుకొంటున్నారు.

## మా భూములు మాకివ్వండి

- అన్యాయంగా రికార్డులు మార్చారు
- 17 ఏండ్లుగా తిరుగుతున్నా సరిచేయని అధికారులు
- ములుగు జిల్లాలో దళిత రైతుల ఆవేదన

**ములుగు జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** '17 ఏండ్లుగా కాళ్లరిగేలా తిరుగుతున్నం.. మా భూములను మాకు అప్పగించాలి' అని ములుగు జిల్లా పత్తిపల్లి గ్రామ దళితులు కోరుతున్నారు. బాధితుల కథనం ప్రకారం.. ములుగు జిల్లాలోని పత్తిపల్లి గ్రామంలో 1970-1975, 1978-1979లో అప్పటి కలెక్టర్ మాధవరావు దళితుల జీవనభృతి కింద సాగు చేసుకొనేందుకు ఇనాం భూముల పథకంలో భాగంగా 20 మంది రైతులకు భూపంపిణీ చేశారు. సర్వే నంబర్లు 623లో 3.39 ఎకరాలు, 624లో 9.27 ఎకరాల భూమిని సమాన వాటాలుగా పంచారు. గ్రామానికి చెందిన పోలెపాక చిన్న సారయ్య, పొన్నాల నర్సయ్య, పొన్నాల చిన్న కొమురయ్య, మేకల రాజ పోషమ్మ, మేకల సారయ్య, మేకల కొమురయ్య, ఇనుముల మొగిలి, ఇనుముల మల్లయ్య, ఇనుముల రాజయ్య, ఇనుముల లింగయ్యతోపాటు మరో 10 మందికి భూమిని కేటాయించారు. అప్పట్నుంచి వారు ఎస్సీ కార్పొరేషన్ మంజూరుచేసిన బావి ద్వారా భూమిని సాగు చేసుకొంటున్నారు. 2001-2002లో వీరికి తెలియకుండానే రెవెన్యూ అధికారులు రికార్డుల్లో పేర్లు మార్చేశారు. సర్వే నంబర్ 623లో ఉన్న భూమిలో ఎనగందుల మొగిలి పేరున 2.24 ఎకరాలు, రొంటాల సమ్మక్క పేరున 1.15 ఎకరాలు, సర్వే నంబర్ 624లో ఎనగందుల మొగిలి పేరున రెండెకరాలు, రొంటాల సమ్మక్క పేరున 34 గుంటలు, ఎనగందుల పోచమ్మ పేరున 6.33 ఎకరాలను అక్రమంగా నమోదు చేశారు. భూమి రికార్డుల్లో అక్రమంగా మార్పులు జరిగాయని వీటిని సవరించాలని బాధితులు 2001లోనే స్థానిక రెవెన్యూ అధికారులకు చాలాసార్లు ఫిర్యాదుచేశారు. 2012 లో అప్పటి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేయగా ఆయన స్పందించి బాధితులకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జేసీ ఆదేశాలతో సర్వేచేసిన అధికారులు అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కిన వారి పేర్లను తొలగించారే తప్ప ఆ స్థానంలో బాధితుల పేర్లను చేర్చలేదు. దీనిపై బాధితులు మళ్లీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలుచేశారు. 2016లో మరోసారి అనర్హులైన వాళ్ల పేర్లను రికార్డుల్లో నమోదుచేశారు. ఇదేమని అడిగితే స్పందించే అధికారులు లేకుండాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులమైన తమ పేర్లను రికార్డుల్లోకి ఎక్కించి న్యాయంచేయాలని బాధితులు కోరుతున్నారు.



పహాణీలను చూపుతున్న ములుగు జిల్లా పత్తిపల్లి గ్రామ దళితులు


### ఏండ్ల తరబడి తిరుగుతున్నాం



మా భూములను మా పేర్ల మీద ఎక్కించమని అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఎవరు పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా మా గోడు వినేవాళ్లు లేరు. అనర్హుల పేర్లను పహాణీల్లో ఎక్కించారు. ఇదెక్కడి న్యాయం? అధికారులు ముడుపులు తీసుకొనే ఇదంతా చేశారు. మా భూమి మా పేర్ల మీద ఎక్కించి పట్టాలివ్వాలి.

**- పొన్నాల నర్సయ్య**

### ఉన్నతాధికారులు స్పందించాలి



మా భూమిని అక్రమంగా వేరే వ్యక్తుల పేరిట నమోదు చేయడం దారుణం. ఉన్నతాధికారులు స్పందించి న్యాయంచేయాలి. తాత, తండ్రుల నుంచి సాగుచేసిన ఇనాం భూమిని ఇలా రెవెన్యూ అధికారులు వేరే వ్యక్తుల పేరిట నమోదుచేయడం బాధాకరం. కార్యాలయాల చుట్టూ ఎంత తిరిగినా మా బాధను పట్టించుకొన్న నాథుడే లేడు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

**- పొన్నాల స్వామి**

## అస్తిత్వ ప్రకటన

కంటి తెరపై చిందిన రక్తపు మరకలు
ప్రతి రక్తపు మరకా
ఓ చరిత్ర కాపలా

అగ్గి అంటుకున్న అడవినిండా
కాలిగుర్తుల కాగడాలు
నువ్వు నడిచివెళ్లిన తొవ్వ
ఇప్పుడు ఎండిన నది గొంతుక

ఆకాశాన్ని కప్పుకుని పడుకునే దేహం
బూడిదని మిగుల్చుకుంది

సముద్రాన్ని దాచుకున్న కళ్లు
తుఫానుల్ని రెప్పదాటనివ్వవు

వలస పోయిన ఋతువుల సాక్షిగ
ఇక్కడి నేల నాదే..
దేశదేశాలూ తిరిగిన గాలిదేహం సాక్షిగ
కోల్పోయిన జాతీయత నాదే..

నేనూ
దేశపటానికి వేలాడుతున్న
విశ్వనరుణ్ణి
ఖండ ఖండాలుగా సమకూర్చబడ్డ
మానవచరిత్రని...

– మెర్సీ మార్గరెట్, 9052809952

## 'బతుకమ్మ' కథల పోటీ

తెలంగాణ సాధనే ఊపిరిగా ఉద్భవించిన 'నమస్తే తెలంగాణ' దినపత్రిక ఆదివారం అనుబంధం బతుకమ్మ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్త నిర్వహణలో కథల పోటీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సమకాలీన జీవన వైవిధ్యాల నేపథ్యంగా నవ్యత, సృజనాత్మకతకు అద్దంపట్టే కథలను పోటీకి ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు. పోటీకి వచ్చిన కథల్లో మొత్తం 22 కథలను ఎంపిక చేసి లక్షా అరువై వేల విలువ చేసే బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ప్రథమ బహుమతి (ఒక్కరికి) రూ.50 వేలు, 2 ద్వితీయ బహుమతులు (ఒక్కక్కరికి రూ.25 వేలు, 3 తృతీయ బహమతులు (ఒక్కొక్కరికి) రూ.10 వేలు, 6 కన్సోలేషన్ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ.5 వేలు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. గతంలో ఎక్కడా ప్రచురితం కానీ, పరిశీలనలో లేని కథలను పోటీకి స్వీకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సరైన హామీ పత్రం జతచేసి జూలై 20వ తేదీలోగా అందేటట్లు కథలు పంపాలి. కథలను బతుకమ్మ కథల పోటీ, నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9 రోడ్ నెంబర్ 10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034 అనే చిరునామాకు పంపాలి. విజేతలకు ముల్కనూర్‌లో జరిగే సభలో బహుమతులు ప్రదానం చేస్తారు.


- బతుకమ్మ (నమస్తే తెలంగాణ)
- ముల్కనూరు ప్రజా గ్రంథాలయం

కవిత్రయ యుగం ముగిసింది. ఆశ్రమ జీవితం నుంచి నగర జీవితంలోనికి తెలుగు సరస్వతి ప్రవేశించింది. పలుకు మారింది. విలాసం మారింది. కొత్త వసంతం వచ్చింది. కాళిదాసు, భారవి, శ్రీహర్షుడు మొదలైన వారు తెలుగు వేషాలలో సాహిత్యరంగంలోకి ప్రవేశిస్తున్నారు. ఈ సందర్భంలో అతిలోక మోహనమైన శైలి గాంభీర్యంతో ఒక కవి ప్రవేశించాడు. ఆయన పేరు శ్రీనాథుడు. సకల శాస్త్రాలు, ప్రాకృతాది భాషలు నేర్చినవాడు. ఆయన రాక సాహిత్యరంగంలో ఒక పెద్ద కుదుపు కలిగించింది.

# తెలుగు పలుకుపడి తళతళలు

**శ్రీనాథుని** తాతగారు కమలనాభామాత్యులు. ఆయన సముద్రతీరంలోని 'క్రాల్' పట్టణానికి అధిపతి. అది ఒక అగ్రహారం అయి వుంటుంది. ఈయన కాకతీయ సార్వభౌముడి చేత సత్కరింపబడ్డాడు. శ్రీనాథునికి, ఈయనకు రెండు తరాల భేదము అనుకుంటే..ఈయనను సత్కరించిన ప్రభువు ప్రతాపరుద్రుడై ఉంటాడు. శ్రీనాథుని సాహిత్య పరంపర మొత్తం కాకతీయ మూలాలలోనిదే. ఆయన రచించిన 'పద్మపురాణం' ఇప్పుడు లభించడంలేదు. దాని స్వరూప స్వభావాలను మనం విశ్లేషించలేము. శ్రీనాథ కవి ఆనాడు తెలుగుదేశంలో అడుగడుగున సంచరించాడు. తెలుగువారి వేషభాషలు, సంతోష విషాదాలు ఆయనకు చిరపరిచితం. తెలుగుజాతి స్వభావంలో ఉన్న రజోగుణం ఆయన వ్యక్తిత్వంలో, కవిత్వంలో మూర్తీభవించి ఉంటాయి. భారత పద్యంలోని నడక, శ్రీనాథుని ఆవేశాన్ని, ఉద్వేగాన్ని, సంగీతాన్ని కలుపుకొని ఒక కొత్త రూపాన్ని సంతరించుకున్నది. శ్రీనాథుని సీసపద్యం ఒక సంగీతం పాడినట్లుగా కొనసాగుతుంది. ఈ సంగీతాన్ని రామరాజభూషణుడు శిఖరానికి ఎక్కించాడు.

శ్రీనాథుని కవిత్వ వ్యక్తిత్వమంతా మూడు విధాలుగా వింగడించుకోవచ్చు. తొలిభాగం ఆయన శాస్త్ర పాండిత్యాన్ని, పద్య విద్యా నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. శ్రీనాథుడు అనువదించిన 'నైషధం' తెలుగువాళ్లకు 'శృంగారనైషధ'మైంది. ఆయన అనువదించిన 'కాశీఖండం', 'భీమఖండం' ఆయన పౌరాణిక విజ్ఞానానికి వేదవేదాంగవేత్తకు అద్దం పడుతున్నాయి. ముఖ్యంగా భీమఖండంలో ఆయన వర్ణించిన నగరాలు, పల్లెలు, క్షేత్రాలు, కొండలు అన్ని ఆయనకు తెలుగుప్రాంతం మీద గల ఎల్లల్లేని అభిమానాన్ని వ్యక్తంచేస్తాయి. దీనిలో కాశీ విశ్వనాథుడు, వేదవ్యాసుని నిందించే సమయంలో ఆయన వాడిన భాష ఈనాటికీ తెలుగువారు పల్లెటూళ్లల్లో తిట్టుకొనే స్థాయిలోనే ఉన్నట్లు మనం గమనించవచ్చు. శ్రీనాథుని ఈ రెండు గ్రంథాల్లో కనిపడే దేవతలు, మహర్షులు, మనుష్యులు అందరు కూడా తెలుగువాళ్లలాగానే ప్రవర్తిస్తారు, సంభాషిస్తారు. ఈ లక్షణం వల్ల శ్రీనాథుని కవిత్వం ఎంత పాండిత్యం ఉన్నదైనా జనులకు దగ్గరగా వచ్చింది. ఒక తరం కింద శ్రీనాథుని పద్యాలు నూరు, నూటయాభై రానివారు ఎక్కడా ఉండేవారు కాదు. 'ఆంధ్ర శబ్ద చింతామణి' చెప్పిన విధంగా 'స్వస్థాన వేషభాషాభిమతాస్సంత: రస ప్రలుబ్ధ ధియ:' అన్న మాటకు సాక్షాత్కార రూపంగా శ్రీనాథుని పద్యాలు మనకు కానవస్తాయి.




శబ్ద సంకటనాలు, వక్రోక్తి సంప్రదాయంలోని అనేక నూతనాంశాలు శ్రీనాథుని యుగంలోనే కావ్యరంగంలో ప్రవేశించాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ యుగంలో తెలుగు సరస్వతి 'బాల్య యౌవన దశా పరిణామ సంధిత్రామ నేత్ర యుగళ శోభ పయోధి'గా భాసిల్లింది.


శ్రీనాథునిలో రజోగుణ ప్రాచుర్యం ఎక్కువ. నూనూగు మీసాల నూత్న యౌవనమున శాలివాహన సప్తశతి నుడివితి అని తన యౌవనంలోనే ప్రాకృతంలోని అతి మధురమైన కవిత్వానికి పొంగిపోయి దానిన తెలుగు చేసినట్లు చెప్పుకొన్నారు. సప్తశతి లలిత శృంగారానికి తేనెపట్టువంటి కావ్యం. అలంకారికులు దాన్ని ఎన్నో సందర్భాలలో ఉత్తమ కవితకు ఉదాహరణగా పేర్కొన్నారు. కానీ తెలుగువారి దురదృష్టం వల్ల అది కూడా అలభ్యంగానే ఉండిపోయింది. మరొక పార్శ్వంలో ఆయన నాలుకమీద పద్యము తెలుగు పలుకుపడిలో తళతళలాడుతూ ప్రకాశించేది. అంతటి సిద్ధకవి పలికినప్పడల్లా మధురమైన పద్యం బహిర్గతమయ్యేది. నిత్యజీవనంలో ఎంత నిష్ఠాగరిష్ఠుడైనా, లోక వ్యవహారంలో ఆయన చాటువులు మేరమీరిన అశ్లీలతను పలుకడంలో జంకలేదు. ఈ సందర్భంలో ఆయన జాతరలను చూచినప్పుడు తాను సందర్శించిన అంశాన్ని తెలియజేసేవాడు. ఈ బాహిరమైన వ్యక్తిత్వం ఆయన అంతః చైతన్యాన్ని ఎంతవరకు స్పృశించేదో చెప్పలేము కానీ గోష్ఠిలోని మిత్రుల, పోషకుల, అభిమానుల ఒత్తిడివల్ల చెప్పినవే ఈ చాటువులు అయి ఉండవచ్చు. శ్రీనాథుని కవిత్వంలో అధిక లోకప్రియములైనవి ఈ చాటువులే. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు వీటిని సేకరించి తొలుత ప్రకటించారు. ఆయన వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామం శ్రీనాథుని రచనయేనని విశ్వసించారు.


మరొక అంశం ఏమిటంటే శ్రీనాథుని దేశి కావ్య రచన. అది పల్నాటి వీర చరిత్ర. కాకతీయుల నాటికే పల్నాటి వీరగాథలు ఓరుగల్లులో ప్రదర్శింపబడుతుండేవి. ఆ ప్రదర్శనను శ్రీనాథుడు సందర్శించి కావ్యాన్ని రాయడానికి ఉద్యుక్తుడైనాడు. నైషధంలో చింతామణి మంత్రోపాసనకు సంబంధించిన ఎన్నో విషయాలు గర్భితములై ఉన్నాయి. దానిలోని సరస్వతిని వర్ణించిన గద్యము కూడా అధ్యయనము చేయదగినదే. అట్లాగే శివరాత్రి మాహాత్మ్యంలో కొన్ని నిగూఢ సాధనాలు చెప్పబడ్డాయని కొందరు సాధకులు భావిస్తున్నారు.

మొత్తం మీద శ్రీనాథుని యుగంలో శ్రీనాథుడు కాక బమ్మెర పోతన, తాళ్లపాక అన్నమాచార్యులు వంద సంవత్సరాల చక్రంలో ప్రవర్తించారు. ఈ ముగ్గురు మూడు మార్గాల వారు. సంకీర్తనాచార్యుడైన అన్నమయ్యకు ముందే 'సింహగిరి వచనములు' రాసిన కృష్ణమాచార్యులు ఉండేవారు. కృష్ణమాచార్యుల వచనాలు గద్యరూపంలోనే లభిస్తున్నాయి. ఈ ప్రక్రియ మూలము బసవేశ్వరుడు మొదలైన వారు. కన్నడ భాషలో రచించిన వచనము వలె తాళ్లపాక అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడు వేంకటేశ్వర వచనము' రచించాడు. వీటిని చదువటానికి రాగతాళములు నిర్దేశించబడ్డాయి. అన్నమయ్య కీర్తనలు గేయ ఛందస్సుకు సంబంధించినవి. వచనములు కూడా పాడదగినవే కాని ఆ పాడిన సంప్రదాయం మనది కాకపోవడంతో ప్రచారంలోకి రాలేదు. తెలుగు సరస్వతి శ్రీనాథుని యుగంలో యౌవనాన్ని పొందిందని చెప్పుకొన్నాం. శబ్ద సంకటనాలు, వక్రోక్తి సంప్రదాయంలోని అనేక నూతనాంశాలు శ్రీనాథుని యుగంలోనే కావ్యరంగంలో ప్రవేశించాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ యుగంలో తెలుగు సరస్వతి 'బాల్య యౌవన దశా పరిణామ సంధిత్రామ నేత్ర యుగళ శోభ పయోధి'గా భాసిల్లింది.


– కోవెల సుప్రసన్నాచార్య

## స్వీకారం

### మందారం
(కథల సంపుటి)




రచన: దారం గంగాధర్, వెల: రూ.200 ప్రతులకు: దారం గంగాధర్, ప్రశాంతనిలయం, ఇంటి నెం: 5-11-121, డివిజన్-4, ఎల్లమ్మగుట్ట స్ట్రీట్, నిజామాబాద్-503001, తెలంగాణ.




### గెలుపు మనదే
(కథల సంపుటి)

రచన: పర్చా దుర్గాప్రసాదరావు, వెల: రూ.25, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్-4. ఫోన్: 040-29703142.

### రెప్పచాటు మౌనం
(కవిత్వం)



రచన: రమాదేవి కులకర్ణి, వెల: రూ.100. ప్రతులకు: రమాదేవి కులకర్ణి, స్పార్క్ కాన్సెప్ట్ స్కూల్, హుడాపార్కు దగ్గర, ఉప్పల్, మేడ్చల్ జిల్లా. సెల్:89856 13123




### అంతరంగం
(కవిత్వం)

రచన: బగ్గాం స్పందన, వెల:రూ.100, ప్రతులకు: డాక్టర్ స్పందన బగ్గాం, ఇంటి నెం:57-4-8/1, దుర్గానగర్, కంచరపాలెం, విశాఖపట్టణం-530 008

### గజల్ కిరణాలు
(గజళ్లు-రుబాయిలు)




రచన: గద్వాల కిరణ్ కుమారి, వెల: రూ. 130, ప్రతులకు: గద్వాల కిరణ్‌కుమారి, 14-113, శ్రీతరంగిణి నివాస్, కోదండ రాంనగర్, 202, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-60




### యుద్ధం మాట్లాడుతుంది
(కవిత్వం-వ్యాసాలు)

రచన: షహెబాజ్ అహ్మద్ ఖాన్, వెల: రూ.80. ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాలు.

### ఫోర్త్ ఎస్టేట్..
(వ్యాస సంకలనం)




రచన: డాక్టర్ పి.భాస్కరయోగి, వెల: రూ. 400. ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాలు.




### దక్షిణాఫ్రికా నానీలు
(కవిత్వం)

రచన: రాపోలు సీతారామరాజు, వెల: రూ. 50, ప్రతులకు: రాపోలు సీతారామరాజు, దక్షిణాఫ్రికా. సెల్:+27727747549

### కాకీక కాకికి కాక
(వ్యాసాలు)



రచన: పాలపర్తి ఇంద్రాణి, వెల: రూ.80, ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాలు.




### సాహితీ సల్లాపాలు
(విన్నవి.. కన్నవి..)

రచన: డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, వెల: రూ.80, ప్రతులకు: సావిత్రి గోవర్ధనం, శ్రీకారం, 6-34/48/1, బాలాజీనగర్ కాలనీ, దుబాయ్ బిల్డింగ్ ఎదురుగా, దమ్మాయిగూడ, హైదరాబాద్-83.

### కొత్త తొవ్వ
(కవిత్వం)



రచన: మహబూబాబాద్ జిల్లా కవులు, వెల: రూ.100, ప్రతులకు:కె. సీతారాములు, ఇంటి నెం:11-781, టీఎన్‌జీఓ కాలనీ, ఖమ్మం. సెల్: 83747 93374.



### బతుకమ్మ
(నానీలు)

రచన: డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, వెల: రూ.30, ప్రతులకు: ఇంటి నెం:8-5-38, టీచర్స్‌కాలనీ, మహబూబ్‌నగర్. సెల్:90 328 44017.



## పగటిచుక్క నాన్న

నాన్నంటే.. నలుదిక్కుల వెలిగే దివిటి
కాళ్ళకు పొద్దును గట్టుకొని
సంసారాన్ని దున్నే
పగటి చుక్క..

మోత్కదొప్పల తైదంబలై
తనువులను తడిమే
ఆత్మీయనేస్తం నాన్న..

ఎన్ని రాత్రులను
తన కనురెప్పల మీద ఎత్తి దించాడో
కండ్లకింది తడి
గొంతుకు ఉరితాడైనా
మన కలలకు పూసే పువ్వైతాడు..

నాన్న..నువ్వు ఆవేశంగా
మాటలరాళ్లు నాపై విసురుతుంటే
అవే నా జీవితానికి
ఎదిగే మెట్లయితవనుకోలేదు..

కాపొల్ల సేండ్లకాడ జీతముండి అల్లిన
జానపదాలన్ని దెచ్చి నా ఒల్లే వొస్తుంటే
ఎర్కలేకపాయే ..నాన్న
నా కవిత్వానికి కండ్లయి బాట జూపుతాయని..

అరిగిన నీ కాళ్ళ తోళ్లచెప్పులకు
ఎన్ని ముండ్లుడాయో
రెండెక్కువే నీ గుండెకు గుచ్చుకున్న
శెల్లల మూటగట్టి
గుడిసె గూటానికి తగిలిచ్చేటోడు..

ఎతలన్ని పచ్చబొట్లయి
నీ తనువంత పొడిసినా
నవ్వుల పొద్దునే
రాత్రి ఇంటికి తెస్తుంటివి..

నీ కన్నీళ్లను కాపురంల పారబోయడం
ఎప్పుడు ఎరగలేదు నాన్న.. కాని
గుడిసెల దండెం ఎనుక
తడి ఆరని తువాలొక్కటి
ఎప్పుడు ఆరబెట్టుకుంటుండేది..

నాన్నంటే.. తన కలలను కాల్చుకొని
కన్నబిడ్డల స్వప్నాలను నెరవేర్చేటోడు
బతుకంత ఊడిగం జేసినా
త్యాగన్నంత తల్లికిచ్చే నిత్య కూలీ.. నాన్న..!

– బోల యాదయ్య, 9912206427

# చారిత్రక ఆధారాలున్నాయా?

**పరిశోధక**మిత్రులు సామిడి జగన్‌రెడ్డి గారు రాసిన 'మహాకవి మెచ్చిన మహాస్వప్న' వ్యాసం (నమస్తే తెలంగాణ, జూలై 1, 2019) బాగుంది. అయితే, శీర్షికలో, వ్యాసం స్వరంలో, ప్రస్తావనకు వచ్చిన ఒకటి రెండు సందర్భాలలో వ్యక్తమైన చరిత్ర గురించి వివరణ అవసరమనిపించింది.

మహాస్వప్న అంతకుముందరి 'అగ్నిశిఖలు-మంచు జడలు' కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు గానూ, 'రాత్రి' కవులలో ఒకరుగానూ, దిగంబర కవులలో ఒకరుగానూ అత్యంత ప్రతిభావంతమైన, ప్రభావశీలమైన కవి అనడం నిస్సందేహం. ఆరు దశాబ్దాల తర్వాత కూడా కవిగా ఆయన ప్రాధాన్యత తగ్గలేదు. ఆయనను మహాకవి మెచ్చుకున్నందువల్ల అదనంగా వచ్చేదీ లేదు, మెచ్చుకోకపోతే నష్టమూ లేదు.అయితే మహాకవి మెచ్చిన అన్నప్పుడు అందుకు స్పష్టమైన ఆధారాలు (లిఖితమైనవైనా, మౌఖికమైనవైనా) ఉండాలి. చరిత్రకు వాస్తవ ఆధారాలు, అవి ఎక్కడో ఒకచోట నమోదై ఉండడం, కనీసం సంభవనీయమని అనిపించడం అవసరం.

దిగంబరకవుల గురించి వాళ్లకే రాసిన ఉత్తరాల్లో, రచనల్లో, ఇంటర్వ్యూల్లో, బహిరంగ ఉపన్యాసాల్లో శ్రీశ్రీ చేసిన వ్యాఖ్యలూ, దిగంబర కవిత్వానికి శ్రీశ్రీ చేసిన అనువాదాలూ అన్నీ సింగంపల్లి అశోక్ కుమార్ ఒక్కచోటికి చేర్చి 'శ్రీశ్రీ సాహిత్య నిధి' విజయవాడ ప్రచురణగా 2015లో వెలువరించారు. దాని ప్రకారం, శ్రీశ్రీ ప్రస్తావనల్లో దిగంబర కవుల్లో అందరి కన్న తక్కువసార్లు కనబడేది మహాస్వప్న గురించి మాత్రమే. చెరబండరాజు, నగ్నముని, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌ల ప్రస్తావనలు పేజీల కొద్దీ ఉండగా, చివరికి భైరవయ్య గురించి కూడ పది వాక్యాల దాకా ఉండగా, మహాస్వప్న మీద శ్రీశ్రీ వ్యాఖ్యలు యాభై పేజీల పుస్తకంలో మూడు వాక్యాలకు మించి లేవు. మళ్లీ చెపుతున్నాను.. అదేమీ మహాస్వప్న కవితాశక్తిని తగ్గించడానికి కాదు. 'మహాకవి మెచ్చిన' అనడానికి ఆధారాలు సరిపోయినన్ని లేవని చూపడానికి మాత్రమే.

ఒకనాటి యువతరానికి శ్రీశ్రీ అభిమాన కవి. కానీ శ్రీశ్రీకే అభిమానకవి మహాస్వప్న. ఈ సంగతిని శ్రీశ్రీ తన ఆత్మకథ 'అనంతం'లో రాశాడు అని జగన్‌రెడ్డి రాస్తున్నారు. కాని శ్రీశ్రీ 'అనంతం'లో గాని, మరెక్కడా గాని అలా రాయలేదు. 'అనంతం'లో 'విరసంలో వీరశైవులు'అని మూడు భాగాలు రాసిన శ్రీశ్రీ రెండో భాగంలో.. 'విరసం అంటే దిగంబర కవులే అన్న పొరపాటు అభిప్రాయాన్ని సవరించక తప్పదు. దిగంబర కవులంతా కలిసి ఆరుగురు. వారిలో మహాస్వప్న విరసం ఆవిర్భావానికి ముందే దిగంబరోద్యమం నుంచి తప్పుకున్నాడు. విరసం సభ్యుడు కాకపోయినా మహాస్వప్నను నేను వీరశైవుడిగా గుర్తిస్తాను. అతనిలో అరాజకత్వం నాకు నచ్చింద'ని మాత్రమే మహాస్వప్న గురించి అన్నారు.

'శ్రీశ్రీ మహాస్వప్న మీద ప్రేమతో రెండు కవితలను ఆంగ్లంలోకి తర్జుమా చేశాడు' అని జగన్‌రెడ్డి రాశారు. దిగంబర కవిత్వాన్ని ఇంగ్లిష్ చేయడం గురించి శ్రీశ్రీ చాలాచోట్ల చెప్పాడు. ఒక్కొక్క దిగంబర కవి గీతాలు నాలుగేసి ఇంగ్లిష్‌లోకి అనువదించి ప్రచురించాలని అనుకున్నానని కూడా అన్నాడు. కాని మొత్తం మీద ఆయన అనువదించినవి ఆరు కవితలు మాత్రమే. అందులో మహాస్వప్న కవిత ఒక్కటి మాత్రమే. జ్వాలాముఖి కవిత ఒక్కటి కూడ చేయలేదు. చెరబండరాజువి రెండు చేశాడు. ఆ రకంగా కూడా ఆయన మహాస్వప్నను ఇతరుల కన్నా ఎక్కువ మెచ్చాడనడానికి ఆధారం లేదు.


జగన్‌రెడ్డి దగ్గర ఉన్న మౌఖిక ఆధారాలేమిటో తెలియదు గానీ, ఇది సంభవనీయమేనా అని ఆలోచిస్తే మాత్రం కొన్ని సమస్యలున్నాయి. దిగంబర కవులను మొదటిసారి 1970 ఫిబ్రవరిలో విశాఖపట్నంలో చూశానని శ్రీశ్రీ అనంతంలోనే రాశాడు. అంతకు ముందు వారితో ఉత్తర ప్రత్యుత్తరాలున్నాయి. మహాస్వప్నతో అంతకు ముందే పరిచయం ఉందా తెలియదు. 'ది బిగినింగ్ ఆఫ్ ది ఎండ్' ఫ్రాన్స్‌లో 1968 చివరిలో వెలువడింది. దానికి శ్రీశ్రీ తెలుగు అనువాదం 1969-70ల్లో విజయవాడ నుంచి వెలువడుతుండిన తెలుగు వెలుగు వారపత్రికలో సీరియల్‌గా (బహుశా శ్రీశ్రీ ఏ వారానికి ఆ వారం పంపుతుండగా) అచ్చయింది.


జగన్‌రెడ్డి రాసినట్టు.. 'శ్రీశ్రీ మహాస్వప్న వచన కవితను చదివి వచన కవిత అంటే ఇట్లా ఉండాల'ని కితాబిచ్చాడు అనడానికి కనీసం లిఖిత ఆధారం లేదు. మౌఖిక ఆధారం ఏమన్నా ఉందేమో తెలియదు. అలాగే అందరూ శ్రీశ్రీని చూడటానికి మద్రాసు వెళ్తే, ఆయన మాత్రం మహాస్వప్న చిరునామా వెతుక్కుంటూ ఈ భాగ్యనగరిలో అడుగుపెట్టాడు. మహాస్వప్న ఒక చిరునామా లేని వ్యక్తి అన్న విషయం తెలుసుకొని, చివరికి దిగంబర కవులలో ఒకరిని ఆరా తీసి, మహాస్వప్నను బేగంబజార్ లాడ్జీలో పట్టుకున్నాడు... (ఫ్రెంచి విద్యార్థి ఉద్యమం గురించి ఏంజెలో కాత్రొచ్చీ, టామ్ నెయిర్న్‌లు రాసినది 'బిగినింగ్ ఆఫ్ ది ఎండ్'లో ఏం జెలో కాత్రొచ్చీ భాగానికి శ్రీశ్రీ తెలుగు అనువాదం 'రెక్కవిప్పిన రెవల్యూషన్') ఖైరతాబాద్ కల్లు కాంపౌండులో రికామీగా కూర్చుని శ్రీశ్రీ చెబుతుంటే మహాస్వప్న తెలుగులో రాశాడు అనేది సాహిత్యచరిత్రకూ, సాహిత్యకారుల జీవితచరిత్రలకూ సంబంధించిన అరుదైన విషయం. ఇంతవర కూ ఎక్కడా లిఖిత ఆధారాలు లేని ఈ అంశాన్ని మొదటిసా రి తెలుగు పాఠకుల దృష్టికి తెచ్చినందుకు జగన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

జగన్‌రెడ్డి దగ్గర ఉన్న మౌఖిక ఆధారాలేమిటో తెలియదు గానీ, ఇది సంభవనీయమేనా అని ఆలోచిస్తే మాత్రం కొన్ని సమస్యలున్నాయి. దిగంబర కవులను మొదటిసారి 1970 ఫిబ్రవరిలో విశాఖపట్నంలో చూశానని శ్రీశ్రీ అనంతంలోనే రాశాడు. అంతకు ముందు వారితో ఉత్తర ప్రత్యుత్తరాలున్నాయి. మహాస్వప్నతో అంతకు ముందే పరిచయం ఉందా తెలియదు. 'ది బిగినింగ్ ఆఫ్ ది ఎండ్' ఫ్రాన్స్‌లో 1968 చివరిలో వెలువడింది. దానికి శ్రీశ్రీ తెలుగు అనువాదం 1969 -70ల్లో విజయవాడ నుంచి వెలువడుతుండిన తెలుగు వెలుగు వారపత్రికలో సీరియల్‌గా (బహుశా శ్రీశ్రీ ఏ వారానికి ఆ వారం పంపుతుండగా) అచ్చయింది. 1970 జూలై నాటి నుంచే మహాస్వప్నకూ మిగిలిన దిగంబర కవులకూ (వారితో పాటే శ్రీశ్రీకీ) సంబంధాలు తెగిపోయాయి. ఒకవేళ శ్రీశ్రీ అనంతంలో రాసిన దిగంబర కవుల పరిచయం నిజం కాదనుకున్నప్పటికీ, మహాస్వప్న అప్పటికే పరిచయం అనుకున్నప్పటికీ, దాదాపు 80 పేజీల పుస్తకం కల్లు కాంపౌండులో ఒక సిట్టింగ్‌లో చెపుతుంటే రాయడం సాధ్యమేనా అనే ప్రశ్న మిగులుతుంది. తెలుగు వెలుగు సీరియల్ తర్వా త 'రెక్కవిప్పిన రెవల్యూషన్' పుస్తకంగా విద్యుల్లత విజయకుమార్ పూనికతో 1971 సెప్టెంబర్‌లో ఉద్యమ సాహితి, కరీంనగర్ ప్రచురణగా మొదటి ముద్రణ, శ్రీశ్రీ సమగ్ర సాహిత్యంలో భాగంగా విరసం ప్రచురణగా 1996 జనవరిలో రెండో ముద్రణ, శ్రీశ్రీ సాహిత్య నిధి, విజయవాడ ప్రచురణగా 2019 ఏప్రిల్‌లో మూడో ముద్రణ వెలువడ్డా యి. ఈ చరిత్రాత్మకమైన పుస్తకానికి మహాస్వప్నతో, ఖైరతాబాద్ కల్లు కాంపౌండుతో సంబంధం ఉన్నదనే అసాధారణమైన చారిత్రక వాస్తవం ఏ ఒక్క సందర్భంలోనూ బైటికి రాకపోవడం ఆశ్చర్యమే.

– ఎన్.వేణుగోపాల్, 98485 77028

## ప్రకటన

### కథలకు ఆహ్వానం

సంచిక వెబ్‌పత్రిక, సాహితీ ప్రచురణలు సంయుక్తంగా ప్రకటిస్తున్న కథల సంకలనానికి అంశం 'కులం'. కులం కేంద్ర బిందువుగా రచయితలు కొత్తగా రాసినవి, లేదా సంకలనాల్లో, ఇదివరకే ప్రచురితమైనవి కూడా పంపవచ్చు. కథలను రాసి, టైప్ చేసి, డీటీపీ చేసి పోస్టు ద్వారా, ఈ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. చిరునామా: ప్లాట్ నెం: 32, ఇంటి నెం: 8-48, ఆదిత్య హాస్పిటల్ లేన్, రఘురాంనగర్ కాలనీ, దమ్మాయిగూడ, హైదరాబాద్-83, వివరాలకు- 98496 17392, మెయిల్: kmkp2025@gmail.com, mmkodihalli@gmail.com, వాట్సప్: 9849617392.

- కోడీహళ్లి మురళీమోహన్, కస్తూరి మురళీకృష్ణ

### సినారె కవితల పోటీకి ఆహ్వానం

జూలై 29 సినారె జయంతి ఉత్సవం సందర్భంగా.. సినారె వ్యక్తిత్వం, సాహిత్యం ఇతివృత్తంగా 25 పంక్తులకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను 2019 జూలై 20 లోపు పంపించాలి. చిరునామా: డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, 2-10-1400, మైత్రీ టవర్స్, ఫ్లాట్‌నెం: 201, జ్యోతినగర్, కరీంనగర్-001.

వివరాలకు: 9949700037.

- డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి

### బొంత లచ్చారెడ్డి రచనల ఆవిష్కరణ సభ

బొంత లచ్చారెడ్డి రచనల ఆవిష్కరణ సభ 2019 జూలై 14న ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్ జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుంది. డాక్టర్ ఉదారి నారాయణ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గుడిపాటి, ఎం.నారాయణశర్మ, బి. మురళీధర్, ఎస్.వి. ప్రసాద్, గుంజల భాస్కర్‌రెడ్డి, జానా పోశెట్టి హాజరవుతారు.


- పాలపిట్ట బుక్స్

### నవలా స్రవంతి

నెలనెలా 'నవలా స్రవంతి' కార్యక్రమంలో భాగంగా 2019 జూలై 12న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో జరుగుతుంది. బి.ఎస్. శాస్త్రి రచించిన చారిత్రక నవల 'వాకాటక మహాదేవి'పై శ్రీరామోజు హరగోపాల్ ప్రసంగం ఉంటుంది. సభకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. అందరికీ ఆహ్వానం.

- డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి
తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.






ఆదివారం సిద్దిపేటలో టీఆర్ఎస్ నాయకుడికి పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



రంగారెడ్డి జిల్లా మీర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల



హన్మకొండలో పార్టీ కార్యకర్తలకు సభ్యత్వం అందజేస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి



నిర్మల్‌లో కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం అందజేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలో వృద్ధురాలికి పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

# శరవేగంగా సభ్యత్వాలు

## కొనసాగుతున్న టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ
## ఉత్సాహంగా పాల్గొంటున్న శ్రేణులు
## ప్రజల నుంచి విశేష స్పందన

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం శరవేగంగా కొనసాగుతున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇంచార్జీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు తదితరులు సభ్యత్వ నమోదులో పాల్గొంటుండగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. టీఆర్ఎస్ అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సభ్యత్వాలను స్వీకరిస్తున్నారు. హైదరాబాద్‌లోని పాత మలక్‌పేట డివిజన్‌లో ఆదివా రం నిర్వహించిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో హోం మంత్రి మహమూద్ అలీ పాల్గొని పలువురికి సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు పాత బస్తీలో విశేష స్పందన లభిస్తుందన్నారు. ముఖ్యంగా ముస్లింలు ఉత్సాహంగా ముందుకువస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఆర్ఎస్ గ్రేటర్ అడ్‌హక్ కమిటీ సభ్యుడు బుగుడాల సుదర్శన్ పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బాగులవాడ, బుధవార్‌పేట్, ఈద్‌గాం కాలనీల్లో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం దేవరయాంజాల్, అలియాబాద్, బొమ్మరాశిపేట, తూంకుంట, జవహర్‌నగర్, గుండ్ల పోచంపల్లి, మేడ్చల్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదును ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు.

**సిద్దిపేటలో..**

సిద్దిపేట పట్టణంలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొని మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలో 70 వేల సభ్యత్వాలను చేయనున్నట్టు తెలిపారు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని మురళీకృష్ణ కాలనీలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నియోజకవర్గ మాజీ ఇంచార్జి కొత్త మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

**వరంగల్‌లో..**

వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన మర్రి యాదవరెడ్డి తదితరులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఇంచార్జి గట్టు రాంచందర్‌రావు, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు, వికారాబాద్ ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే సురేందర్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న, ఖమ్మంజిల్లా సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జమ్మికుంట, హుజూరాబాద్, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో టీఆర్ఎస్ జిల్లా ఇంచార్జి బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, రామగుడు మండలం గోపాలరావుపేటలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

**నల్లగొండలో..**

నల్లగొండ పట్టణంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, సభ్యత్వ నమోదు ఇంచార్జి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, నార్కట్‌పల్లిలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, యాదాద్రి భువనగిరి జిల్లాలోని గుండాల, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం మండలాల్లో సభ్యత్వ నమోదు ఇంచార్జి కర్నె ప్రభాకర్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, భువనగిరిలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, వనపర్తి జిలా గోపాల్‌పేట మండలం పొల్కెపహాడ్‌లో జెడ్పీ చైర్మన్ రాకాసి లోకనాథ్‌రెడ్డి, ములుగు జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ తదితరులు సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని పాత మలక్‌పేట డివిజన్‌లో టీఆర్ఎస్ నాయకుడికి సభ్యత్వాన్ని అందజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్



జయశంకర్ భూపాలపల్లిలో సభ్యత్వాలు అందజేస్తున్న ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే సురేందర్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్



ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎమ్మెల్యే సండ్ర




కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సభ్యత్వాన్ని అందజేస్తున్న ఇంచార్జి బస్వరాజు సారయ్య, జెడ్పీ అధ్యక్షురాలు విజయ



నల్లగొండలో సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఇంచార్జి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు





వేణు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు. (ఇన్‌సెట్‌లో) పల్లం వేణు (ఫైల్)

### కేటీఆర్ చొరవతో
# స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

**కోనరావుపేట:** టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో మలేషియాలో మృతి చెందిన వలసజీవి మృతదేహం స్వగ్రామానికి చేరుకున్నది. వివరాల్లోకి వెళితే.. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన పల్లం ఆదిరెడ్డి, లలిత దంపతులకు నలుగురు కుమారులు. పెద్దకుమారుడు వేణు(35) బతుకుదెరువు కోసం రూ.4లక్షలు అప్పు చేసి కంపెనీ వీసాపై రెండేండ్ల క్రితం మలేషియా వెళ్లాడు. అక్కడే ఓ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. జూన్ 27న తన గదికి తిరిగి వచ్చి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో వేణుకు తీవ్ర కడుపు నొప్పి రావడంతో స్నేహితులు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. వేణు కుటుంబ దయనీయ పరిస్థితిని వెంకట్రావుపేట సర్పంచ్ మంతెన సంతోష్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, అయన మలేషియా ఎంబసీ ప్రతినిధులతో మాట్లాడి మృతదేహాన్ని తరలించేందుకు కావాల్సిన పత్రాలను పంపించారు. దీంతో ఆదివారం వేణు భౌతికకాయం హైదరాబాద్‌కు రాగా, ప్రభుత్వ వాహనంలో స్వగ్రామానికి తరలించారు. మృతుడికి భార్య భవాని, కుమారుడు దీక్షిత్(4) ఉన్నారు. ప్రత్యేక చొరవ తీసుకున్న కేటీఆర్‌కు వేణు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# మెడికల్ హబ్‌గా వరంగల్



వరంగల్‌లోని కేఎంసీలో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

- ఎంజీఎం దవాఖానలో సకల సౌకర్యాలు కల్పిస్తాం
- గ్రామీణ ప్రాంత వైద్యులకు ప్రోత్సాహకాలపై ప్రభుత్వం కసరత్తు
- మంత్రులు ఈటల, ఎర్రబెల్లి

**వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ తరువాత వరంగల్‌ను అన్ని రంగాల్లో అగ్రశ్రేణి నగరంగా తీర్చిదిద్దుతున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇందులో భాగంగా వరంగల్‌ను మెడికల్ హబ్‌గా మారుస్తామని వారు స్పష్టం చేశారు. ఆదివారం ఎంజీఎం దవాఖానను, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి నిర్మిస్తున్న నూతన భవన పనులను మంత్రులు తనిఖీ చేశారు. అనంతరం కాకతీయ మెడికల్ కళాశాల అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. మంత్రి ఈటల మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నదని, ఈ క్రమంలో ఉత్తర తెలంగాణకు ముఖద్వారంగా ఉన్న వరంగల్ ఎంజీఎం దవాఖానలో అన్ని సౌకర్యాలను పది రోజుల్లో కల్పిస్తామన్నారు. కేఎంసీలో రూ.150 కోట్లతో 150 పడకల సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను తొందరలో ప్రారంభిస్తామన్నారు. ఇక్కడి నుంచి ఏ ఒక్క రోగి కూడా హైదరాబాద్ వరకు వెళ్లకుండా ఈ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో ఐదేండ్లపాటు పని చేసిన వారికి కోరిన చోటుకు బదిలీలు చేయనున్నట్టు తెలిపారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ ఎంజీఎంలో అన్ని పరికరాలు దెబ్బతిన్నాయని, పరీక్షలకు పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమావేశంలో ఎంపీలు బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపనేని నరేందర్, అరూరి రమేశ్, తాటికొండ రాజయ్య, సతీశ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ సుదీర్‌కుమార్, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, వైద్య, విద్యా సంచాలకులు రమేశ్‌రెడ్డి, మేయర్ గుండా ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలానికి చెందిన సుమారు 500 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి జగదీశ్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపుడి సైదిరెడ్డి సమక్షంలో ఆదివారం టీఆర్ఎస్‌లో చేరారు. - నేరేడుచర్ల

# సైన్యం పేరుతో ఓట్లడిగిన మోదీ

### మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



**రెడ్డికాలనీ(వరంగల్) :** దేశ చరిత్రలో తొలిసారి సైన్యం పేరు చెప్పి ప్రధాని నరేంద్రమోదీ ఓట్లు అడిగారని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. హన్మకొండ శ్రీమాతా గార్డెన్‌లో ఆదివారం టీఆర్ఎస్ 30, 31, 39వ డివిజన్ల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి సభ్యత్వ నమోదు చేపట్టారు. మోదీ ప్రజలను మభ్యపెట్టేందుకు నానా కుయుక్తులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా పశ్చిమ బెంగాల్ తరహాలో అన్ని రాష్ట్రాల్లో తమ ఆధిపత్యం పెంచుకునేందుకు మారణకాండ సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల్లో వైశ్యమ్యాన్ని పెంచడానికి బీజేపీ నాయకులు చూస్తున్నారన్నారు. కేంద్ర మంత్రులు తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించడానికి రావాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం

- ఏటా ఐదుగురి ఖర్చులు భరిస్తా
- ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**సిద్దిపేట టౌన్:** సిద్దిపేటలో రూ.3.25 కోట్లతో ఆధునిక హంగులతో హజ్ హౌస్‌ను నిర్మిస్తున్నామని, ఈనెల 25న భవనాన్ని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట మదీన ఫంక్షన్ హాల్‌లో ఆదివారం హజ్‌కు వెళ్లే యాత్రికులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని హజ్ యాత్రికులు ప్రార్థించాలని కోరారు. ఈ ఏడాది లక్షలాది మంది హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకుంటే కొంతమందికి మాత్రమే అవకాశం కలిగిందని చెప్పారు. అందులో సిద్దిపేట జిల్లాకు చెందిన 50 మంది ఎంపిక కావడం దైవ సంకల్పమన్నారు. ఏటా ఐదుగురు నిరుపేదలకు తన సొంత ఖర్చులతో హజ్ యాత్రకు పంపుతానని తెలిపారు. ఈ ఏడాది కూడా ఆ ఖర్చు భరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారూక్‌హుస్సేన్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం పోసిన అమ్మప్రేమ

- తల్లి రోదనలే ఆ కొడుకుకు సంజీవని..
- బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడిలో చలనం
- సూర్యాపేట జిల్లా పిల్లలమర్రిలో ఘటన



కిరణ్‌కు జావా తాగిస్తున్న తల్లి సైదమ్మ

**సూర్యాపేటరూరల్ :** 'బ్రెయిన్ డెడ్ అయ్యాడు.. ఇక బతుకడు' ఇంటికి తీసుకెళ్లండని డాక్టర్లు చెప్పారు.. గ్రామంలో బంధువులు ఖననానికి ఏర్పాట్లు చేశారు.. గ్రామస్థులు, చుట్టాలు అంతా ఇంటికి చేరుకున్నారు.. మరి కాసేపట్లో అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా, కొడుకు దేహాన్ని చూసి ఆ తల్లి గట్టిగా రోదించ సాగింది. వెంటిలేటర్ తొలగించిన తర్వాత కూడా తన కొడుకు గుండె కొట్టుకోవడంతో అంత్యక్రియలు రద్దుచేశారు. ఆ వ్యక్తిలో రోజు రోజుకు చలనం రావడంతో అమ్మప్రేమే పునర్జన్మ నిచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సూర్యాపేట జిల్లా పిల్లలమర్రిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంధం సైదమ్మకు ఇద్దరు కుమారులు. భర్త కొన్నేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద కుమారుడు సాయి డిగ్రీ పూర్తి చేయగా, చిన్న కుమారుడు కిరణ్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. జూన్ 26న కిరణ్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో సూర్యాపేట ఏరియా దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు జూన్ 28న హైదరాబాద్ కామినేని వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు. అనంతరం 29న వనస్థలిపురంలోని ఓ వైద్యశాలకు తీసుకొచ్చారు. మూడురోజుల పాటు చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమించిందని, బ్రెయిడెడ్ అయ్యాడని తెలిపారు. వెంటిలేటర్ తీస్తే చనిపోతాడని చెప్పి ఈ నెల 3న డిశ్చార్జ్ చేశారు. సమాచారం అందుకున్న బంధుమిత్రులు ఈ నెల 3న ఖననం చేసేందుకు గ్రామంలో ఏర్పాట్లు చేశారు. అంబులెన్స్‌లో ఇంటికి చేరిన కిరణ్‌కు వెంటిలేటర్ తొలగించినా ఊపిరాడుతూ గుండె కొట్టుకుంటుండడంతో అంత్యక్రియలను మరుసటి రోజుకు వాయిదా వేశారు. ఈ నెల 4న ఖననం చేసేందుకు సిద్ధమవుతుండగా తల్లి సైదమ్మ మిన్నంటిన రోదనలతో కిరణ్.. కిరణ్ అంటూ గట్టిగా పిలవడంతో అతడి కంట నుంచి నీరు కారింది. దీంతో హైదరాబాద్‌లోని వైద్యుల సూచనతో గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యం అందించగా కిరణ్‌లో కదలికలు వచ్చాయి. చూడటం, మాట్లాడటం మొదలు పెట్టాడు. ప్రస్తుతం మంచంపై కూర్చుంటున్నాడు.. ద్రవపదార్థాలు తాగుతున్నాడు. చనిపోయాడనుకున్న కొడుకు బతకడంతో ఆ తల్లి, కుటుంబసభ్యులతోపాటు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తపల్లి ఇనుపరాతి గుట్టల్లో మొక్క నాటుతున్న కలెక్టర్, కేంద్ర బృందం సభ్యులు

# అడవులను సంరక్షించాలి

**భీమదేవరపల్లి :** వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి ఇనుపరాతి గుట్టల్లో కేంద్ర జలవనరుల శాఖ అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆదివారం మొక్కలు నాటారు. జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయిన ప్రాంతా ల్లో కేంద్ర జలవనరుల శాఖ బృందం పర్యటిస్తున్నదని కలెక్టర్ తెలిపారు. వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, ఐనవోలు, ఖిలా వరంగల్, ధర్మసాగర్ మండలాల్లో జలశిక్ష అభియాన్ పథకంలో భాగంగా ఈ బృందం పర్యటిస్తున్నదని, ఇక్కడ నీటి లభ్యత శాతం తగ్గడానికి కారణాలను అన్వేషిస్తున్నట్టు పేర్కొ న్నారు. బృందం సభ్యులు డాక్టర్ సౌమిత్ దాస్ గుప్తా, మనోజ్‌కుమార్ గుప్తా, డాక్టర్ సోమేశ్వర్ రావు, నితీశ్ పాటేదార్ పాల్గొన్నారు.

# అడవులు నరికిన వారిపై కేసు

**దమ్మపేట :** పోడు వ్యవసాయం పేరుతో అడవులను నరికిన వారిపై కేసు నమోదు చేసినట్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని లింగాలపల్లికి చెందిన గిరిజనులు పోడు వ్యవసాయం కోసం 319 బీటులో అడవిని నరుకుతున్నారు. నాగులపల్లి అటవీ సిబ్బంది అక్కడికి వెళ్లి గిరిజనులను అడ్డుకున్నారు. ఈక్రమంలో బీట్ ఆఫీసర్ చైతన్య వద్ద నుంచి గిరిజనులు సెల్‌ఫోన్లను లాక్కున్నారు. ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### అటవీ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు

**కాగజ్‌నగర్‌టౌన్:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కొత్తసార్సాల గ్రామంలో జూన్ 30న జరిగిన ఘర్షణలో 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. అటవీశాఖ అధికారులు, గ్రామస్థులకు జరిగిన ఘర్షణలో ఎఫ్ఆర్వో అనిత, అటవీశాఖ సిబ్బంది కులం పేరుతో దూషించినట్లు గ్రామానికి చెందిన నాయిని సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



## రంగుల సరస్సు

**బీజింగ్:** ఇటీవల కాలంలో చైనాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా యంఛెంగ్ సరస్సు ఇలా వివిధ రంగుల్లో తళుకులీనుతున్నది. 132 చ. కి. మీ. వైశాల్యం కలిగిన ఈ ఉప్పునీటి సరస్సుకు 'డెడ్ సీ ఆఫ్ చైనా (చైనా మృత సముద్రం)' అని మరో పేరు. నీటిలోని ఖనిజాలు, ఆల్గెల మధ్య జరుగుతున్న రసాయనిక చర్య, అత్యధిక ఉష్ణోగ్రతల మూలంగా యంఛెంగ్ సరస్సులోని నీరు ఇలా వివిధ రంగుల్లో దర్శనమిస్తున్నది.

## ప్రగ్యాన్ రోవర్



చంద్రయాన్-2 ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతున్నది. జీఎస్ఎల్‌వీ మార్క్-3 రాకెట్ ద్వారా ఈనెల 15న ఈ ప్రయోగం చేపట్టనున్నారు. చంద్రునిపైకి పంపనున్న ప్రగ్యాన్‌రోవర్ చిత్రాలను ఇస్రో ఆదివారం విడుదల చేసింది.

## నూతన బ్రహ్మోస్ క్షిపణి రెడీ..

- 500 కి.మీ.లక్ష్యాలనూ ఛేదించగలదు




**న్యూఢిల్లీ:** భారత అమ్ములపొదిలో కీలక అస్త్రం బ్రహ్మోస్ క్షిపణి నవీకరించిన వెర్షన్ గురించి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈఓ సుధీర్‌కుమార్ మిశ్రా తెలిపారు. క్షిపణి సాంకేతికత నియంత్రణ వ్యవస్థ (ఎంటీసీఆర్)లో భారత్ భాగమైనందున బ్రహ్మోస్ క్షిపణి లక్షిత పరిధిని కూడా పెంచుకోవచ్చని దూరదర్శన్ న్యూస్‌కి ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. 'నవీకరించిన బ్రహ్మోస్ కొత్త వెర్షన్‌ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ప్రపంచంలోనే అతివేగవంతమైన ఈ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి 500 కి. మీ. వరకు గల లక్ష్యాలను కూడా ఛేదించగలుగుతుంది' అని తెలిపారు.



## సింధియా, మిలింద్ రాజీనామా

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడి



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ వైదొలిగిన తర్వాత ఆయన బాటలోనే యువనేతలు పయనిస్తున్నారు.లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సింధియా ఆదివారం ట్వీట్ చేశారు. 'ప్రజా తీర్పును ఆమోదిస్తూ అందుకు బాధ్యత వహిస్తున్నా. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నా రాజీనామాను రాహుల్‌గాంధీకి సమర్పిస్తున్నా. నన్ను నమ్మి పార్టీకోసం పనిచేసే అవకాశం కల్పించినందుకు రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ ముంబై సిటీ కమిటీ అధ్యక్షుడు మిలింద్ దేవ్‌రా ఆదివారం రాహుల్‌గాంధీతో భేటీ తర్వాత తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాజకీయ పరిణామాల్లో మార్పులు వచ్చాయన్నారు. జాతీయ స్థాయిలో పార్టీ కోసం పని చేస్తానన్నారు.

## దేశవ్యాప్తంగా 5.28 లక్షల పోలీసుల ఉద్యోగాల ఖాళీ

- యూపీలో అత్యధికంగా 1.29 లక్షలు

**న్యూఢిల్లీ:** వివిధ రాష్ట్రాల్లో 5,28,396 పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర హోం శాఖ తెలిపింది. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్ (యూపీ)లో 1.29 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని హోంశాఖ గణాంకాలు తెలిపాయి. ఈశాన్య రాష్ట్రం నాగాలాండ్‌కు 21,292 పోస్టులు మంజూరు చేయగా, అదనంగా 941 మంది పోలీసులు ఉన్నారు. గతేడాది జనవరి ఒకటో తేదీ నాటికి అన్ని రాష్ట్రాలకు 23,79,728 పోస్టులు మంజూరు చేయగా, 18,51,332 మంది పోలీసు పని చేస్తున్నారని హోంశాఖ అధికారి చెప్పారు. యూపీకి అత్యధికంగా 4,14,492 పోలీసు ఉద్యోగాలు మంజూరు చేయగా, ప్రస్తుతం 2,85,952 మంది పని చేస్తున్నారు. బీహార్‌లో 50,291 పోస్టులు, పశ్చిమబెంగాల్‌లో 48,981, తెలంగాణలో 30,345 పోస్టులు ఖాళీగా ఉన్నా యి. పోలీసు ఉద్యోగ నియామకాల్లో జాప్యానికి తోడు పని చేస్తున్న ఉద్యోగుల రిటైర్మెంట్, అకాల మరణాల వల్లే భారీ సంఖ్యలో ఖాళీలున్నాయని అధికారులు చెబుతున్నారు.

## 'నో పార్కింగ్'.. 10వేలు జరిమానా

**ముంబై, జూలై 7:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలకు విధించే భారీ జరిమానా ఆదివారం నుంచి అమల్లోకి వచ్చింది. మొత్తం 56 వాహనాలకు జరిమానా విధించగా అందులో 9 కార్ల యజమానులు రూ.10,000 చొప్పున చెల్లించారు. మిగిలిన వారు పెనాల్టీతో కలిపి త్వరలో చెల్లించే అవకాశముంది.



నో పార్కింగ్ జోన్‌లో వాహనం నిలిపితే కనిష్ఠంగా రూ.5000 నుంచి గరిష్ఠంగా రూ.23000 వరకు జరిమానా కట్టాల్సి ఉంటుంది.

## 'హస్తం' పగ్గాలు

# గాంధీల గుప్పిటేనా!



విధేయులకే కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం • పార్టీపై నియంత్రణ గాంధీ- నెహ్రూ కుటుంబానిదే



**న్యూఢిల్లీ:** వందేండ్లకుపైగా చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం పెను సంక్షోభంలో కూరుకుపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవానికి నైతిక బాధ్యత వహిస్తూ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాజీనామా చేయడం.. పార్టీ నేతలు ఎంత సర్దిచెప్పినా ఉపసంహరించుకునేందుకు ఆయన ససేమిరా అనడంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమైంది. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకున్నా దశాబ్దాలుగా పార్టీలో అధికారం చెలాయించిన గాంధీ-నెహ్రూ కుటుంబం నేడు దాన్ని వదులుకునేందుకు సిద్ధపడుతుందా అనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు పార్లమెంటరీ పార్టీ నేతగా సోనియాగాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ పదవుల్లో కొనసాగుతుండగా, పార్టీపై నియంత్రణ నెహ్రూ-గాంధీ కుటుంబం నుంచి చేజారే అవకాశం లేదని పరిశీలకులు చెప్తున్నారు. గాంధీ కుటుంబం నుంచి మరోవ్యక్తి పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేంతవరకే కొత్త అధ్యక్షుడు ఆ పదవిలో కొనసాగుతారని వారు చెబుతున్నారు.

**ఇప్పటికీ ఆ కుటుంబం చేతుల్లోనే..**

పక్షం రోజుల కిందట సోనియాగాంధీ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రియాంకగాంధీ.. తమ కుటుంబ కంచుకోట అయిన అమేథీలో రాహుల్‌ను గెలిపించడంలో విఫలమైనప్పటికీ తన పదవిలో కొనసాగుతున్నారు. మరోవైపు పార్టీ అధ్యక్షుడిగా కొనసాగకపోయినప్పటికీ తాను యాక్టివ్‌గానే ఉంటానని రాహుల్ ఇదివరకే స్పష్టంచేశారు. అంటే పార్టీపై నియంత్రణ పరోక్షంగా ఆ కుటుంబం చేతుల్లోనే ఉంటుంది. అన్నింటికీ మించి, రాహుల్ స్థానంలో తమ కుటుంబ విధేయుడిని నియమించడం తప్ప ఇతరులను ఆ పదవిలో కూర్చోబెట్టడం ఆ కుటుంబానికి సరిపడని అంశం. డమ్మీలను ముందు నిలబెట్టి, వెనుక నుంచి అధికారం చెలాయించవచ్చని 2004, 2009లో మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిగా నియమించడం ద్వారా సోనియా నిరూపించారు. ఏదేమైనప్పటికీ, ముగ్గురు గాంధీల్లో ఇద్దరు మాత్రం (సోనియా, ప్రియాంక) తమ పదవుల్లో కొనసాగనున్నారు. మొత్తంగా, పార్టీ ఇప్పటికీ ఆ కుటుంబం చేతుల్లోనే ఉన్నది.

**గాంధీ కుటుంబమే ఎందుకు?**

మొదటిది.. దశాబ్దాలపాటు వారు అధికారంలో ఉన్నారు. పార్టీని ఐక్యంగా ఉంచగల శక్తి ఆ కుటుంబానికే ఉన్నదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అంతర్గత శత్రుత్వం కారణంగా చాలా మంది కాంగ్రెస్ నేతలు పార్టీ అధ్యక్షుడిగా తమలో ఒకరి కంటే గాంధీ కుటుంబానికి చెందిన వ్యక్తినే అంగీకరించే పరిస్థితి. గాంధీయేతర వ్యక్తి పార్టీని నడపడం ఎంత కష్టమో పీవీ నరసింహారావు, సీతారాం కేసరి విషయంలో స్పష్టమైంది. అధికారంలో ఉన్నా లేకపోయినా గాంధీ కుటుంబం పార్టీపై పట్టు నిలుపుకున్నది. పీవీ పార్టీ అధ్యక్షుడు అయినప్పుడు, 1991-96 మధ్య ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పుడు.. సోనియా విధేయులు నిత్యం 10 జన్‌పథ్‌కు బారులుదీరేవారు. మరో పవర్ సెంటర్‌గా అది నిలిచింది. పీవీ వారసుడిగా పార్టీ పగ్గాలు చేపట్టిన సీతారాం కేసరి కూడా సమస్యలను ఎదుర్కొన్నారు. 1998లో సోనియాకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే ముందు అవమానకరరీతిలో ఆయన వైదొలగాల్సి వచ్చింది. విదేశీయురాలని శరద్‌పవార్ ప్రశ్నించడంతో 1999లో రాజీనామా చేసిన సోనియా.. పవార్, ఆయన మద్దతుదారులను పార్టీ నుంచి బయటకు పంపిన తర్వాతనే రాజీనామాను వెనక్కి తీసుకున్నారు. పార్టీ మొత్తం సోనియా వెంట నడిచింది.

రెండోది, ఆర్థిక వ్యవహారాలు గాంధీ కుటుంబంతోనే కొనసాగే అవకాశం ఉన్నది. పార్టీ రోజువారీ కార్యకలాపాలకు కూడా కొత్త అధ్యక్షుడు గాంధీలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీని నడిపించడం కొత్త అధ్యక్షుడికి సవాలే. మూడోది, ముగ్గురు గాంధీలు ఉండగా, పార్టీపై ఆ కుటుంబం పట్టు సడలదు అని సీనియర్లకు తెలుసు. ఇందిర, రాజీవ్, సోనియా తదితర నేతలు పార్టీలో తిరుగుబాటునేతలను ఎదుర్కొన్నా, రాహుల్‌కి వ్యతిరేకంగా ఏ ఒక్క నేత కూడా ఎదురుతిరుగలేదు. రాహుల్ వ్యవహారశైలి, తన కోటరీతో సీనియర్లు అసంతృప్తిగా ఉన్నా, ఆయనకు వ్యతిరేకంగా వారెప్పుడూ బహిరంగంగా చాలెంజ్ చేసింది లేదు. పార్టీ తదుపరి అధ్యక్షుడిగా గాంధీ కుటుంబ విధేయుడిని ఎంపిక చేసేందుకు వారంతా కలిసిరావచ్చు. అధ్యక్ష పదవికి గాంధీ కుటుంబ విధేయులైన సుశీల్‌కుమార్ షిండే, మల్లికార్జున ఖర్గేల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గాంధీ కుటుంబం నుంచి మరో వ్యక్తి పార్టీ పగ్గాలు చేపట్టేంతవరకే కొత్త అధ్యక్షుడు ఆ పదవిలో కొనసాగుతారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

### అనిశ్చితిలో రాహుల్ కోటరీ

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పరాజయం, అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా తదనంతర పరిణామాలతో రాహుల్ కోటరీ భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. పార్టీ పరాభవానికి బాధ్యత వహిస్తూ రాహుల్ రాజీనామా చేయడంతో.. ఆయన సన్నిహితులూ అదేబాటలో నడిచారు. తాజాగా రాహుల్‌కు అత్యంత సన్నిహితులైన జ్యోతిరాదిత్య సింధియా, మిలింద్ దేవ్‌రా పార్టీ పదవులకు రాజీనామా చేశారు. అయితే రాహుల్ అనూహ్యంగా అధ్యక్ష పదవి నుంచి వైదొలగడంతో తమ భవిష్యత్తుపై ఆయన సన్నిహితులు ఆందోళన చెందుతున్నారు. పార్టీలో మళ్లీ వృద్ధ నేతలే పెత్తనం చెలాయించే అవకాశం ఉన్నదని వారు కలవరపడుతున్నారు. కొత్త అధ్యక్షుడి ఎంపికలో తాము పాలుపంచుకోమని సోనియా, రాహుల్ స్పష్టం చేసిన నేపథ్యంలో కొత్త అధ్యక్షుడి ఎంపిక నిర్ణయం సీనియర్ నేతల చేతుల్లోనే ఉన్నదని వారు భావిస్తున్నారు. కొత్త అధ్యక్షుడిగా యువనేతనే నియమించాలని పార్టీ నేత, పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ చేసిన సూచన ఫలిస్తుందో లేదో వేచిచూడాల్సిందే.



ఆదివారం ఏపీలోని తిరుపతిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని బయటకు వస్తున్న కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్

## ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా బీపీ ఆచార్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా సీనియర్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య ఎన్నికయ్యారు. ఆదివారం బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా శాంతికుమారి, సెక్రటరీగా వికాస్‌రాజ్, జాయింట్ సెక్రటరీగా సందీప్‌కుమార్ సుల్తానియా, కార్యవర్గ సభ్యులుగా అజయ్‌మిశ్రా, నవీన్‌మిట్టల్, అర్వింద‌ర్‌సింగ్, ఆమ్రపాలి, డాక్టర్ కొర్రలక్ష్మి, ఎండీ ముషారఫ్ ఎన్నికయ్యారు. రిటైర్డ్ ఐఏఎస్‌లు వినోద్ అగర్వాల్, రేమండ్ పీటర్‌లను ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నుకున్నారు.

## జైళ్ల శాఖ డీజీ వీకేసింగ్ బదిలీ!

- ఇంచార్జి డీజీగా సందీప్‌శాండిల్యా?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ వీకే సింగ్‌ను ప్రింటింగ్, స్టేషనరీ విభాగానికి బదిలీచేసినట్టు సమాచారం. జైళ్లశాఖ ఇంచార్జి డీజీగా సీనియర్ ఐపీఎస్ అధికారి, రైల్వేశాఖ డీజీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సందీప్‌శాండిల్యా నియమితులైనట్టు తెలిసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు అందాల్సి ఉన్నదని ఆదివారం జైళ్లశాఖవర్గాలు తెలిపాయి.

## మూకదాడులపై దేశవ్యాప్త ఆందోళనలు

సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు అజీజ్‌పాషా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దళితులు, మైనార్టీలపై జరుగుతున్న మూకదాడులకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అజీజ్ పాషా పేర్కొన్నారు. ఆదివారం తన్జీమ్ – ఈ – ఇన్సాఫ్ ఆధ్వర్యంలో మూకదాడులకు వ్యతిరేకంగా ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ తీరును తప్పుపట్టారు. మూకదాడులపై సుప్రీంకోర్టు స్పందించి.. తక్షణం చట్టం తీసుకురావాలని సూచించినా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత ఐదేండ్లలో దేశవ్యాప్తంగా 266 మంది మూకదాడుల్లో చనిపోయారని చెప్పారు. ఈ విషయంపై ఐక్యరాజ్యసమితి అనుబంధ మానవహక్కుల సంస్థ స్పందించి.. చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని కోరిందని పేర్కొన్నారు. ధర్నాలో నాయకులు అఫ్రోజ్ పటేల్, ఎండీఖాన్, నదీమ్, సోహైల్, రాకేశ్‌సింగ్ పాల్గొన్నారు.

## తొలిసారిగా స్టాన్లీలో సీఎంఈ కోర్సు

**అబిడ్స్, నమస్తే తెలంగాణ:** ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన రంగాలైన డాటా అనలిటిక్స్, మెషిన్‌లెర్నింగ్, ఐవోటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్తగా రూపొందించిన కంప్యూటర్ ఇంజినీరింగ్ (సీఎంఈ) కోర్సును మొదటిసారిగా హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశపెట్టామని కళాశాల కరస్పాండెంట్ కే కృష్ణారావు తెలిపారు. ఈ కోర్సుకు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఓయూ నుంచి అనుమతులు పొందామన్నారు. డిమాండ్ కలిగిన కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌కు సమానంగా గేట్, కంప్యూటర్ సైన్స్ సిలబస్‌ను కవర్‌చేస్తూ, ఉద్యోగావకాశాలు లభించేలా కోర్సుకు సిలబస్‌ను రూపొందించినట్టు చెప్పారు.

# నేరస్థుల పనిపడుతున్న పాపియోన్

- తెలంగాణ పోలీసుల చేతిలో అధునాతన ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీ
- దేశంలో ఉపయోగించడం ఇదే తొలిసారి
- రెండేండ్లలోనే వందల కేసుల పరిష్కారం
- నేర పరిశోధనలో దూసుకెళ్తున్న తెలంగాణ సీఐడీ
- కొత్త టెక్నాలజీతో పక్కాగా నేర పరిశోధన
- సిబ్బంది సంఖ్య పెరిగితే మరిన్ని అద్భుత ఫలితాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హత్య అయినా.. దొంగతనమైనా.. మరే నేరమైనా క్రైం సీన్‌లో లభించే వేలిముద్రలే నేరపరిశోధనలో అత్యంత కీలకం. చాలా కేసుల్లో వీటి ఆధారంగానే నేరస్థులను గుర్తిస్తుంటారు. ఆ నేరాలను కోర్టులో నిరూపించే పోలీసులకు ఇవి శాస్త్రీయ ఆధారాలుగా ఉపకరిస్తాయి. నేర పరిశోధనలో ఎంతో కీలకమైన వేలిముద్రల విశ్లేషణ కోసం తెలంగాణ పోలీసులు దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక పాపియోన్ (ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం)ను వాడుతున్నారు. ఎఫ్‌బీఐ (అమెరికా జాతీయ దర్యాప్తు సంస్థ) లాంటి అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలు ఉపయోగిస్తున్న ఈ పాపియోన్ ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీని గతేడాది మే నెలలో అందుబాటులోకి తీసుకొచ్చిన తెలంగాణ పోలీసులు.. ఈ రెండేండ్లలో వందల కేసులను పరిష్కరించారు. ఈ టెక్నాలజీని ఉపయోగించి పాత కేసులను ఛేదించడం, నేరస్థులను ముందుగానే గుర్తించడం, మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్‌లతో రియల్‌టైంలోనే అనుమానితులను గుర్తించడంలో తెలంగాణ సీఐడీ ఫింగర్ ప్రింట్ బ్యూరో ఎంతో ముందున్నది.



**'క్యాట్' టూల్‌తో సత్ఫలితాలు**

తెలంగాణలో వినియోగిస్తున్న పాపియోన్ ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీకి ఇటీవల 'క్యాట్' (క్రిమినల్ అప్రిహెన్షన్ టూల్)ను జత చేశారు. ఈ టూల్ అద్భుత ఫలితాలను ఇస్తున్నదని, దీని ద్వారా 30 మంది వాంటెడ్ నేరగాళ్లను గుర్తించామని అధికారులు తెలిపారు. పోలీసుల సర్వర్‌లో పాత నేరస్థులు, ఓవీ (ఔట్‌ఆఫ్ వ్యూ)లు, వాంటెడ్ నేరగాళ్ల వేలిముద్రలు, ఫొటోలు ఉంటాయి. ప్రస్తుతం ఫింగర్‌ప్రింట్స్‌కు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ, ఏపీ ఇచ్చిపుచ్చుకుంటుండటంతో ఒక రాష్ట్రంలో పట్టుబడిన నేరస్థుడిపై మరో రాష్ట్రంలో కేసు ఉంటే ఆ వివరాలు హైదరాబాద్‌లోని ఫింగర్‌ప్రింట్ బ్యూరో సర్వర్‌లో తెలిసిపోతుంది. ఫింగర్‌ప్రింట్ బ్యూరో అధికారులు స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తుండటంతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి.

**సిబ్బంది కొరతతో అదనపు భారం**

ఫింగర్‌ప్రింట్స్ విశ్లేషణలో తెలంగాణ పోలీసులకు అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నా క్షేత్రస్థాయిలో సరిపడినంత సిబ్బంది లేకపోవడంతో అదనపు భారం పడుతున్నది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ఫింగర్ ప్రింట్ బ్యూరోలో సిబ్బంది సంఖ్య సగానికి పడిపోయింది. డైరెక్టర్ పోస్టు కూడా ఏపీకి వెళ్లడంతో ఇంచార్జి డైరెక్టరే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం 68 పోస్టులకు (ఒక డీఎస్పీ, 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 21 మంది ఎస్సైలు, 33 మంది ఏఎస్సైలు) 30 మంది (ఒక డీఎస్పీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, 21 మంది ఎస్సైలు, ఐదుగురు ఏఎస్సైలు) మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇంకా 38 పోస్టులు భర్తీచేయాల్సి ఉన్నది. తెలంగాణలో కొత్త జిల్లాలు, కమిషనరేట్ల ఏర్పాటుతో సిబ్బంది అవసరం మరింత పెరిగింది. అన్ని జిల్లాల్లో సరిపడా సిబ్బంది ఉండాలంటే నలుగురు డీఎస్పీలు, 30 మంది ఇన్‌స్పెక్టర్లు, 108 మంది ఎస్సైలు కలిపి మొత్తం 142 పోస్టులు మంజూరు చేయాలని పోలీస్‌శాఖ కోరింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

### 'పాపియోన్'తో వేగంగా కేసుల ఛేదన

తెలంగాణ పోలీసులు పాపియోన్ టెక్నాలజీని తెచ్చిన తర్వాత ఎన్నో అపరిష్కృత కేసుల చిక్కుముడులు వీడాయి. 12,413 పాత కేసుల్లో పాపియోన్ టెక్నాలజీని వినియోగించి 641 కేసులను పరిష్కరించారు. ఈ టెక్నాలజీ కోసం రూ.20 కోట్లు ఖర్చుచేసిన తెలంగాణ పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా పరిష్కారమైన ప్రాపర్టీ అఫెన్స్ కేసుల్లో దొంగల నుంచి మొత్తం రూ.18.51 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ పోలీసులు ఈ టెక్నాలజీ ద్వారా ఏపీ, కర్ణాటకకు చెందిన 448 కేసుల్లో 19 కేసులను ఛేదించడంతోపాటు డాటాబేస్‌లోని వేలిముద్రల ఆధారంగా 68 అనాథ శవాల వివరాలను కనిపెట్టగా.. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్‌ల ద్వారా పెట్రోలింగ్ బృందాలు పాత నేరచరిత్ర ఆధారంగా 9,450 మంది అనుమానితులను గుర్తించారు. పాస్‌పోర్టుల వెరిఫికేషన్‌కు వెళ్లే ఎస్బీ సిబ్బందికి మొబైల్ సెక్యూరిటీ డివైజ్‌లు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ఇప్పటివరకు 23 మంది తమ నేరచరిత్రను దాచిపెట్టి పాస్‌పోర్టులకు దరఖాస్తు చేసినట్టు గుర్తించడంతో వారి పాస్‌పోర్టులను రద్దుచేశారు. 3,595 మంది రోహింగ్యాల వేలిముద్రలను సేకరించి డాటాబేస్‌లో అప్‌లోడ్ చేశారు.

## పునర్వివాహాలతో జీవితాల్లో కొత్త వెలుగులు

- తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య

**బషీర్‌బాగ్:** పునర్వివాహాలు జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతాయని ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య అన్నారు. మధ్య వయస్సులో భాగస్వామిని కోల్పోయిన వ్యక్తులకు పునర్వివాహ పరిచయ వేదికలు తోడు కల్పించాలని అభిప్రాయపడ్డారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్యభవనంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అధ్యక్షతన 'పునర్వివాహ పరిచయ వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులతో కలిసి రోశయ్య 'ఆర్యవైశ్య పుస్తకాన్ని' ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సామాజిక సేవల్లో రాణించినప్పుడే అన్నివర్గాల మన్ననలు పొందుతారని చెప్పారు. పునర్వివాహ పరిచయ వేదికలో 200 మందికిపైగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధ్యక్షుడు పోలేటి దామోదర్‌గుప్తా, వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళిగుప్తా, ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ముస్త్యాల సత్తయ్య, కోశాధికారి బచ్చు శేఖర్, ప్రాజెక్టు చైర్మన్ నిజాం వెంకటేశం, పొలిటికల్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ఫెడరేషన్ సభ్యులు మురళీకృష్ణగుప్తా, వేణు, సుజాత, విజయలక్ష్మి, వెంకన్న, పూర్ణశాంతి పాల్గొన్నారు.




ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్యభవనంలో మాజీ గవర్నర్ రోశయ్యను సన్మానిస్తున్న వైశ్య ఫెడరేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌గుప్తా, దామోదర్‌గుప్తా, గంజి రాజమౌళిగుప్తా తదితరులు

## రాంప్రసాద్ హత్యకు పక్కా స్కెచ్!

**ఖైరతాబాద్:** వ్యాపారి తెల్లపోలు రాంప్రసాద్ హత్య వెనుక పెద్ద కుట్ర కోణం దాగిఉన్నట్టు తెలుస్తున్నది. మాజీ భాగస్వామితో ఉన్న వివాదం, పోలీస్ కేసులు హత్యకు దారితీసినట్టు పోలీసులు భావిస్తున్నారు. శనివారం రాత్రి పంజాగుట్ట దుర్గానగర్ కాలనీలో శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి బయటకు వచ్చిన రాంప్రసాద్‌ను ముగ్గురు దుండగులు కత్తులతో దాడిచేశారు. తీవ్రంగా గాయపడ్డ ఆయన.. ప్రైవేటు దవాఖానలో చికిత్సపొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. తన భర్త హత్య వెనుక విజయవాడకు చెందిన కోగంటి సత్యం ఉన్నట్టు రాంప్రసాద్ భార్య వైదేహి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్యోదంతానికి ఏపీలోని విజయవాడతో లింక్ ఉన్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. విజయవాడ కేంద్రంగా సత్యం 2008లో కామాక్షి స్టీల్స్ పేరుతో వ్యాపారం ప్రారంభించాడు. పరిచయస్థుడైన రాంప్రసాద్‌ను భాగస్వామిగా చేర్చుకొన్నాడు. 2013లో కంపెనీ లెక్కల్లో రూపాయలు కోట్లలో తేడా ఉందంటూ రాంప్రసాద్‌పై సత్యం ఆరోపణలు చేశాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. రాంప్రసాద్ కేసు పెట్టడంతో సత్యంను అరెస్టుచేశారు. 2015లో హైదరాబాద్‌కు మకాం మార్చిన రాంప్రసాద్ 2017లో పరిగిలో అభిరామ్ స్టీల్స్ వ్యాపారం ప్రారంభించాడు. ఈ క్రమంలో శనివారం హత్యకు గురయ్యాడు. హత్యకు ఉపయోగించిన ఆరు కత్తులను పంజాగుట్ట పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకుని, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిం చారు. పక్కాస్కెచ్‌తో హత్యచేసినట్టు వారు తెలిపారు. విజయవాడకు వెళ్లిన పోలీసులు సత్యంను విచారించినట్టు తెలిసింది. నిందితుల కోసం రెండు పోలీస్‌బృందాలు గాలిస్తున్నాయి.

## తాసిల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలి

తెలంగాణ తాసిల్దార్ల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ అయిన తాసిల్దార్లను సొంత జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ తాసిల్దార్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో తాసిల్దార్ల సంఘం రాష్ట్ర కార్యవర్గం సమావేశమైంది. సంఘం అధ్యక్షుడు కే గౌతమ్‌కుమార్, ప్రధానకార్యదర్శి వెంకటభాస్క ర్ మాట్లాడుతూ.. తొమ్మిది నెలలుగా కుటుంబాలకు దూరంగా ఉన్నామని.. తిరిగి సొంత జిల్లాలకు బదిలీచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు పూల్ సింగ్‌చౌహాన్, రాష్ట్ర కార్యదర్శులు రాజేశ్వర్ ముంతాజ్, వెంకటరెడ్డి, అన్వర్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, కుమార్, మల్లేశం, శ్రీనివాస్, సుభాష్‌చందర్, జయంత్, మంగీలాల్, అమీన్ సింగ్, సంఘం సలహాదారులు సలీముద్దీన్ పాల్గొన్నారు.

## ఏవోబీ ఈస్ట్ డివిజన్ కమిటీ సభ్యుడు నవీన్ బహిష్కరణ

ప్రకటన విడుదల చేసిన ఏవోబీ కార్యదర్శి గణేశ్



నవీన్ (ఫైల్)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మావోయిస్టు ఆంధ్రా – ఒడిశా సరిహద్దు ప్రత్యేకజోన్ ఈస్ట్ డివిజన్ కమిటీ సభ్యుడు నవీన్‌ను మావోయిస్టు పార్టీ బహిష్కరించింది. ఈ మేరకు ఏవోబీ కార్యదర్శి గణేశ్ పేరిట ఆదివారం ఓ బహిరంగ ప్రకటన విడుదలైంది. నల్లగొండ జిల్లాకు చెందిన నవీన్ అలియాస్ అంజయ్య 16 ఏండ్ల క్రితం దళంలోకి వెళ్లాడు. 2007లో నల్లగొండ, నల్లమల ప్రాంతంలో సభ్యుడిగా పనిచేశాడు. అనంతరంలో ఏవోబీలో ఈస్ట్ డివిజన్‌లో ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. నవీన్ ఎక్కడ పనిచేసినా వ్యక్తిగత గుర్తింపు కోసం పాకులాడేవాడు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా గోలకొండ ఏరియాకమిటీ సభ్యురాలు జీవనిని వివాహం చేసుకున్నాడు. దీంతో వీరిద్దరి పార్టీ సభ్యత్వం రద్దుచేసి.. సస్పెండ్ చేసినట్టు లేఖలో పేర్కొన్నారు. ప్రజలు, విప్లవ సానుభూతిపరులెవరూ వీరికి సహకరించవద్దని కోరారు.



## హాంకాంగ్‌లో జన ఘర్జన

- చైనాను కలిపే వివాదాస్పద రైల్వే స్టేషన్ ముట్టడి

**హాంకాంగ్, జూలై 7:** హాంకాంగ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆందోళనకారులు ఆదివారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. నేరస్థుల అప్పగింత చట్టం విషయంలో హాంకాంగ్ నేతలు చైనాకు అనుకూలంగా వ్యవహరించడంపై మండిపడుతున్న ఆందోళనకారులు.. హాంకాంగ్ నగరాన్ని చైనా ప్రధాన భూభాగంతో కలుపుతున్న వివాదాస్పద రైల్వే స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. చైనా పాలకుల అభీష్ఠం మేరకు రూపొందించిన నేరస్థుల అప్పగింత ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయాలని, హాంకాంగ్ సీఈవో పదవి నుంచి కారీ లామ్ (ప్రజలు ఎన్నుకోని నేత) వైదొలగాలని, అరెస్టు చేసిన ఆందోళనకారులను విడుదల చేయడంతోపాటు తమపై బాష్పవాయు గోళాలను, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించిన పోలీసులపై స్వతంత్ర విచారణ జరిపించాలని నినాదాలతో హోరెత్తించారు.


### బీజేపీలో చేరిన గాయని స్వప్నా చౌదరి



**న్యూఢిల్లీ, జూలై 7:** హర్యానాకు చెందిన ప్రముఖ గాయని స్వప్నా చౌదరి కాంగ్రెస్‌లో చేరనున్నారంటూ వదంతులు వచ్చినప్పటికీ చివరికి ఆమె ఆదివారం బీజేపీలో చేరారు. ఢిల్లీలో బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా తొలి చేరిక స్వప్నా చౌదరిదే.

### అవకాశాన్ని వదులుకోవడానికి సన్నాసులం కాదు

- కర్ణాటక రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు యడ్యూరప్ప



**బెంగళూరు, జూలై 7:** 'ఏమి జరుగబోతున్నదో చూస్తూ ఉండండి.. స్పీకర్ నిర్ణయం తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం' అని కర్ణాటక రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు యడ్యూరప్ప అన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం వస్తే వదులుకోవడానికి తాము సన్నాసులం కాదని ఆదివారం ఆయన మీడియాతో అన్నారు. కాగా కర్ణాటకలోని కాంగ్రెస్-జేడీయూ సంకీర్ణ ప్రభుత్వంలో ఏర్పడిన సంక్షోభాన్ని బీజేపీ నిశితంగా గమనిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో 224 స్థానాలకుగాను బీజేపీ 105 స్థానాల్లో విజయం సాధించినా 113 మేజిక్ ఫిగర్ చేరుకోలేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. కాంగ్రెస్ 78, జేడీఎస్ 37, బీఎస్పీ 1, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులతో కలిపి 118 మందితో కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వ ఏర్పాటును జీర్ణించుకోలేకపోతున్నది.



# కర్ణాటకలో కొనసాగుతున్న అనిశ్చితి

- వేగంగా మలుపులు తిరుగుతున్న రాజకీయం..
- సీఎం మార్పుపై కాంగ్రెస్-జేడీఎస్ సంకేతం
- అమెరికా నుంచి తిరిగి వచ్చిన సీఎం కుమారస్వామి
- జేడీఎస్, కాంగ్రెస్ నేతలతో అర్ధరాత్రి చర్చలు
- సంక్షోభానికి సిద్ధరామయ్యే కారణమన్న దేవెగౌడ
- ముంబైలోని అసంతృప్త ఎమ్మెల్యేలతో ఎడతెగని మంతనాలు



బెంగళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయంలో జేడీఎస్ నేతలతో కర్ణాటక సీఎం హెచ్‌డీ కుమారస్వామి

**బెంగళూరు, జూలై 7:** కర్ణాటకలో రాజకీయ అనిశ్చితి కొనసాగుతున్నది. రాష్ట్రంలో రాజకీయం పలు మలుపులు తిరుగుతున్నది. కాంగ్రెస్-జేడీఎస్‌కు చెందిన 13 మంది ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వంలో ఏర్పడిన సంక్షోభం శిఖరాగ్రానికి చేరుకున్నది. 14 నెలల తన ప్రభుత్వ మనుగడకు ముప్పు వాటిల్లడంతో అమెరికా పర్యటనలో ఉన్న సీఎం హెచ్‌డీ కుమారస్వామి ఆగమేఘాల మీద ఆదివారం రాత్రి బెంగళూరు చేరుకున్నారు. వచ్చీ రావడంతోనే నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో జేడీఎస్ ఎల్పీ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలూ హాజరయ్యారు. ప్రభుత్వాన్ని కాపాడుకొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు ప్రారంభించారు. అవసరమైతే సీఎంను మార్చడానికి సైతం వారు సిద్ధపడినట్టు తెలుస్తున్నది. సీఎం పదవికి సిద్ధరామయ్య అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన జేడీఎస్ అధ్యక్షుడు దేవెగౌడ మల్లికార్జున ఖర్గే వైపు మొగ్గుచూపినట్టు సమాచారం. మరోవైపు తమ రాజీనామా నిర్ణయం నుంచి వెనుకకు తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్-జేడీఎస్ ఎమ్మెల్యేలు ముంబైలో ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవకాశం వస్తే.. వదులుకోవడానికి తాము సన్నాసులం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప వ్యాఖ్యానించారు. కాగా ప్రభుత్వ ఏర్పాటులో బీజేపీకి ఎలాంటి అవకాశం ఇవ్వబోమని దేవెగౌడ స్పష్టం చేశారు. సీఎం పదవిలో ఎవరు ఉండాలన్నది రెండు పార్టీలు కలిసి నిర్ణయిస్తాయని తెలిపారు.

**జోరందుకున్న రిసార్టు రాజకీయం**

గతంలో రాజీనామా చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే, మరో అసంతృప్త ఎమ్మెల్యే సహా మొత్తం 14 మంది కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు శనివారం రాత్రి ప్రత్యేక విమానంలో ముంబైకి చేరారు. ఈ విమానం బీజేపీ ఎంపీ రాజీవ్ చంద్రశేఖర్‌కు చెందిన జూపిటర్ కాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీదని తెలుస్తున్నది. దీంతో అధికార కూటమి ఎమ్మెల్యేల రాజీనామాల వెనుక ప్రతిపక్ష బీజేపీ హస్తం ఉన్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోఫిటెల్ హోటల్‌లో బస చేసిన వీరితో మంతనాల కోసం కాంగ్రెస్, జేడీఎస్ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు బీజేపీ కూడా తమ ఎమ్మెల్యేల కోసం దొడ్డబళ్లాపురలోని రమద హోటల్‌లో 30 గదులు బుక్ చేయడంతో ఇప్పటికే కొందరు అక్కడికి చేరినట్లు తెలుస్తున్నది.

**రంగంలోకి ట్రబుల్ షూటర్**

ట్రబుల్ షూటర్‌గా పేరొందిన కాంగ్రెస్ నేత, మంత్రి డీకే శివ కుమార్.. ఆదివారం జేడీఎస్ అధినేత దేవెగౌడ నివాసానికి వెళ్లారు. తాజా సంక్షోభంపై దేవెగౌడతో చర్చించారు. అసంతృప్త ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు ఏం చేయాలన్నదానిపై చర్చించారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడేందుకు ఎలాంటి త్యాగానికైనా తాను సిద్ధమేనని కాంగ్రెస్ మంత్రి డీకే శివకుమార్ మీడియాతో అన్నారు.

**తెరపైకి మల్లిఖార్జున ఖర్గే పేరు**

సంకీర్ణ ప్రభుత్వంలో నెలకొన్న సంక్షోభం సీఎం మార్పుతోనే తొలుగుతుందన్న వాదనలు కాంగ్రెస్ నుంచి బలంగా వినిపిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత మల్లిఖార్జున ఖర్గే పేరు తెరపైకి వచ్చింది. ఈ మేరకు డీకే శివకుమార్ చేసిన ఈ ప్రతిపాదనకు జేడీఎస్ అధినేత దేవెగౌడ్ కూడా సుముఖమని తెలుస్తున్నది.

**ఇదంతా బీజేపీ కుట్ర: మల్లికార్జున ఖర్గే**

కాగా సంకీర్ణ ప్రభుత్వం సంక్షోభానికి బీజేపీ కుట్రే కారణమని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సీఎం పగ్గాలు ఆయనకు అప్పగించ వచ్చని జరుగుతున్న ప్రచారాన్ని ఖర్గే ఖండించలేదు. ఈ వదంతులన్నీ తమ మధ్య విభేదాలు సృష్టించేవేనని, రాష్ట్రంలో సంకీర్ణ పాలన సజావుగా సాగాలన్నదే తమ పార్టీ అభిమతమన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కర్ణాటకకు వచ్చి పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు కర్ణాటక సీఎల్పీ నేత, సంకీర్ణ కూటమి సమన్వయ కమిటీ చైర్మన్ సిద్ధరామయ్య స్పందిస్తూ ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని ధీమా వ్యక్తం చేశారు.

### సిద్ధరామయ్యే కుట్రదారుడు:దేవెగౌడ

దేవెగౌడ, సిద్ధరామయ్య మధ్య ఉన్న శతృత్వం మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో జేడీఎస్‌కు చెందిన సిద్ధరామయ్య 2005లో ఆ పార్టీని వీడారు. జేడీఎస్‌ను నామరూపాలు లేకుండా చేస్తానని సవాల్ చేసిన ఆయన ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం అయ్యారు. కాగా తాజా సంక్షోభానికి సిద్ధరామయ్యే కారణమని జేడీఎస్ అధినేత దేవెగౌడ ఆరోపించారు. 14 మంది ఎమ్మెల్యేల రాజీనామా వెనుక సిద్ధరామయ్య ఉన్నారని తనకు తెలుసని, వారంతా ఆయన మద్దతుదారులేనని అన్నారు. తనను కలిసిన కాంగ్రెస్ నేత శివకుమార్‌తో కూడా దేవెగౌడ ఇదే విషయం చెప్పినట్లు తెలుస్తున్నది. సిద్ధరామయ్యను సీఎం చేయాలని కొందరు అసంతృప్త నేతలు కోరుతున్నట్లు శివకుమార్ చెప్పగా దానికి దేవెగౌడ ససేమిరా అన్నారు. కాంగ్రెస్ దీనికి పట్టుబడితే తమ మద్దతు ఉపసంహరించుకుంటామని దేవెగౌడ హెచ్చరించినట్లు తెలుస్తున్నది.

### రేపు సీఎల్పీ సమావేశం

ఈ నెల 9న సీఎల్పీ నేత సిద్ధరామయ్య నేతృత్వంలో సీఎల్పీ భేటీ నిర్వహిస్తామని కాంగ్రెస్ తెలిపింది. మంగళవారం జరిగే ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలంతా తప్పక హాజరుకావాలని పేర్కొంది. గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవని రెబల్ ఎమ్మెల్యేలను ఘాటుగా హెచ్చరించింది.



ముంబైలో మీడియాతో మాట్లాడుతున్న రెబెల్ ఎమ్మెల్యేలు



రెబెల్ ఎమ్మెల్యేలు బస చేసిన ముంబై హోటల్ వద్ద నిరసన తెలుపుతున్న యువజన కాంగ్రెస్ కార్యకర్తలు


### రైల్వేల ప్రైవేటీకరణకు సర్కార్ యత్నాలు

- 10 నుంచి 13 వరకు దేశవ్యాప్త నిరసనలు: ఎన్ఎఫ్ఐఆర్

**న్యూఢిల్లీ:** రైల్వేలను ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్లు బడ్జెట్ ప్రతిపాదనలను బట్టి తెలుస్తున్నదని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) ప్రధాన కార్యదర్శి ఎం రాఘువయ్య ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వేల ప్రైవేటైజేషన్, కార్పొరేటైజేషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సామూహిక నిరసన ప్రదర్శనలు జరుపాలని అనుబంధ రైల్వే కార్మిక సంఘాలకు రాఘువయ్య ఆదివారం పిలుపునిచ్చారు. ఈ మేరకు అన్ని రైల్వే యూనియన్ల ప్రధాన కార్యదర్శులకు రాఘువయ్య లేఖ రాశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 10 నుంచి 13 వరకు ప్రదర్శనలు జరుపాలని, నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. శరవేగంగా అభివృద్ధి కోసం రైల్వేల్లో ఉత్పత్తి, రవాణా విభాగాలలో పీపీపీ విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

### సుదీర్ఘ సమావేశాలు ప్రభుత్వ బాధ్యతను పెంచుతాయి

- లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా వ్యాఖ్య
- రాజస్థాన్ అసెంబ్లీ వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణ



**జైపూర్:** సుదీర్ఘ అసెంబ్లీ సమావేశాలు, సభలో ఎమ్మెల్యేలు ప్రస్తావించే సమస్యలు, వేసే ప్రశ్నలు ప్రభుత్వాన్ని మరింత బాధ్యతగా పనిచేసేలా చేస్తాయని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా అన్నారు. సభలో అనుసరించాల్సిన విధానాలపై రాజస్థాన్ ఎమ్మెల్యేలకు నిర్వహించిన ఓ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అన్ని విషయాలపై సభలో చర్చించాలని సభ్యులకు ఓమ్ బిర్లా సూచించారు. ఒక మంత్రిత్వ శాఖకు సంబంధించి అసెంబ్లీలో ఓ సభ్యుడు ఎక్కువ ప్రశ్నలు వేస్తే, ఆ శాఖకు సంబంధించిన మంత్రి తన శాఖపై మరింత దృష్టిపెట్టే వీలు కలుగుతుందని స్పీకర్ అన్నారు. శాసన సభ సమావేశాలు సుదీర్ఘకాలం కొనసాగాలని, అలా జరిగితే ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తుందని సూచించారు. స్పీకర్ పోడియంలోకి సభ్యులు దూసుకెళ్లే పద్ధతి మంచిది కాదని, సభను వాయిదా వేయడానికి ఇది కారణమవుతుందని ఆయన అన్నారు. 'స్పీకర్ పోడియంలోకి వస్తే నాయకులు కాలేరు. లోక్‌సభలో కూడా ఇదే విషయాన్ని చెప్పాం. సభ్యుడు సభలో మాట్లాడితేనే, ప్రజలు ఇష్టపడుతారు' అని అన్నారు. 'లోక్‌సభ సజావుగా సాగితేనే, రాష్ట్రాల శాసనసభలు కూడా ఆ విధానాన్ని అనుసరిస్తాయి' అని పేర్కొన్నారు. సభలోని సభ్యులు ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు. పార్లమెంట్ విధానాలను శాసనసభ సభ్యులు నేర్చుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషి అన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల సభ్యులకు పార్లమెంట్ నిబంధనలు తెలుస్తాయని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ అన్నారు. రాజస్థాన్ అసెంబ్లీకి సంబంధించిన కొత్త వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను బిర్లా ఆవిష్కరించారు.

### అసోంలో ప్రసాదం తిని 150 మందికి అస్వస్థత

**రంగియా:** ప్రసాదం తిని 150 మంది తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన అసోంలో చోటుచేసుకున్నది. కరుప్ జిల్లా లెంగా గ్రామంలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసాదాన్ని తిని 150 మంది అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వాళ్ళను దగ్గర్లోని దవాఖానకు తరలించారు. విషాహారం తినడం వల్లే బాధితులు అస్వస్థతకు గురైనట్టు వైద్యులు తెలిపారు.

### ఇండోనేషియాలో భూకంపం

- రిక్టార్ స్కేల్‌పై 6.9గా నమోదు.. సునామీ హెచ్చరికలు జారీ

**జకర్తా:** ఇండోనేషియాలో ఆదివారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.9గా నమోదైంది. దీంతో అక్కడి అధికార వర్గాలు తీర ప్రాంతంలో సునామీ హెచ్చరికలు జారీ చేశాయి. ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు.

### తీవ్రవాదుల శిబిరం ధ్వంసం

- మణిపూర్‌లోని ఓ గ్రామంలో రహస్యంగా కొనసాగుతున్న ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం) క్యాంపు
- కౌన్సిల్ సభ్యుడి అరెస్ట్‌తో వెలుగులోకి స్థావరం విషయాలు



తీవ్రవాదుల శిబిరంనుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, సామగ్రి

**న్యూఢిల్లీ:** మణిపూర్ రాష్ట్రం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న తీవ్రవాద సంస్థ నాగాలాండ్ నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ (ఇసాక్-ముయివా)రహస్య శిబిరాన్ని భారత సైన్యం గుర్తించి ధ్వంసం చేసింది. సాధారణ దుస్తుల్లో ఉండి స్థానికులతో కలిసిపోయి ఉన్న కౌన్సిల్‌కు చెందిన ఒక సభ్యుడి అరెస్ట్‌తో రహస్య స్థావరం వివరాలు వెలుగులోకి వచ్చాయి. కాగా తీవ్రవాదులు మణిపూర్‌లోని ఒక గ్రామంలో ప్రజల నుంచి దోపిడీ చేస్తున్నట్టు ఆర్మీ గుర్తించింది. ఈశాన్య భారతంలో అతి పెద్ద తీవ్రవాద గ్రూపు అయిన ఎన్ఎస్‌సీఎన్(ఐఎం) కేంద్రంతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకొన్నది. దాని శిబిరాల వివరాలిన్నింటినీ ఆర్మీకి నివేదించాలన్న షరతు ఉన్నది. 'శనివారం మణిపూర్‌లోని కేక్రూ నాగా గ్రామంలో రహస్యంగా కొనసాగుతున్న నాగాలాండ్ సోషలిస్ట్ కౌన్సిల్ శిబిరాన్ని సైనికదళాలు ఛేదించాయి. జూలై 5న ఆపరేషన్ ప్రారంభించి మరుసటిరోజు ఉదయం విజయవంతంగా ముగించారు' అని ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. శిబిరం వైపు సైన్యం రావడాన్ని గమనించిన ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం) తీవ్రవాదులు ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర వస్తువులను వదిలి పారిపోయారని ఆర్మీ పేర్కొన్నది. శిబిరం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఆర్మీ స్వాధీనం చేసుకొన్నది. 1980లో స్థాపించిన కౌన్సిల్‌కు ప్రస్తుతం 85 ఏండ్ల తుంగిలాంగ్ ముయివా నేతృత్వం వహిస్తున్నాడు. కౌన్సిల్‌కు చెందిన అగ్రనాయకుడు ఇసాక్ చిషి (87) మూడేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. హత్యలు, దోపిడీలతోపాటు విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టుగా ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం)పై ఆరోపణలు ఉన్నాయి. నాగాలాండ్‌లో శాంతి స్థాపన కోసం కేంద్ర ప్రభుత్వంతో ఎన్ఎస్‌సీఎం (ఐఎం) 1997లో ఒప్పందం కుదుర్చుకొన్నది.

### షరీఫ్‌కు జైలుశిక్ష వెనుక కుట్ర


- జడ్జిపై ఒత్తిడి తెచ్చారు
- పాక్ మాజీ ప్రధాని నవాజ్ కుమార్తె మర్యం ఆరోపణ



**లాహోర్:** సంచలనం సృష్టించిన పనామా పేపర్ల కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు వ్యతిరేకంగా తీర్పునివ్వాలంటూ తనను బ్లాక్‌మెయిల్ చేయడమేకాకుండా ఒత్తిడి తెచ్చారంటూ జడ్జి అర్షద్ మాలిక్ మాట్లాడుతున్న వీడియోను షరీఫ్ కుమార్తె మర్యం బయటపెట్టారు.లాహోర్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పనామా పేపర్ల కేసులో తన తండ్రిపై విచారణ అంతా ఓ పథకం ప్రకారం జరిగిందని ఆరోపించారు. అయితే మర్యం వ్యాఖ్యలను జడ్జి మాలిక్ ఖండించారు. షరీఫ్‌కు వ్యతిరేకంగా తీర్పునివ్వాలంటూ తనపై ఎలాంటి ఒత్తిడి రాలేదని స్పష్టంచేశారు.

## నిరాశాజనకంగా వానకాలం పంటలు

- లోటు వర్షపాతంతో పంటల సాగుపై ప్రభావం
- గతేడాదితో పోలిస్తే దేశవ్యాప్తంగా 27 శాతం తగ్గిన సాగు విస్తీర్ణం
- జూన్ నాటికి 234.33 లక్షల హెక్టార్లకే పరిమితం



**న్యూఢిల్లీ, జూలై 7:** దేశవ్యాప్తంగా వానకాలం పంటల సాగు నిరాశాజనకంగా ఉన్నది. ఆలస్యంగా పలుకరించిన నైరుతి రుతుపవనాలు ఆశించిన వర్షాలను కురిపించకపోవడంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతేడాది కంటే 27 శాతం తక్కువగా, 234.33 లక్షల హెక్టార్లకే సాగు పరిమితమైంది. జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు మెండుగా కురుస్తాయన్న వాతావరణ విభాగం అంచనాల నేపథ్యంలో వచ్చే కొన్ని రోజుల్లో పంటల సాగు పుంజుకునే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తున్నది. కేంద్రం ఇటీవలే 14 వానకాలం పంటలకు కనీస మద్దతు ధరలను పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు నైరుతి రుతుపవనాలు దేశమంతటా విస్తరించినా, ఇప్పటికీ నాలుగింట మూడొంతుల వాతావరణ సబ్‌డివిజన్లు 'లోటు వర్షపాతం' క్యాటగిరీలోనే ఉండడం పరిస్థితిని తెలియజేస్తున్నది.

**తగ్గిన వరి సాగు..**

రుతుపవనాల రాకతో వానకాలం పంటల సాగు మొదలవుతుంది. అయితే సాధారణం కంటే ఈసారి వారం ఆలస్యంగా జూన్ 8న రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించడంతో సాగు ప్రక్రియ ఆలస్యమైంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2018-19 వానకాలం పంట సీజన్‌లో దేశవ్యాప్తంగా గత వారం వరకు కేవలం 234.33 లక్షల హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. అదే గతేడాది ఇదే సమయానికి 319.68 లక్షల హెక్టార్లలో పంటలు సాగవ్వడం గమనార్హం. ప్రధాన పంట అయిన వరి సాగు విస్తీర్ణం గతేడాది జూన్ చివరి నాటికి 68.60 లక్షల హెక్టార్లుగా ఉండగా, ఈ ఏడాది 52.47 లక్షల హెక్టార్లకు పడిపోయింది. ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, ఒడిశా, మధ్యప్రదేశ్, కర్ణాటక, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, అసోం, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.

**పప్పుధాన్యాలు.. తృణధాన్యాలదీ అదే పరిస్థితి..**

పప్పుధాన్యాల్లో ప్రత్యేకించి కంది, మినప, పెసర సాగు దారుణంగా పడిపోయింది. గతేడాది 27.91 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వీటిని సాగుచేయగా, ఈసారి ఇప్పటివరకు సాగు విస్తీర్ణం 7.94 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. మరోవైపు తృణధాన్యాల సాగు విస్తీర్ణం గతేడాది 50.65 లక్షల హెక్టార్లుగా ఉండగా, ఈసారి 37.37 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పడిపోయింది. నూనె గింజలకు సంబంధించి వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, సోయాబీన్ పంటలను గతవారం వరకు 34.02 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. గతేడాది అదే సమయానికి 59.37 లక్షల హెక్టార్లలో ఈ పంటలు సాగవ్వడం గమనార్హం. వాణిజ్య పంటల్లో చెరకును ఇప్పటివరకు 50 లక్షల హెక్టార్లలో సాగుచేయగా, గతేడాది ఇదే సమయానికి 51.41 లక్షల హెక్టార్లలో సాగుచేశారు. మరోవైపు పత్తి, జనపనార సాగు వెనుకబడి ఉన్నది. గతేడాది జూన్ చివరి నాటికి 54.60 లక్షల హెక్టార్లలో పత్తి పంటను సాగుచేయగా, ఈసారి సాగు విస్తీర్ణం 45.85 లక్షలకే పరిమితమైంది.

**ఆందోళన అవసరం లేదు: కేంద్రం**

ఈ ఏడాది సాధారణ వర్షాలే కురుస్తాయని వాతావరణ విభాగం అంచనా వేసిన నేపథ్యంలో వర్షాల గురించి ఆందోళన అవసరం లేదని గతవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ అభిప్రాయపడ్డారు. జూలై 10తో ముగిసే వారానికి, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, ఈశాన్య మధ్యప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, సిక్కిం, ఈశాన్యరాష్ట్రాల్లో సాధారణ వర్షాలు, దక్షిణ భారతంలో సాధారణం లేదా సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. తక్కిన భారతదేశంలో సాధారణం లేదా అంతకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదే జూలై 17తో ముగిసే వారానికి, మధ్యప్రదేశ్‌లోని పలు ప్రాంతాలు, జార్ఖండ్, తూర్పు ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొంది. అలాగే తక్కిన భారతదేశవ్యాప్తంగా సాధారణం లేదా సాధారణం కంటే తక్కువ వర్షాలు నమోదవుతాయని వివరించింది.

### 21 శాతానికి దిగివచ్చిన లోటు వర్షపాతం

నైరుతి రుతుపవనాలు దాదాపు దేశమంతటా విస్తరించినా, ఇప్పటికీ నాలుగింట మూడొంతుల వాతావరణ సబ్ డివిజన్లు లోటు వర్షపాతం క్యాటగిరీలోనే ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. మొత్తంగా, ఈ నెల ప్రారంభంలో 31 శాతంగా ఉన్న లోటు వర్షపాతం ప్రస్తుతం 21 శాతానికి దిగివచ్చిందని తెలిపింది. 'అత్యధిక లోటు' వర్షపాతం క్యాటగిరీలో ఏ సబ్‌డివిజన్ కూడా లేదని పేర్కొంది. సెంట్రల్ వాటర్ కమిషన్ వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా 91 ప్రధాన రిజర్వాయర్లలో నీటిమట్టం సాధారణం కంటే తక్కువకు పడిపోయింది. వాతావరణ పరంగా దేశాన్ని నాలుగు డివిజన్లుగా విభజించిన ఐఎండీ, అనంతరం వాటిని 34 సబ్ డివిజన్లుగా విభజించింది. ఐఎండీ వివరాల ప్రకారం.. 24 సబ్ డివిజన్లలో లోటు వర్షపాతం నమోదైంది. తూర్పు, ఈశాన్య భారతంలో అత్యధికంగా 36 శాతం లోటు వర్షపాతం నమోదుకాగా, దక్షిణ ద్వీపకల్పంలో 30 శాతం లోటు రికార్డయింది. గత వారంలో మధ్యభారతదేశంలో వర్షాలు బాగా కురిశాయి. పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఈశాన్య రాష్ట్రాలతో కూడిన తూర్పు, ఈశాన్య డివిజన్లలో లోటు వర్షపాతం నమోదైంది. వాయవ్య భారతంలోని తొమ్మిది సబ్ డివిజన్లలో ఏడు సబ్‌డివిజన్లు లోటు వర్షపాతం క్యాటగిరీలో ఉన్నాయి. తూర్పు రాజస్థాన్ సబ్‌డివిజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మధ్యభారతదేశ డివిజన్‌లోని పది సబ్‌డివిజన్లలో సౌరాష్ట్ర, మరాఠ్వాడా, విదర్భ సబ్‌డివిజన్లలో లోటు వర్షపాతం నమోదైంది. తూర్పు మధ్యప్రదేశ్‌లో వర్షాలు బాగా కురిశాయి. దక్షిణ ద్వీపకల్పంలోని 10 సబ్ డివిజన్లలో ఏడింట లోటు వర్షపాతం రికార్డయింది.



మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో జలమయమైన ఓ గ్రామం

## జోరందుకున్న వానలు

- మహారాష్ట్ర నాసిక్ జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయం
- 250 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన అధికారులు

**నాసిక్/న్యూఢిల్లీ:** మహారాష్ట్రలో జోరుగా వానలు కురుస్తున్నాయి. నాసిక్ జిల్లాలో శనివారం రాత్రంతా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఆదివారం ఉదయం వరకు కొనసాగిన ఎడతెగని వర్షాలతో ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. గత వేసవిలో తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొన్న జలాశయాలు నీటితో కొత్త కళను సంతరించుకున్నాయని, జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటి మట్టాల్లో పెరుగుదల నమోదవుతున్నదని అధికారులు తెలిపారు. గోదావరి ఒడ్డున గల కాజీ ప్రాంతంలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 250 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు చెప్పారు. ఇగత్‌పురి తాలూకాలో 170 మి.మీ, త్రయంబకేశ్వర్‌లో 135 మి.మీ, పెయింట్‌లో 105 మి. మీ. , సుర్గనాలో 104.2 మి.మీ, దిండోరిలో 34 మి.మీ. , నాసిక్‌లో 29.5 మి. మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు.

**ఉత్తరాదిన భారీ నుంచి అతి భారీ వర్షాలు**

మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ మహారాష్ట్రలో కురుస్తున్న సాధారణ వర్షాలతో లోటు వర్షపాతం 23 శాతానికి తగ్గింది. జూలై మొదటి వారం వరకు ఉత్తర, దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో భిన్నమైన వర్షపాతం నమోదైంది. ఉత్తర, వాయవ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో 50 శాతానికి పైగా లోటు వర్షపాతం నమోదైంది. అయితే, రానున్న నాలుగైదు రోజుల్లో ఈ ప్రాంతాల్లో రుతుపవనాలు గణనీయంగా విస్తరించే అవకాశం ఉన్నది. దక్షిణ ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తర మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్టు ఐఎండీ అంచనా వేసింది. ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ తీర ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని హెచ్చరించింది. హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో రుతుపవనాలు సోమవారం నుంచి మరింత పుంజుకుంటాయని తెలిపింది.



ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన

భారత్: 1983, 2011(చాంపియన్స్)

ఆస్ట్రేలియా: 1987, 1999, 2003, 2007, 2015(చాంపియన్స్)

ఇంగ్లండ్: 1979, 1987, 1992(రన్నరప్)

న్యూజిలాండ్: 2015(రన్నరప్)



అత్యధిక పరుగులు **647** రోహిత్ (భారత్)

అత్యధిక వికెట్లు **26** స్టార్క్ (ఆస్ట్రేలియా)

# కప్ క్లైమాక్స్‌కు

## ప్రపంచకప్‌లో సెమీస్ పోరుకు సిద్ధం

### టైటిల్ ఫేవరెట్లుగా భారత్, ఇంగ్లండ్

### ఆరోసారి కన్నేసిన ఆసీస్

### కప్ కోసం కివీస్‌కు ఆరాటం

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

**ఐదు వారాలు, 45 మ్యాచ్‌లు. ప్రతిష్ఠాత్మక క్రికెట్ ప్రపంచకప్‌లో లీగ్ దశ ప్రస్థానం ఇది. పది మేటి జట్ల సమాహారంతో మొదలైన మెగాటోర్నీలో కప్ కథ క్లైమాక్స్ చేరుకుంది. వర్షం అంతరాయాలతో ఆదిలో కొంత చప్పగా సాగిన వరల్డ్‌కప్ ఆఖరి అంకంలో రంజుగా సాగింది. ప్రేక్షకులు ఊపిరి బిగపట్టేలా..ఉత్కంఠ రేపుతూ ప్రతి పాయింట్ కోసం ప్రాణం పెట్టి పోరాడేలా సాగింది. సత్తా ఉన్న జట్లు టోర్నీలో ముందంజ వేస్తే..చివర్లో పుంజుకుని పోటీలోకి వచ్చినవి మరికొన్ని. అభిమానులు అంచనా వేసినట్లుగానే భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ సెమీస్ రేసులో నిలువగా, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ లీగ్ దశలోనే ఇంటి బాట పట్టాయి. ఆఖరి మ్యాచ్ వరకు సెమీస్ బెర్తులు ఖరారు కాలేదంటే..పోరాటం ఏ స్థాయిలో సాగిందో తెలుస్తున్నది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచి కలల కప్‌ను ముద్దాడే జట్టేదో సరిగ్గా వారం రోజుల్లో తెలియనుంది. ఈ నేపథ్యంలో ఫైనల్ పోరులో నిలిచేదెవరు.. నాకౌట్ అయ్యేదెవరు అన్న దానిపై ప్రత్యేక కథనం.**

ప్రపంచకప్‌లో పది జట్లు వేటికవే సాటి. ఒకదానికి ఒకటి తీసిపోని నేపథ్యం. సుదీర్ఘంగా సాగే గత టోర్నీలకు స్వస్తి పలుకుతూ మేటి జట్ల కలయికతో జరిగిన పోరాటం అభిమానులకు పసందైన విందు అందించింది. ఫుల్ మీల్స్ తరహాలో ఏ లోటు లేకుండా సరికొత్త రికార్డులకు వేదికవుతూ, దిగ్గజ ఆటగాళ్లకు ఘనమైన వీడ్కోలు పలుకుతూ ఆఖరి అంకానికి చేరుకుంది. నెలకు పైగా జరిగిన మహా సంగ్రామంలో వరుణుడి ఆటంకంతో పలు మ్యాచ్‌లు రద్దయినా పోటీలో మాత్రం ఎలాంటి తేడా రాలేదు. గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తమ దేశాన్ని గెలిపించాలనే కసితో కొదమసింహాల్లా కొట్లాడాయి. గెలిచి ముందంజ వేసినవి కొన్ని అయితే. ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వలేక తమ ప్రస్థానాన్ని ముగించినవి మరికొన్ని. కోట్లాది మంది అభిమానుల ఆకాంక్షలకు అనుగుణంగా అప్రతిహత విజయాలతో దూసుకొచ్చింది మన టీమ్‌ఇండియా అయితే న్యూజిలాండ్, ఇంగ్లండ్ పోరాటం పడుతూ లేస్తూ సాగింది. పోరాటమే పరమావధిగా భావించే ఆస్ట్రేలియా చాంపియన్ ఆటతీరుతో అదరగొట్టింది. మూడోసారి కప్‌ను ముద్దాడేందుకు భారత్ తహతహలాడుతుంటే, రికార్డు స్థాయిలో ఆరోసారి విజేతగా నిలిచేందుకు కంగారూలు కసితో కనిపిస్తున్నారు. ఇక ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న రీతిలో సత్తా చాటేందుకు ఇంగ్లండ్, న్యూజిలాండ్ తహతహలాడుతున్నాయి. మరీ ముఖ్యంగా అందని ద్రాక్షగా ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న ప్రపంచకప్‌ను సొంతగడ్డపై దక్కించుకోవాలని ఇంగ్లండ్ ఆరాటపడుతుండగా, సెమీస్ జట్టుగా పేరొందిన కివీస్ రికార్డును తిరుగరాస్తూ కప్ కొట్టేయాలని ఉవ్విళ్లూరుతున్నది.



మోర్గాన్

విలియమ్సన్

## ఇంగ్లండ్ కల సాకారమయ్యేనా..

క్రికెట్ పుట్టింది ఇంగ్లండ్‌లోనైనా.. ఇప్పటి వరకు కప్‌ను కనీసం టచ్ కూడా చేయని ఆ జట్టు తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నది. సొంతగడ్డపై కొట్టిన పిండిల్లాంటి పిచ్‌లపై ప్రపంచకప్‌ను ఎలాగైనా దక్కించుకోవాలని చూస్తున్న మోర్గాన్‌సేనకు..సెమీస్‌లో ఆసీస్ రూపంలో పటిష్ఠ ప్రత్యర్థి ఎదురైంది. లీగ్ దశలో ఎదురైన ఓటమికి దీటైన బదులు తీర్చుకుంటూ 1992 ప్రపంచకప్ తర్వాత తొలిసారి ఫైనల్లోకి వెళ్లాలని పట్టుదలతో ఉంది. జానీ బెయిర్‌స్టో సూపర్ ఫామ్‌తో చెలరేగుతుంటే..సహచరుల నుంచి సహకారం కరువవ్వడం కీలకమైన సెమీస్‌కు ముందు ఆందోళన కల్గిస్తున్నది. బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లండ్, ఆసీస్ మధ్య సెమీస్ పోరు యుద్ధాన్ని తలపించడం ఖాయంగా కనిపిస్తున్నది. వీరబాదుడుకు చిరునామాగా మారిన ఇంగ్లిష్ జట్టు భారత్, న్యూజిలాండ్‌పై వరుస విజయాలిచ్చిన ఆత్మవిశ్వాసంతో ఆసీస్‌ను పడగొట్టాలని చూస్తున్నది.

## కివీస్ 'సెమీస్' దాటేనా..

ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ జట్టుకు సెమీస్ స్టార్స్ అనే ముద్ర బలంగా పడిపోయింది. ఎంతలా అంటే ఇప్పటి వరకు జరిగిన 11 ప్రపంచకప్ టోర్నీల్లో ఏడుసార్లు సెమీస్ చేరిన కివీస్ ఒక్కసారి(2015) ఫైనల్ చేరిందంటే ఇక్కడే అర్థమవుతుంది. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు జట్టంతా ఆల్‌రౌండర్లతో కళకళలాడుతున్నా..కీలక సమయాల్లో తడబడటం కివీస్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఈ ప్రపంచకప్‌లో తొలి దశలో వరుస విజయాలతో దుమ్మురేపిన విలియమ్సన్ సేన ఆఖర్లో హ్యాట్రిక్ ఓటములతో నాకౌట్ బెర్తుకు ఎసరు తెచ్చుకుంది. భారత్ చేతిలో ఇంగ్లండ్ ఓడి ఉండి ఉంటే న్యూజిలాండ్ స్థానంలో పాకిస్థాన్ సెమీస్‌లోకి వచ్చేది. కానీ ఫలితం అందుకు విరుద్ధంగా రావడం కివీస్‌కు కలిసొచ్చింది. దీనికి తోడు లీగ్ దశలో వర్షం కారణంగా భారత్, న్యూజిలాండ్ మ్యాచ్ రద్దు కాగా సెమీస్‌లో ఇవే రెండు జట్లు తలపడనున్నాయి. మాంచెస్టర్‌లో జరిగే సెమీస్ సంగ్రామంలో పైచేయి ఎవరిదో చూడాలి. భారత్‌కు ఎదురొడ్డి ఫైనల్ చేరుతుందా లేక సెమీస్‌తోనే తమ ప్రస్థానాన్ని ముగిస్తుందా.. అన్నది ఆసక్తికరం.



కోహ్లీ

## 'మూడు' ముచ్చట తీరేనా!

టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన భారత్ అందుకు తగ్గట్లు తిరుగులేని విజయాలను సొంతం చేసుకుంది. సఫారీలతో మొదలైన ప్రపంచకప్ వేట..లంకేయులను చిత్తుచేసే వరకు కొనసాగింది. మధ్యలో ఆతిథ్య ఇంగ్లండ్ చేతిలో ఓడినా..దెబ్బతిన్న బెబ్బులిలా బంగ్లాదేశ్, లంకను ఓడిస్తూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ లీగ్ దశలో టీమ్‌ఇండియా ప్రస్థానం అద్భుతంగా సాగింది. ఓపెనర్ రోహిత్‌శర్మ ఐదు శతకాల హోరుకు కెప్టెన్ కోహ్లీ అర్ధసెంచరీల జోరు.. బుమ్రా, షమీ వికెట్ల వేట అన్ని కలిసొచ్చిన వేళ భారత్ కప్‌నకు మరో రెండు అడుగుల దూరంలో ఉంది. గాయాలతో ధవన్, శంకర్ వెనుదిరిగినా..మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఆటగాళ్లు చూపించిన తెగువ, ఆత్మవిశ్వాసం వెలకట్టలేనిది. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి నిలుస్తూ వచ్చిన ప్రతీ అవకాశాన్ని ప్లేయర్లు చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. ధవన్ గైర్హాజరీలో ఓపెనింగ్‌లో ఎలా రాణిస్తాడో అనుకున్న కేఎల్ రాహుల్.. లంకపై శతకంతో కదం తొక్కి తన పాత్రకు సరైన న్యాయం చేశాడు. ఇక తాను మనసు పెట్టి ఆడితే ప్రత్యర్థి ఎంతటి వాడైనా సరే బలాదూరే అన్న రీతిలో హిట్‌మ్యాన్ రోహిత్ సాగిస్తున్న శతక విధ్వంసం మాటల కందనిది. దిగ్గజాలను మరిపిస్తూ ఈ ముంబైకర్ కొడుతున్న కొట్టుడు ప్రపంచకప్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నది. జట్టుతో సంబంధం లేకుండా ఎదురైన బౌలర్‌నల్లా వీరబాదుడు బాదుతూ పరుగుల వరద పారిస్తున్నాడు. ఇదే రీతిలో రోహిత్ చెలరేగితే భారత్ మూడో కప్ కల సాకారమైనట్లే.

**4** జట్లు **3** మ్యాచ్‌లు **1** విజేత

**క్రికెట్ మక్కా లార్డ్స్‌లో ఈయేటి చాంపియన్ ఎవరో మరో వారం రోజుల్లో తేలనుంది**



ఫించ్

## ఆరో టైటిల్‌పై ఆసీస్ కన్ను

ప్రపంచకప్‌ను ఒక్కసారి గెలువడమే మహా భాగ్యమనుకుంటే ఇప్పటి వరకు ఐదు సార్లు దక్కించుకున్న ఆస్ట్రేలియా ఆరోసారి కన్నేసింది. బాల్ ట్యాంపరింగ్‌తో తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొని గోడకు కొట్టిన బంతిలా అంతే వేగంగా పుంజుకుంది. మెగాటోర్నీకి ముందు భారత్, పాకిస్థాన్‌పై వరుస విజయాలతో ఊపులోకొచ్చిన కంగారూలకు వార్నర్, స్టీవ్‌స్మిత్ రూపంలో కీలక ఆటగాళ్లు జట్టులోకి తిరిగిరావడం కలిసొచ్చింది. ముఖ్యంగా ట్యాంపరింగ్‌తో వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా సమస్యల ఎదుర్కొని బయటపడ్డ వార్నర్ తన ఉగ్రరూపాన్ని చూపెడుతున్నాడు. ఐపీఎల్ ద్వారానే ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపిన ఈ హార్డ్ హిట్టర్ ప్రపంచకప్‌లో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. బంతిని బలంగా బాదే క్రికెటర్లలో ముందుండే వార్నర్ చెలరేగిన రోజు ప్రత్యర్థి జట్లకు పీడకల తప్పదు. షాన్ మార్ష్, ఉస్మాన్ ఖవాజ గాయాలతో బాధపడుతున్నా..కీలకమైన సెమీస్, ఫైనల్లో ఒత్తిడి ఎదుర్కొని రాణించడంలో కంగూరూలది అందేవేసిన చేయి.

# పెద్దన్న నీవే..



## ధోనీకి శుభాకాంక్షల వెల్లువ

**మహీ భాయ్.. హ్యాపీ బర్త్‌డే. ఇన్నేండ్లుగా మీ స్నేహాన్ని పొందడం నాకు చాలా ఆనందంగా ఉంది. మా అందరికీ నీవే పెద్దన్న. నేను ఇంతకు ముందే చెప్పినట్టు.. నువ్వు ఎప్పటికీ నాకు కెప్టెన్‌వే..**

**- విరాట్ కోహ్లీ**

**లీడ్స్:** టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర ధోనీ పుట్టిన రోజు సందర్భంగా అతడికి ప్రస్తుత ఆటగాళ్లు, మాజీలతో సహ ప్రముఖులు ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తమకు స్ఫూర్తిగా నిలుస్తూ ముందుండి నడిపిస్తున్నారని ఆటగాళ్లు చెబితే.. భవిష్యత్తులో ధోనీకి అంతా మంచే జరగాలంటూ మాజీలు ఆకాంక్షించారు. కూతురు జివాతో కలిసి ధోనీ కేక్ కట్ చేస్తున్న బర్త్‌డే వేడుక వీడియోను అతడి భార్య సాక్షి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మాజీ క్రికెటర్లు సచిన్, సెహ్వాగ్, హర్భజన్ సింగ్, వీవీఎస్ లక్ష్మణ్, ఆకాశ్ చోప్రా, మహమ్మద్ కైఫ్, రసెల్ ఆర్నాల్డ్ సహా టీమ్‌ఇండియా ఆటగాళ్లు ధోనీకి శుభాకాంక్షలు చెప్పారు. ప్రపంచంలో 7సంఖ్యతో అనుసంధానమైన వాటితో పోలుస్తూ మిస్టర్ కూల్‌కు వీరూ చెప్పిన బర్త్‌డే విషెస్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, పంత్, జాదవ్, జడేజా,అశ్విన్, ఓజా, ఆర్పీ సింగ్ సహా ఆటగాళ్లందరూ ధోనీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# భారత్‌కు 12స్వర్ణాలు

**అల్మాటీ(కజకిస్థాన్):** క్వాసనోవ్ స్మారక మీట్‌లో భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేసి 12 స్వర్ణాలు సహ మొత్తం 19 పతకాలను కైవసం చేసుకున్నారు. ఆదివారమిక్కడ జరిగిన చివరి రోజు పోటీల్లో.. లాంగ్ జంప్‌లో శ్రీ శంకర్ 7.88మీటర్ల ప్రదర్శనతో స్వర్ణం చేజిక్కించుకున్నాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో మహమ్మద్ సలాలుద్దీన్ 16.64 మీటర్లు దూకి బంగారు పతకాన్ని ఒడిసిపట్టగా.. ఇదే విభాగంలో మహమ్మద్ జుబేర్ రజతాన్ని చేజిక్కించుకున్నాడు. జావెలిన్‌త్రోలో సాహిల్ సిల్వాల్ (77.40మీ.) మరో స్వర్ణాన్ని భారత్ ఖాతాలో వేయగా.. ఇదే విభాగంలో రోహిత్ యాదవ్ రజతాన్ని చేజిక్కించుకున్నాడు. అలాగే హర్షకుమార్(400మీ.), మహమ్మద్ అఫ్జల్(800మీ), అజయ్ కుమార్(1500మీ.), గగన్‌దీప్ సింగ్(డిస్కస్‌త్రో), అర్చన(100మీ.), లిలి దాస్(1500మీ.), నవ్‌జీత్ కౌర్ ధిల్లాన్(డిస్కస్‌త్రో), నవ్‌జీత్ కౌర్(షాట్ పుట్) స్వర్ణ పతకాలను సాధించారు.



# సంజయ్‌కి రజతం, అశ్వినికి కాంస్యం

## ఘనంగా ముగిసిన మల్టీక్లాస్ సెయిలింగ్ చాంపియన్‌షిప్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** సీనియర్ మల్టీక్లాస్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ఆశం సంజయ్‌రెడ్డి, అశ్విని పతకాలతో మెరిసారు. ఆదివారం ముగిసిన సెయిలింగ్ టోర్నీలో అండర్-16 బాలుర లేజర్ 4.7 ఈవెంటులో బరిలోకి దిగిన సంజయ్ 39 పాయింట్లతో రజత పతకంతో సత్తాచాటాడు. ఇదే విభాగంలో శిఖాన్షు సింగ్(36), అశీష్ విశ్వకర్మ(56) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఇక బాలికల అండర్-16 లేజర్ 4.7 విభాగంలో అశ్విని(132) కాంస్య పతకం సాధించింది. ఇదే కేటగిరీలో రితిక (29), సంచితా పంత్(99) స్వర్ణ, రజత పతకాలు అందుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ స్టార్ షూటర్ గగన్ నారంగ్ హాజరయ్యాడు. ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్, లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సాట్స్ ఆధ్వర్యంలో జరిగిన టోర్నీలో విజేతలకు నారంగ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా, యువజన కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఈఎంఈఎస్‌ఏ లెఫ్టినెంట్ జనరల్ పరమ్‌జీత్‌సింగ్, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ ప్రతినిధి శేషునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కెనడా ఫైనల్లో కశ్యప్

**కాల్గరీ:** కెనడా ఓపెన్‌లో ఫైనల్లోకి కశ్యప్.. దూసుకెళ్లాడు. ఆదివారమిక్కడ జరిగిన సెమీఫైనల్‌లో కశ్యప్ 14-21, 21-17, 21-18 తేడాతో నాలుగో సీడ్ వాంగ్ జూ వీ(చైనీస్ తైపీ)ని మట్టికరిపించాడు. మూడు గేమ్‌ల పాటు అత్యంత ఉత్కంఠ రేకెత్తించిన ఈ మ్యాచ్ మొత్తం గంటా 10 నిమిషాలపాటు జరిగింది. మ్యాచ్ ఆరంభంలో తడబడిన కశ్యప్(ఆరోసీడ్).. పదే పదే తప్పిదాలు చేశాడు. తొలి గేమ్‌ను ప్రత్యర్థి వాంగ్ జూ వీకి 14-21తో సమర్పించుకున్నాడు. ఆ తర్వాత పుంజుకున్న కశ్యప్.. రెండో గేమ్‌ను సానుకూలంగా ప్రారంభించి... ఆధిపత్యాన్ని నిలుపుకొని 21-17 తేడాతో కైవసం చేసుకున్నాడు. ఇక హోరాహోరీగా సాగిన మూడో గేమ్‌ను 21-18పాయింట్ల తేడాతో గెలుచుకొని ఫైనల్‌కు అర్హత సాధించాడు.

# రోహిత్ @ 2

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో కోహ్లీకి రోహిత్ దగ్గరగా వచ్చాడు. ఆదివారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో 891 పాయింట్లతో కోహ్లీ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. వరుస సెంచరీలతో అదరగొడుతున్న రోహిత్ (885) రెండో స్థానానికి ఎగబాకాడు. పాక్ బ్యాట్స్‌మన్ బాబర్ మూడో ర్యాంకుకు పడిపోయాడు. బౌలర్లలో టీమ్‌ఇండియా ఆటగాడు బుమ్రా అగ్రస్థానంలో ఉండగా.. బౌల్ట్ రెండో ర్యాంకులో కొనసాగుతున్నాడు.

# కేక పుట్టిస్తున్నది

## వింబుల్డన్‌లో అదరగొడుతున్న 15 ఏండ్ల గాఫ్

**15 ఏండ్ల వయసులో ఆమె ఆటను.. ఆత్మవిశ్వాసాన్ని.. పోరాటపటిమను చూసి యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతున్నది. భవిష్యత్ టెన్నిస్ దిగ్గజం అంటూ కీర్తిస్తున్నది. ప్రత్యర్థి ఎవరైనా వెరువకుండా... చేస్తున్న పోరాటాలకు, సాధిస్తున్న విజయాలకు ఫిదా అవుతున్నది. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన వయసులో ప్రపంచ యవనికపై సీనియర్లను మట్టికరిపిస్తుంటే సలామ్ చేస్తున్నది. ఇలా టెన్నిస్ ప్రపంచంతో జేజేలు కొట్టించుకుంటున్న ఆ అమెరికా అమ్మాయే కోరీ గాఫ్. వింబుల్డన్ టైటిలే లక్ష్యమంటూ ముందుకు సాగుతున్న ఆ యువ సంచలనం గురించిన విశేషాలు మీ కోసం..**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

వింబుల్డన్‌లో 15 ఏండ్ల అమెరికా అమ్మాయి కోరీ గాఫ్ అదరగొడుతున్నది. తొలి అడుగుతోనే చరిత్ర సృష్టించి.. ప్రతి విజయంతో రికార్డులు నెలకొల్పుతున్నది. జూనియర్ విభాగంలో ఎన్నో విజయాలు సాధించిన గాఫ్(313వ ర్యాంకు)... వింబుల్డన్ మహిళల సింగిల్స్ మెయిన్ డ్రాకు అర్హత సాధించిన పిన్న వయస్కురాలి(15ఏండ్ల 122రోజులు)గా రికార్డు సృష్టించింది. ఐదు సార్లు వింబుల్డన్ చాంపియన్ వీనస్ విలియమ్స్‌ను తొలి రౌండ్‌లోనే 6-4, 6-4 తేడాతో వరుస సెట్లలో సునాయాసంగా ఓడించి... రెండు, మూడు రౌండ్లలో సీనియర్ ప్లేయర్లను చిత్తుచేసి ప్రిక్వార్టర్‌కు దూసుకెళ్లి.. టైటిల్‌పై కన్నేసింది.

### ఫైనల్‌కు ముందు పుస్తకాలతో కుస్తీ

వింబుల్డన్ క్వాలిఫయర్స్ ఫైనల్ రౌండ్‌కు ముందు రోజు గాఫ్... సైన్స్ పరీక్ష కోసం రాత్రి 11గంటల వరకు చదువుతూనే ఉంది. కనీస సాధన చేయకపోయినా... బెల్జియం క్రీడాకారిణి మినెన్‌పై 6-1, 6-1 తేడాతో విజయం సాధించింది. అయితే 313 ర్యాంకులో ఉన్న కారణంగా వింబుల్డన్‌కు నేరుగా అర్హత సాధించలేకపోయినా... ఆ తర్వాత వైల్డ్‌కార్డ్ ద్వారా మెయిన్ డ్రాలో అడుగుపెట్టి రికార్డు సృష్టించింది.



గాఫ్

**వింబుల్డన్ సాధించడమే నా లక్ష్యం. ఈ ఆటలో నేను గ్రేటెస్ట్ అవ్వాలనేది నా కల. ఎవరినైనా ఓడించగలననే ఆత్మవిశ్వాసం నాకుంది.**

### సెరెనానే స్ఫూర్తి

నేను టెన్నిస్ ఆడేందుకు ప్రధాన కారణం సెరెనా. ఆమె వింబుల్డన్ ఆడి టైటిల్ గెలవడం చిన్నప్పుడు చూసి స్ఫూర్తి పొందానని గాఫ్ చెప్పింది.



## నేడు ఆర్బీఐ బోర్డు సమావేశం

### హాజరుకానున్న మంత్రి నిర్మలా

**న్యూఢిల్లీ, జూలై 7:** బడ్జెట్ అనంతరం సోమవారం జరుగనున్న రిజర్వు బ్యాంక్ బోర్డు సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హాజరుకాబోతున్నారు. బడ్జెట్‌లో తీసుకున్న పలు కీలక నిర్ణయాలతోపాటు ఇతర విషయాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి కట్టడి చేయాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉన్నది. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో నిర్దేశించుకున్న లక్ష్యం కంటే రూ.6 వేల కోట్ల అదనపు ఆదాయాన్ని ఆర్జించాలని చూస్తున్నది. విమానయానం, బీమా, మీడియా రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితి పెంచడంతోపాటు నిధులు లేకసతమతమవుతున్న బ్యాంకింగేతర సంస్థలు(ఎన్‌బీఎఫ్‌సీ)లకు మరింత బూస్ట్ నివ్వడానికి పలు కీలక నిర్ణయాలను కేంద్రం తీసుకున్నది. ఈ ఏడాది రిజర్వు బ్యాంక్ నుంచి డివిడెండ్ రూపంలో రూ.90 వేల కోట్లు ఆశిస్తున్నట్లు నిర్మలా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ బోర్డు సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై కూడా చర్చించే అవకాశాలున్నాయి. అంతక్రితం ఏడాది ఇచ్చిన రూ.68 వేల కోట్లతో పోలిస్తే 32 శాతం అధికం.

# స్థూల ఆర్థికాంశాలు కీలకం

### ఐఐపీ, ద్రవ్యోల్బణలపై మదుపరుల దృష్టి
### కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు కూడా...

**న్యూఢిల్లీ, జూలై 7:** గతవారంలో సార్వత్రిక బడ్జెట్‌తో తీవ్ర ఆటుపోటులకు గురైన దేశీయ ఈక్విటీ మార్కెట్లు ఈ వారంలోనూ మరింత పతనమయ్యే అవకాశాలున్నాయని మార్కెట్ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ఈ వారంలో విడుదల కానున్న పారిశ్రామిక ప్రగతి, ద్రవ్యోల్బణ గణాంకాలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. స్థూల ఆర్థికాంశాలకు తోడు అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలపై మదుపరులు వేచి చూసే ధోరణి అవలంభించే అవకాశాలున్నాయని మార్కెట్ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. గతవారంలో వరుసగా నాలుగు రోజులపాటు పెరిగిన సూచీలు.. బడ్జెట్ ప్రవేశపెట్టిన శుక్రవారం రోజు తీవ్ర ఊగిసలాట నెలకొన్నది. స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల్లో ప్రజల వాటాను 25 శాతం నుంచి 35 శాతానికి పెంచుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో నెలకొన్న ఆందోళనను మరింత పెంచింది. దీంతో టీసీఎస్, విప్రో, డీ-మార్ట్‌లతోపాటు ఐపీవోకి వచ్చిన 1,174 సంస్థల్లో రూ.3.87 లక్షల కోట్ల విలువైన వాటాను ప్రమోటర్లు విక్రయించాల్సి ఉంటుందని అంచనా. గత రెండు నెలలుగా వేచి చూసిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉన్నదని, దీంతో ఈ వారంలో కూడా మార్కెట్లు దిగువముఖం పట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సామ్‌కో సెక్యూరిటీ ఫౌండర్, సీఈవో జిమీత్ మోదీ తెలిపారు. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 11,800 పాయింట్ల వద్ద ముగిసిన సూచీ మరింత తగ్గే ఆస్కారం ఉందన్నారు. కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలతోపాటు రూపాయి కదలికలు, క్రూడాయిల్, విదేశీ పెట్టుబడులు కూడా మార్కెట్లకు కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలు స్టాక్ మార్కెట్లకు ఏమాత్రం అనుకూలంగా లేవని, అతిపెద్ద కంపెనీల సూచీలు ఒడిదుడుకులు తప్పవని ఆయన హెచ్చరించారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు మాత్రం కేవైసీ నిబంధనల్లో కొన్నింటిని ఎత్తివేయడం కొంత ఊరటనిచ్చే అంశమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ శుక్రవారం ఐఐపీ, ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కాబోతున్నాయి. గతవారంలో సెన్సెక్స్ 118.75 పాయింట్లు లాభపడింది.

**రూపాయి కదలికలు..**

గతవారంలో ఓ మోస్తారుగా లాభపడ్డ దేశీయ కరెన్సీ విలువ ఈ వారంలో మరింత పెరిగే అవకాశాలున్నాయిన విశ్లేషకులు అంచనావేస్తున్నారు. గతవారం మొత్తానికి 60 పైసలు పెరిగి రూ.68.42 వద్ద ముగిసింది. గడిచిన మూడు వారాలుగా పెరిగిన కరెన్సీ విలువ ఈ వారంలో 68 నుంచి 68.90 మధ్య కదలాడవచ్చునని ఫారెక్స్ డీలర్ అమిత్ గుప్తా వెల్లడించారు. స్వల్పకాలంపాటు 68 స్థాయిలో ఉండనున్నదన్నారు.



**క్రూడాయిల్..**

అంతర్జాతీయ దేశాల వృద్ధిపై ఆందోళన వ్యక్తం కావడంతో గతవారంలో ప్రతికూల వృద్ధి నమోదైన ఇంధన ధరలు ఈ వారంలో కూడా మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్యంపై అనిశ్చితి నెలకొనడంతో ఒపెక్ దేశాలు ఉత్పత్తి తగ్గించేదానిని మరి కొంత కాలం పొడిగించే అవకాశాలు ఉండటం ధరలు తగ్గడానికి ప్రధాన కారణం. రోజుకు 10 లక్షల బ్యారెల్ల ఉత్పత్తిని తగ్గించనున్నట్లు గతంలో ఒపెక్ దేశాలు ప్రకటించాయి. దీనిని వచ్చే మార్చి 2020 వరకు పొడగించాలనుకుంటున్నాయి. మరోవైపు అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు మాత్రం ఇంధన ధరలు భగ్గుమనడానికి పరోక్షంగా దోహదం చేయనున్నాయి.

**బ్లూచిప్ సంస్థలకు లాభాల పంట**

గడిచిన వారంలో టాప్-10 బ్లూచిప్ కంపెనీలు ఏడు తమ మార్కెట్ విలువను రూ.53,732.55 కోట్ల స్థాయిలో పెంచుకున్నాయి. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ అత్యధికంగా లాభపడగా, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్ లు నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ అత్యధికంగా రూ.14,941.11 కోట్లు పెరిగి రూ.3,93, 135.82 కోట్లకు చేరుకున్నది. ఎస్‌బీఐ విలువ కూడా రూ.8,656.87 కోట్లు ఎగబాకగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.7,925.16 కోట్లు, కోటక్ మహీంద్రా బ్యాంక్ రూ.7,860.21 కోట్లు, ఐటీసీ రూ.6,742.25 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.6,718.38 కోట్లు, హెచ్‌యూఎల్ రూ.887.57 కోట్లు అధికమయ్యాయి. టీసీఎస్ మార్కెట్ విలువ రూ.24,615. 64 కోట్లు కోల్పోగా, ఇన్ఫోసిస్ రూ.5,985.44 కోట్లు తగ్గగా, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.610.96 కోట్లు కోల్పోయింది.

**9న టీసీఎస్, 12న ఇన్ఫోసిస్..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను కార్పొరేట్లు తమ ఆర్థిక ఫలితాలను ఈవారంలో విడుదల చేయబోతున్నాయి. ఐటీ దిగ్గజాలైన టీసీఎస్(ఈనెల 9న), ఇన్ఫోసిస్, ఇండస్ ఇండ్ బ్యాంక్(ఈ నెల 12న)లు తమ క్యూ1 ఫలితాలను ప్రకటించబోతున్నాయి. వీటితోపాటు కర్ణాటక బ్యాంక్, అవెన్యూ సూపర్‌మార్ట్స్, సీసీఎల్ ప్రొడక్ట్స్, జీటీపీఎల్, డెల్టా కార్ప్, గోవా కార్బన్‌లతోపాటు మరిన్ని సంస్థలు తమ పనితీరును విడుదల చేస్తున్నాయి. నిఫ్టీ, సెన్సెక్స్ కంపెనీలు రెండంకెల వృద్ధిని సాధించే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. అమ్మకాలు పడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ సంస్థలకు ఈసారి నిరాశ తప్పదని బ్రోకరేజ్ సంస్థలు పేర్కొంటున్నాయి.

## రూ.475 కోట్ల ఎఫ్‌పీఐల వెనక్కి

**న్యూఢిల్లీ, జూలై 7:** వరుసగా ఐదు నెలలపాటు దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ పెట్టుబడిదారులు ఈసారి వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుత నెల తొలివారంలో రూ.475 కోట్ల విలువైన పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులు ముదురుతుండటం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్రం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్ నేపథ్యంలో ఎఫ్‌పీఐలు ముందస్తు జాగ్రత్త వహించారు. అంతక్రితం వరుసగా ఐదు నెలలపాటు ఎఫ్‌పీఐలు భారీగా పెట్టుబడులు పెట్టారు. జూన్‌లో రూ.10,384.54 కోట్లను దేశీయ ఈక్విటీ మార్కెట్ల(డెబిట్, క్రెడిట్ మార్కెట్లు)లో ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు..మే నెలలో రూ.9,031,15 కోట్లు, ఏప్రిల్‌లో రూ.16, 093 కోట్లు, మార్చి నెలలో రూ.45,981 కోట్లు, ఫిబ్రవరిలో రూ.11,182 కోట్లను చొప్పించారు. తాజాగా డిపాజిటరీ నివేదిక ప్రకారం..జూలై 1 నుంచి 5 మధ్యకాలంలో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.3,701.21 కోట్ల పెట్టుబడును ఉపసంహరించుకోగా, ఇదే సమయంలో డెబిట్ మార్కెట్లలో రూ.3,234.





65 కోట్లు పెట్టుబడి పెట్టారు. నికరంగా రూ.475.56 కోట్లు తరలించుకుపోయినట్లు అయింది. అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులకు తోడు అమెరికా-ఇరాన్ దేశాల మధ్య పరిస్థితులు కూడా తోడవడంతో గ్లోబల్ మార్కెట్లో మరోమారు వాణిజ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నట్లు సంకేతాలు రావడంతో విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా దేశీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి మొగ్గుచూపారని గ్రోవ్ సీవోవో జైన్ తెలిపారు. బడ్జెట్ కూడా ఆందోళన తీవ్రతను మరింత పెంచింది.

## విదేశీ బాండ్ల ద్వారా నిధుల సేకరణ

### ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్



**న్యూఢిల్లీ, జూలై 7:** విదేశీ మార్కెట్ల నుంచి భారీ స్థాయిలో నిధులను సేకరించడానికి సిద్ధమైంది కేంద్ర ప్రభుత్వం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగం నాటికి విదేశాల్లో సావరిన్ బాండ్లను జారీ చేయడం ద్వారా భారీ స్థాయిలో నిధులను సమీకరించాలనుకుంటున్నట్లు కేంద్ర ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు. 2019-20 ఏడాదికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ఇదే విషయాన్ని స్పష్టంచేసింది. పాలసీ నిర్ణయాలు చాలా స్పష్టంగా ఉన్నాయి..విదేశీ మార్కెట్లలో విదేశీ కరెన్సీ రూపంలో జారీచేయనున్న బాండ్ల ద్వారా అధిక మొత్తంలో నిధులను సేకరించాలనుకుంటున్నట్లు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో గార్గ్ వెల్లడించారు. ఎంతమొత్తంలో నిధుల సేకరించేదానిపై ఇంకా స్పష్టత రాలేదని, ఇందుకు సంబంధించి ప్రక్రియ త్వరలో ప్రారంభంకాబోతున్నదన్నారు. విదేశాల్లో నిధుల సేకరణకు సంబంధించి త్వరలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సలహాదారుడిని నియమించబోతున్నదని ఆయన చెప్పారు. దేశీయ అవసరాలని మిత్తం విదేశాల్లో గరిష్ఠ స్థాయిలో నిధులను సేకరించాలని నిర్ణయించినట్లు, దీంట్లోభాగంగా ఫారిన్ కరెన్సీ రూపంలో బాండ్లను జారీ చేయడం ద్వారా సులభంగా నిధుల సేకరించవచ్చునని ఆయన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ల నుంచి రూ.4.48 లక్షల కోట్ల నిధులను సేకరించాలని కేంద్రం భావిస్తున్నది. అంతక్రితం ఏడాది సేకరించిన రూ.4.22 లక్షల కంటే ఇది అధికం.



### విస్తరణ బాటపట్టిన మహీంద్రా పంపులు

**హైదరాబాద్, జూలై 7:** మోటార్స్, పంపుల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన మహేంద్రా పంప్స్ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే తెలంగాణలో 125కి పైగా డీలర్లు ఉండగా, ఈ ఏడాది చివరినాటికి ఈ సంఖ్యను 600కి పెంచుకోవాలని చూస్తున్నది. వచ్చే ఏడాది సంస్థ 60 సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.600 కోట్లుగా నమోదవగా, ఈ ఏడాది మరో పది శాతం పెరిగే అవకాశం ఉన్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 11 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయగా, వీటిలో హైదరాబాద్‌లో ఒకటని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కోయంబత్తూరులో ఉన్న ఐదు ప్లాంట్లలో రోజుకు 5 వేల యూనిట్లు తయారవుతున్నాయి.

## మారుతి ఐదోసారి..

### ఉత్పత్తిని తగ్గించుకున్న ఆటోమొబైల్ దిగ్గజం

**న్యూఢిల్లీ, జూలై 7:** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీకి అమ్మకాల సెగ గట్టిగానే తగిలింది. అమ్మకాలు భారీగా పడిపోవడంతో గడిచిన నెలలోనూ సంస్థ ఉత్పత్తిని తగ్గించుకున్నది. వరుసగా ఉత్పత్తిని తగ్గించుకోవడం ఇది ఐదోసారి. జూన్ నెలలో సంస్థ 1,11,917 యూనిట్ల వాహనాలను ఉత్పత్తిచేసినట్లు బీఎస్ఈకి అందించిన సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తి చేసిన 1,32,616 యూనిట్లతో పోలిస్తే 15.6 శాతం తగ్గాయి. వీటిలో ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తి ఏడాది ప్రాతిపదికన 16.34 శాతం తగ్గి 1,09,641కు పరిమితమయ్యాయి. మినీ సెగ్మెంట్‌కు చెందిన వాహనాల్లో ఉత్పత్తిని భారీగా తగ్గించుకున్నది. పూర్తి వివరాలు..

- కేవలం 15,087 యూనిట్ల ఆల్టో కార్లను ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో చేసిన 29,131 యూనిట్లతో పోలిస్తే 48.2 శాతం తగ్గించింది.
- కాంప్యాక్ట్ సెగ్మెంట్‌కు చెందిన వ్యాగన్ ఆర్, సిఫ్ట్, డిజైర్ల ఉత్పత్తిని 1.46 శాతం కోత విధించడంతో 66,436లకు పడిపోయాయి. 2018 ఇదే నెలలో 67,426లను ప్రొడ్యూస్ చేసింది.
- యుటిలిటీ వాహనాల ఉత్పత్తిని కూడా 5.26 శాతం తగ్గించి 17,074లకు పరిమితం చేసింది. అంతక్రితం ఇది 18,023 యూనిట్లు.
- వ్యాన్ల ఉత్పత్తిని 27.87 శాతం కోత విధించింది. దీంతో కేవలం 8,501 యూనిట్లను మాత్రమే ఉత్పత్తి చేసింది.
- ఏప్రిల్ నెలలో 10 శాతం ఉత్పత్తిని తగ్గించుకున్న సంస్థ..ఆ మరుసటి నెలలోనూ 18 శాతం కోత విధించింది.
- మార్చి నెలలో 20.9 శాతం కోత విధించిన సంస్థ.. ఫిబ్రవరిలోనూ 8 శాతం తగ్గించింది.



ఆర్థిక రంగం అంతంత మాత్రంగానే ఉండటం, మరోవైపు వడ్డీరేట్లు గరిష్ఠ స్థాయిలో కొనసాగుతుండటంతో ఈ ఏడాది తొలి నెల నుంచి ఆటోమొబైల్ సంస్థలు అమ్మకాల విషయంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. మారుతి సుజుకీతోపాటు మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్‌లు కూడా డిమాండ్ లేమితో ఉత్పత్తిని తగ్గించుకుంటున్నట్లు ఇదివరకే ప్రకటించాయి. మే నెలలో మొత్తం ప్యాసింజర్ వాహన విక్రయాలు 18 ఏండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. సెప్టెంబర్ 2001 తర్వాత వాహన విక్రయాలో ఇంతటి స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. మిగతా నెలలో నమోదైన అమ్మకాలు ఇంతకంటే తక్కువ స్థాయిలో ఉన్నాయి. గడిచిన నెలకుగాను పూర్తి స్థాయి వాహన విక్రయాలను దేశీయ వాహన దారుల ఉత్పత్తి సంఘం(సియామ్), ఫాడాలు ఇంకా విడుదల చేయలేదు.

## ఐదు నెలల్లో ఎయిర్ ఇండియాను అమ్మేస్తాం

### కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి చక్రవర్తి

**న్యూఢిల్లీ, జూలై 7:** కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వదులుకోవాలని చూస్తున్నది. రోజురోజుకు పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు మరోవైపు ప్రైవేట్ విమాన సంస్థల నుంచి పోటీ తీవ్రతరమవుతుండటంతో కంపెనీలో మొత్తం వాటాను విక్రయించాలనుకుంటున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వచ్చే నాలుగు నుంచి ఐదు నెలల్లో ఎయిర్ ఇండియా విక్రయాన్ని పూర్తి చేయాలనుకుంటున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్(దీపం) కార్యదర్శి అటను చక్రవర్తి తెలిపారు. గతేడాది రెండుసార్లు వాటాను విక్రయించాలనుకున్నప్పటికీ ఒక్క సంస్థ కూడా ముందుకురాకపోవడంతో కేంద్రం వెనక్కి తగ్గింది. దీంతో మళ్లీ వాటాలను విక్రయించడానికి సిద్ధమైంది కేంద్రం. ప్రస్తుతం సంస్థలో కేంద్రానికి వున్న వాటాను పూర్తిగా విక్రయించాలని నీతి అయోగ్ సూచించిన విషయం తెలిసిందే. ఈ విక్రయ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించాల్సి ఉంటుంది.

## మరో ఏడు అంతర్జాతీయ రూట్లకు గోఎయిర్ విమానాలు

**ముంబై, జూలై 7:** చౌక విమానయాన సంస్థ గోఎయిర్..మరో ఏడు అంతర్జాతీయ రూట్లకు విమాన సర్వీసులు అందించనున్నట్లు ఆదివారం ప్రకటించింది. వీటిలో మూడు కొత్త దేశాలైన బ్యాంకాక్, దుబాయి, కువైట్‌లతోపాటు మరో నాలుగు ఇతర రూట్లకు సర్వీసులను 19న ప్రారంభించబోతున్నది. ఇందుకు నియంత్రణ మండలి డీజీసీఏ కూడా అనుమతించిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ముంబై, న్యూఢిల్లీ, కన్నూరుల నుంచి అబుదాబి, దుబాయి, మస్కట్, బ్యాంకాక్‌లకు రోజువారి సర్వీసులను నడుపనున్నట్లు తెలిపింది. ఇప్పటికే అబుదాబి, మస్కట్‌లకు కన్నూరుల నుంచి విమాన సర్వీసులు అందిస్తుండగా, నూతనంగా బ్యాంకాక్, దుబాయి, కువైట్‌లకు నడుపబోతున్నది. వ్యాపార విస్తరణలో భాగంగా ఈ నూతన సర్వీసులను ప్రారంభించబోతున్నట్లు గోఎయిర్ ఎండీ, సీఈవో జే వాడియా తెలిపారు. ప్రస్తుతం సంస్థ హైదరాబాద్‌తోపాటు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబై, ఇతర నగరాలకు విమాన సేవలు అందిస్తున్నది.

## ఆదీ గోద్రేజ్ వేతనం రూ.6 కోట్లు

### సగటు ఉద్యోగి కంటే 114 రెట్లు అధికం



**న్యూఢిల్లీ, జూలై 7:** దేశంలో అతిపెద్ద ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థల్లో ఒకటైన గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(జీసీపీఎల్) చైర్మన్ ఆదీ గోద్రేజ్ గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.6.07 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకున్నారు. అంతక్రితం ఏడాది అందుకున్న జీతంతో పోలిస్తే 20 శాతం తక్కువ. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో వివేక్ గంబీర్ కూడా రూ.13.1 కోట్ల జీతాన్ని పొందారు. కంపెనీలో సగటు ఉద్యోగికి లభించిన వేతనంతో పోలిస్తే ఆదీ గోద్రేజ్ 114 రెట్లు అధికంగా ఉండగా, అలాగే గంబీర్ అందుకున్న దాంతో పోలిస్తే 311.26 రెట్లు అధికమని కంపెనీ వార్షిక నివేదికలో వెల్లడించింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను సగటు ఉద్యోగి నికరంగా రూ.4.21 లక్షల వేతనాన్ని అందుకున్నట్లు తెలిపింది. వీరి వేతనం కూడా 6.23 శాతం తగ్గింది. మార్చి 31, 2019 నాటికి కంపెనీలో శాశ్వత ఉద్యోగుల 2,781 మంది ఉన్నారు. జీసీపీఎల్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ నిసాబా గోద్రేజ్ మొత్తం రెమ్యునరేషన్ కింద రూ.5.2 కోట్లు అందుకున్నారు. 2017-18లో పొందిన వేతనంతో పోలిస్తే 19 శాతం తగ్గింది. కంపెనీ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జంషెడ్ గోద్రేజ్ గతేడాదికిగాను రూ.23 లక్షల వేతనాన్ని పొందగా..నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్, తాన్యా దుబాష్, పిరోజ్‌షా గోద్రేజ్‌లు చెరో రూ.24 లక్షలు అందుకున్నారు. కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న అమన్ మెహతా, భారత్ దోషి, పిప్పా అర్మేర్డింగ్‌లకు గతేడాది రూ.40 లక్షలు లభించాయి.

## అమెరికాలో విలువ ఆధారిత ఉత్పత్తులు: రెడ్డీస్

**హైదరాబాద్, జూలై 7:** అమెరికా మార్కెట్లో ధరల ఒత్తిడి కొనసాగుతుండటంతో రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ కీలక నిర్ణయం తీసుకున్నది. వీటిని అధిగమించడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్కడి మార్కెట్లో విలువ ఆధారిత ఉత్పత్తులను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. నూతన మార్కెట్లోకి ప్రవేశించడం కొనసాగుతున్నదని, చైనా, రష్యా, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రెడ్డీస్ చైర్మన్ కే సతీష్ రెడ్డి వార్షిక నివేదికలో వెల్లడించారు. అమెరికా మార్కెట్లోకి విడుదల చేయడానికి 110 జనరిక్ ఔషధాల యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతి కోసం వేచి చూస్తున్నాయని, వీటిలో పలు కీలక ఔషధాలు ఉన్నట్లు తెలిపింది.


### సంపన్నులపై భారత్‌లోనే పన్ను తక్కువ

కుబేరులపై కేంద్ర ప్రభుత్వం అధిక పన్నువేయడం దేశవ్యాప్తంగా వస్తున్న విమర్శలపై ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పందించింది. సంపన్న వర్గాలపై ఇతర దేశాల్లో విధిస్తున్న పన్నుకంటే ఇక్కడ చాలా తక్కువగానే ఉన్నదని, ముఖ్యంగా అమెరికా,చైనా, దక్షిణాఫ్రికా దేశాల్లో విధిస్తున్న పన్ను కంటే మనదగ్గరే తక్కువగా ఉన్నదని రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే స్పష్టంచేశారు. సూపర్ రిచ్‌లపై సర్‌చార్జ్ విధింపు ప్రతిపాదనపై ఆయన స్పందిస్తూ..చైనా, అమెరికాలో 45 శాతం పన్ను విధిస్తుండగా, దక్షిణాఫ్రికాల్లో 50.3 శాతం విధిస్తున్నట్లు చెప్పారు. రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల లోపు ఆదాయం కలిగిన వారిపై 15 శాతం సర్‌చార్జ్‌ని 25 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే రూ.5 కోట్ల కంటే అధిక ఆదాయం కలిగిన వారిపై 15 శాతం నుంచి 37 శాతానికి వడ్డించింది. వ్యక్తిగతంగా రూ.2-5 కోట్ల లోపు ఆదాయం కలిగిన వారిపై పన్ను 39 శాతానికి చేరుకోనుండగా, రూ.5 కోట్ల కంటే అధిక ఇన్‌కం కలిగినవారిపై 42.7 శాతానికి ఎగబాకనున్నది. బ్రిటన్‌లో 45 శాతంగా ఉండగా, అదే జపాన్‌లో 45.9 శాతం, కెనడాలో 54 శాతం, ఫ్రాన్స్‌లో 66 శాతం వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం భారత్‌లో రూ.10 లక్షలు సంపాదించిన వారికి ఒకే పన్ను..రూ.10 కోట్ల సంపాదించిన వారికి అంతే పన్ను విధిస్తున్నారు. ఇది ఏ మాత్రం శ్రేయస్కరం కాదని భావించిన కేంద్రం..కుబేరులపై పన్నును పెంచింది. దేశ నిర్మాణంలో పన్నుచెల్లింపుదారులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, ముఖ్యంగా పెరుగుతున్న ఆదాయ స్థాయి కూడా ఇందుకు కారణమన్నారు.

# కేంద్రానికి రూ.30 వేల కోట్లు!

### అదనపు పన్ను ప్రతిపాదనతో సమకూరనున్న నిధులు
### రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే

**న్యూఢిల్లీ, జూలై 7:** సార్వత్రిక బడ్జెట్‌లో అదనపు పన్ను ప్రతిపాదనతో కేంద్రానికి అదనంగా రూ.30 వేల కోట్ల వరకు నిధులు సమకూరనున్నాయని రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే తెలిపారు. సంపన్న వర్గాలపై అధిక పన్నుతోపాటు పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పన్నులను పెంచడం ద్వారా, ముఖ్యంగా ఇంధనాలపై విధించిన సెస్ ద్వారా అధికంగా నిధులు సమకూరనున్నాయని, పసిడి దిగుమతులపై కూడా కస్టమ్స్ డ్యూటీని పెంచడం, రూ.2 కోట్ల కంటే అధిక ఆదాయం కలిగిన వారిపై సర్‌చార్జ్ రూపంలో విధించిన పన్ను ఇందుకు దోహదం చేస్తున్నదన్నారు. ఇదే సమయంలో 25 శాతం కార్పొరేట్ ట్యాక్స్ పరిమితిని రూ.400 కోట్ల టర్నోవర్‌కు పెంచడంతో ఆదాయం కోల్పోవాల్సి వస్తుందన్నారు. గతంలో ఈ పరిమితి రూ.250 కోట్లుగా ఉన్నది. ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం, పెట్రోల్, డీజిల్‌పై రోడ్డు సెస్ విధించడంతో వార్షికంగా రూ.30 వేల కోట్ల ఆదాయం సమకూరనున్నదని అంచనా, కానీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా తొమ్మిది నెలల్లో రూ.22 వేల కోట్లు రావచ్చునని కేంద్రం అంచనావేస్తున్నది. వీటితోపాటు సంపన్నవర్గాలపై సర్ చార్జ్ రూపంలో మరో రూ.12 వేల-13 వేల కోట్లు రావచ్చునని అంచనా. రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల ఆదాయం కలిగిన వారిపై సర్‌చార్జీని 15 శాతం నుంచి 25 శాతానికి, రూ.5 కోట్ల కంటే అధిక ఆదాయం కలిగినవారిపై 15 శాతానికి బదులుగా 37 శాతానికి సవరించింది. పసిడిపై కస్టమ్స్ డ్యూటీని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచడంతో అదనంగా రూ.3,000-4,000 కోట్ల నిధుల సమకూరవచ్చునని అంచనా.




### విదేశీ ట్రిప్పులు, అధిక కరెంట్ బిల్లుదారులు ఐటీ రిటర్నులివ్వాలి..

రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన వారిలో విదేశీ ప్రయాణాలు చేస్తున్న వారు, అధిక కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నవారు కచ్చితంగా ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ఏడాదికి విదేశీ ప్రయాణాల కోసం రూ.2 లక్షలు దాటి ఖర్చు చేసిన వారు, బ్యాంకుల్లో కోటి రూపాయల కంటే అధికంగా డిపాజిట్ చేసిన వారు, లక్ష రూపాయల కంటే అధికంగా కరెంట్ బిల్లు చెల్లిస్తున్నవారు రిటర్నులు తప్పనిసరని తాజాగా స్పష్టంచేసింది. సెక్షన్ 139 ఆదాయ పన్ను చట్టం ప్రకారం అధిక స్థాయిలో లావాదేవీలు జరిపేవారిని ఆదాయ పన్ను పరిధిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. గడిచిన సంవత్సరంలో కోటి రూపాయల కంటే అధికంగా బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన వారికి పన్ను వర్తింపచేయనున్నది. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 54 కింద దాఖలు చేసినవారు దీర్ఘకాలికి క్యాపిటల్ గెయిన్ ద్వారా పన్ను మినహాయింపు ప్రయోజనాలు పొందుతున్నారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అలాగే గృహ, బాండ్ల కొనుగోలులో కూడా క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ ప్రయోజనాలు పొందుతున్నారట. ఈ ప్రతిపాదన ఏప్రిల్ 1, 2020 నుంచి అమలులోకి రానున్నది.


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
CB Shine LIMITED EDITION
ఇప్పుడు షైన్ అయ్యేందుకు ఎటువంటి లిమిట్స్ లేవు
మీకు నచ్చిన సిబి షైన్, ఇప్పుడు లిమిటెడ్ ఎడిషన్‌లో కూడా,
రెండు ఆకర్షణీయమైన డ్యూయల్ టోన్ కలర్స్‌తో పాటు. కేవలం లిమిటెడ్ సమయానికి మాత్రమే.
Honda Celebrating 70 Lakh Happy Customers
స్టైలిష్ వైజర్ గ్రాఫిక్స్
బోల్డ్ డ్యూయల్ టోన్ ట్యాంక్‌తో అద్భుతమైన డికాల్స్
మోడర్న్ సైడ్ కౌల్ బ్రహ్మాండమైన గ్రాఫిక్స్‌తో
ఆకర్షణీయమైన రియర్ కౌల్ మరియు కొత్త కలర్ థీమ్ గ్రాబ్ రెయిల్
హోండా అంటే HONDA
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49 - 50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
Best Deal Honda Buy. Sell. Exchange
Always wear helmet while riding
Also available: Annual Maintenance Contract** Road Side Assistance** Engine Health Assurance**
Follow us on
Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR: Samrat Honda - 0878-2277299; 9441333665; Srikanth Honda - 0878-2224555, 7799946632; JAGATIAL: Samrat Honda - 9701200045, 9704500045; HUZURABAD: Samrat Honda - 8099979050; SIRCILLA: Srikanth Honda - 08723-233336, 7799700245; PEDDAPALLY: Srikanth Honda - 7799700259; SULTANABAD: Aradhna Honda - 9849885862; VEMULAWADA: Srikanth Honda - 9177662757; METPALLY: Saanvi Honda - 9581295818; JAMMIKUNTA: Srikanth Honda - 7799700263; DHARMARAM: Sairam Honda - 9642828885, 08728-270950; HUSANABAD: Laxmi Honda - 9949915222; ADILABAD: Sree Mahalakshmi Honda - 9010977757; RAMAGUNDAM: Sai Ram Krishna Honda - 8100779999; MANCHERIAL: Jagadamba Honda - 08736-259303; BELLAMPALLY: Thirumala Honda - 08735225975; 9059979909; NIRMAL: Sree Mahalakshmi Honda - 9010977757; ASIFABAD: Sainath Honda - 9010431431, 8500612233; KHANAPUR: Sri Ganesh Honda - 9010977757; BHAINSA: Sree Mahalakshmi Honda - 9010977757; KAGAZNAGAR: Sree Mahalakshmi Honda - 9010977757; ICHODA: Sree Mahalakshmi Honda - 9010977757.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com


LOT
150 STORES ACROSS TS & AP
లాట్ స్మార్ట్
ఆషాఢం సేల్
UPTO 60% DISCOUNT On Exchange*
*Conditions Apply
Best Buy realme 3Pro
₹14,499/- 4 | 64 GB
₹15999/- 6 | 64 GB
₹16999/- 6 | 128 GB
ALL MODELS AVAILABLE
NOKIA Connecting People 3.1 3GB | 32GB
60% DISCOUNT On Exchange*
oppo A5 4GB | 64GB
60% DISCOUNT On Exchange*
vivo V15 Pro 32MP POP-UP SELFIE. GO POP.
1 MONTH EMI FREE
Also Available on V15 & Y17
SAMSUNG Galaxy A70
₹2000/- CASH BACK
FLAT 30% CASH BACK Paytm
1 MONTH EMI FREE
ONE TIME SCREEN REPLACEMENT FREE
*On Selected Models
UPTO ₹2000/- CASH BACK
mi ALL MODELS STOCK AVAILABLE
0% DOWN PAYMENT
BRANDED ACCESSORIES AVAILABLE
LOT
Helpline: 1800 123 3567 | www.lotmobiles.com

నమస్తే తెలంగాణ
# జిందగీ
సోమవారం 8 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

సక్సెస్ మంత్ర





**కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా ఎంతటి విజయాన్నయినా సాధించవచ్చన్నది ఆమె అభిప్రాయం. ఆర్థికంగా ఎన్ని సమస్యలు ఇబ్బంది పెట్టినా, ఎన్ని కష్టాలు ఎదురైనా వాటికి బెదరకుండా ధైర్యంతో ముందడుగు వేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె విజయాలే చెబుతున్నాయి. తనకు ఎదురైన కష్టాలను ఎన్నింటినో తెగువతో అధిమించి నేడు చెన్నై నగరంలో పలు రెస్టారెంట్లకు యజమానురాలిగా మారారు. కొన్ని సంవత్సరాల క్రితం కేవలం 50 పైసల రోజువారీ ఆదాయాన్ని ఆర్జించిన ఆమె ఇప్పుడు రోజుకు రూ.2 లక్షలకు పైగా సంపాదిస్తూ ఇతర మహిళా వ్యాపారవేత్తలకు, ఆ మాటకొస్తే జీవితంలో పైకి ఎదగాలనుకునే ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రెస్టారెంట్ వ్యాపారంలో తిరుగులేని విజయం సాధించిన పాట్రిషియా నారాయణ్ సక్సెస్‌మంత్ర.**

## రెస్టారెంట్ వ్యాపారంలో తిరుగులేని విజేత
# పాట్రిషియా నారాయణ్

పాట్రిషియా నారాయణ్ జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని విజయవంతమైన వ్యాపారవేత్తగా, రెస్టారెంట్ చెయిన్ ఓనర్‌గా ఎదిగిన తీరు అసాధారణం. వైవాహిక జీవితంలో ఒడుదొడుకులను అధిగమించి, మద్యానికి బానిసైన భర్తతో పోరాటం కొనసాగిస్తూ, ఇద్దరు పిల్లల పాలనను చూస్తూ వ్యాపారంలో విజయాన్ని సాధించిన ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.



### ప్రేమ వివాహం
చెన్నైకి చెందిన పాట్రిషియా నారాయణ్ తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. పాట్రిషియా కాలేజీలో ఉన్నప్పుడు తనకంటే 13 సంవత్సరాల వయసు ఎక్కువగా ఉన్న అబ్బాయితో ప్రేమలో పడి 17 ఏళ్ళ వయసులో రహస్యంగా పెళ్ళి చేసుకున్నారు. పాట్రిషియా చదువు పూర్తయిన తర్వాత ఇంట్లో చెప్పాలనుకున్నారు. కానీ పెళ్ళయిన కొద్ది రోజులకు భర్త పెట్టే ఒత్తిడులకు తట్టుకోలేక ఇంట్లో పెళ్ళి విషయం చెప్పాల్సి వచ్చింది. సహజంగానే ఇది తల్లిదండ్రులకు నచ్చలేదు. కానీ వాళ్ళు ముందే రిజిస్టర్ మ్యారేజీ చేసుకోవడంతో చేసేదేమీ లేక బంధువుల సమక్షంలో పెళ్ళి చేశారు. తర్వాత పాట్రిషియా తన భర్తతో కలిసి అన్నానగర్‌లో వేరే ఇంట్లో ఉండేది.



### పచ్చళ్ల వ్యాపారం
కోరుకున్న వాడితో జీవితం ప్రారంభించానన్న సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు పాట్రిషియాకు. తన భర్త తాగుబోతు అని తెలుసుకుంది, ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. భర్తకు ఉద్యోగం చేసే ఉద్దేశం లేదు. అప్పటికే ఆమెకు ఇద్దరు పిల్లలు. కష్టాలను తెలుసుకున్న తండ్రి వారిని చేరదీశాడు. భర్తలో ఏ మార్పూ రాలేదు. ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉండేవాడు. తాగడానికి డబ్బుల కోసం వేధించేవాడు. దీంతో ఇద్దరు పిల్లల సంరక్షణ భారాన్ని ఆమె నెత్తిన వేసుకుంది. ఎన్నో కష్టాలు ఎదుర్కొంది. ఏదైనా ఒకటి చేసైనా సరే పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని, తాను ఆర్థికంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని భావించింది. అయితే తన తల్లిదండ్రులకు భారం కావడం ఇష్టం లేక ఏదైనా సొంతంగా చేయాలనే ఆలోచనతో ఇంట్లో పచ్చళ్లు, జామ్‌లు తయారు చేయడం ప్రారంభించింది. ఒకరోజు తను తయారు చేసినవన్నీ తన తల్లి ఆఫీసులో కొలీగ్స్‌కి ఒక్కరోజులో అమ్మింది. ఒక్క రోజులో మొత్తం సేల్ అవ్వడంతో కొంత ధైర్యం వచ్చింది. అట్లా వస్తున్న ఆదాయాన్ని పెట్టుబడిగా పెడుతూ ఎక్కువ మొత్తంలో పచ్చళ్లను తయారు చేసేది. వాటిని స్వయంగా వీధుల్లో అమ్మేది.

### దశ తిరిగింది
కొన్ని రోజులకు దివ్యాంగ విద్యార్థుల స్కూలును నడుపుతున్న తండ్రి స్నేహితుడొకాయన కొన్ని మొబైల్ బళ్లను (రోడ్డు పక్కన కాఫీ, టీ, తినుబండారాలు అమ్మే బండి) ఉచితంగా పంచుతున్నాడు, కాకపోతే బండి తీసుకున్న వారు ఇద్దరు దివ్యాంగులకు పని కల్పించాలి. ఇది నచ్చిన పాట్రిషియా ఒక బండిని తీసుకుంది. మెరీనా బీచ్‌లో అన్నా స్క్వేర్ వద్ద బండి పెట్టి కాఫీ, టీ అమ్మాలని ఆమె ఆలోచన. కండిషన్ ప్రకారం ఇద్దరికి ట్రైనింగ్ కూడా ఇచ్చింది. అయితే బండి నిర్వహణ పర్మిషన్ రావడానికి ఒక సంవత్సరం పట్టింది. పచ్చళ్ళ బిజినెస్ కొనసాగిస్తున్న పాట్రిషియా చివరకు 1982లో మెరీనా బీచ్‌లో తన టీ స్టాల్‌ను ప్రారంభించింది. కానీ మొదటి రోజు ఒకే ఒక్క టీ అమ్ముడు పోవడంతో దిగాలు పడింది. కానీ రెండో రోజు నుంచి గిరాకీ పెరిగింది. టీ నుండి సమోసా, బజ్జీ, జ్యూస్‌లు ఇలా మెనూను పెంచుతూ పోయింది. అలా ఈ కార్టు విజయవంతంగా 2003 వరకు నడిచింది. రోజూ ఉదయం 5 నుండి 9, సాయంత్రం 3 నుండి 11 వరకు నడిపేది.

### క్యాంటీన్ నడిపి
మెరీనా బీచ్‌లో పాట్రిషియా బండిని కొన్ని రోజులుగా చూస్తున్న స్లమ్ క్లియరెన్స్ బోర్డ్ చైర్మన్ ఒకావిడ ఆమె దగ్గరకు వచ్చి తమ ఆఫీసులో క్యాంటీన్ నడపగలవా అని అడిగింది. పాట్రిషియా సంతోషంగా ఒప్పుకుంది. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యాంటీన్ నిర్వహించేవారు. అప్పటికి తన నెలవారీ ఆదాయం 20,000 రూపాయలకు పెరిగింది. అదే సమయంలో బ్యాంక్ ఆఫ్ మదురైలో క్యాంటీన్ నడిపే కాంట్రాక్టు వచ్చింది. దాంతో సమయం సరిపోక స్లమ్ క్లియరెన్స్ బోర్డ్‌క్యాంటీన్ వదులుకుంది.

### అనుకోని విజయం
భర్తతో గొడవలు మాత్రం తగ్గలేదు. ఒక రోజు భర్తతో వాగ్వాదం తర్వాత బయటికొచ్చి సిటీ బస్సు ఎక్కి చివరి స్టేషన్ వరకు టికెట్ తీసుకుంది. అయితే యాదృచ్ఛికంగా చివరి స్టేషన్ కేంద్ర పోర్టు మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ స్కూల్. అక్కడ దిగిన పాట్రిషియా నేరుగా లోపలికి వెళ్ళి అక్కడి అధికారులతో మీకు క్యాంటీన్ కాంట్రాక్టరు కావాలని విన్నాను అని అడిగింది. ఆమె ఆశ్చర్యపోయే విధంగా వారు కూడా అవును పాత కాంట్రాక్టరుతో విభేదాలవల్ల కొత్త వారికోసం చూస్తున్నాం అని చెప్పారు. అలా ఆ కాంట్రాక్టు ఆమెకు దక్కింది. అది వారానికి లక్ష రూపాయల కాంట్రాక్టు. రోజూ 700 మంది విద్యార్థులకు భోజనాలను అందించాలి. అక్కడే తనకు కూడా ఒక క్వార్టర్స్ ఇచ్చారు. అది తన జీవితంలో సాధించిన అతిపెద్ద విజయం.

### రెస్టారెంట్ రంగంలోకి
ఇదిలా ఉండగానే 1998లో సంగీత రెస్టారెంటు వారు తమ రెస్టారెంట్ చైన్‌లో ఒక రెస్టారెంట్‌లో భాగస్వామ్యం ఇస్తామని ముందుకు వచ్చారు. అయితే తన కుమారుడు మనమే సొంతంగా రెస్టారెంట్ పెడదామని ఆ అవకాశాన్ని వద్దన్నాడు. అప్పటికే క్యాంటీన్‌లు నడుపుతూ మంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్న ఆమె తన కొడుకు సలహాను పాటించారు. పెళ్ళయిన కొన్ని నెలలకే పాట్రిషియా కూతురు, అల్లుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఇది ఆమెను ఎంతగానో కుంగదీసింది. దాదాపు రెండు సంవత్సరాల వరకు మామూలు మనిషి కాలేక పోయింది. చివరకు 2006లో సొంతంగా మొదటి రెస్టారెంటు ప్రారంభించారు. తన కూతురు గుర్తుగా సందీపా అని పేరు పెట్టారు. రెస్టారెంటు పెద్ద సక్సెస్ అయింది. ఇప్పుడు ఈ రెస్టారెంటు చెయిన్‌లో 14 బ్రాంచులున్నాయి.

**2004లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాట్రిషియా కూతురు, అల్లుడు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. కాగా యాక్సిడెంట్ అయిన ప్రదేశం నుంచి వారి మృతదేహాలను తరలించేందుకు ఏ ఆంబులెన్స్ ముందుకు రాలేదు. దీంతో ఇతర వ్యక్తుల సహాయం తీసుకుని ఆమె వారి మృతదేహాలను ఖననం కోసం తరలించింది. ఈ సంఘటన తనను ఎంతగానో ఆలోచింపజేసింది. అసలే కూతురు, అల్లుడు పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న పాట్రిషియాకు వారి ప్రమాదం జరిగిన అనంతరం తలెత్తిన పరిస్థితులను జీర్ణించుకోలేకపోయింది. దీంతో వెంటనే ఆమె ఓ నిర్ణయం తీసుకుంది. వారు చనిపోయిన ప్రదేశం వద్దే క్షతగాత్రులను లేదా మృతదేహాలను తరలించేందుకు ఓ ఆంబులెన్స్‌ను సొంత ఖర్చులతో ఏర్పాటు చేసింది. తనకు జరిగినట్టు మరొకరికి కాకూడదనే ఉద్దేశంతోనే ఆమె ఈ సేవను ప్రారంభించింది.**

### రోజుకు రెండు లక్షలు
36 సంవత్సరాల క్రితం ఒక బండితో కేవలం ఇద్దరు సహాయకులతో మొదలైంది పాట్రిషియా వ్యాపారం. ఇప్పుడు తన కింద 200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 14 బ్రాంచులు, రోజుకు 2 లక్షల రూపాయల సేల్స్ తో ముందుకు దూసుకుని పోతుంది. కాగా వ్యాపార రంగంలో ఆమె చూపిన తెగువ, సాధించిన ప్రగతికి 2010 సంవత్సరానికి గాను ఆమెకు ఫిక్కి ఎంటర్‌ప్రైన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు కూడా లభించింది.

# మహిళలతో క్యాబ్ సర్వీసు!

**ఢిల్లీకి చెందిన శైలజ మిట్టల్ ప్రతి రోజూ తన కుమారుడ్ని ప్రైవేట్ క్యాబ్ ద్వారా స్కూల్‌కు పంపుతున్నది. ఓ రోజు పాత డ్రైవర్‌కు బదులు కొత్త డ్రైవర్ వచ్చాడు. దీంతో ఆమెలో ఆందోళన మొదలైంది. తన కొడుకు ఇంటికి చేరేంత వరకూ అతని గురించే ఆలోచించింది. తనలాగే తల్లులందరూ కలవరం చెందుతున్నారని, ఈ సమస్యకు ఓ పరిష్కారం ఆలోచించింది.**



ఢిల్లీకి చెంది శైలజ ప్రత్యేకంగా మహిళా డ్రైవర్లతో క్యాబ్ సర్వీలు నడిపిస్తున్నది. ఢిల్లీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో బీటెక్ చదివింది శైలజ. అనంతరం రోబోటిక్స్ ట్రైనర్‌గా పలు మల్టీనేషనల్ కంపెనీల్లో పనిచేసింది. ఈ క్రమంలో తన కొడుకు రక్షణ గురించి చేసిన ఆలోచనతో 'కోలా క్యాబ్స్' అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఇందుకు తన స్నేహితుడైన అన్మోల్‌ను సంప్రదించి తన ఆలోచన చెప్పింది. అన్మోల్‌కు ఫార్మా కంపెనీలో పనిచేసిన అనుభవం ఉన్నది. దీంతో ఇద్దరూ కలిసి ప్రణాళికా బద్ధంగా 'కోలా క్యాబ్స్' సంస్థను అభివృద్ధి చేయడానికి అవసరమైన కార్యక్రమాలను అమలు చేశారు. మహిళలు, వృద్ధులు, పిల్లల గురించి భయాందోళన చెందకుండా ఉండాలంటే మహిళా డ్రైవర్లు మేలనే తుది నిర్ణయానికి వచ్చారు. దీంతో నిపుణులైన మహిళా డ్రైవర్లను ఎంపిక చేసుకొని విజయవంతంగా క్యాబ్ సర్వీసులు నిర్వహిస్తున్నారు. మహిళా డ్రైవర్లతో నమ్మకం ఏర్పడుతుందని, అఘాయిత్యాలు జరిగే ఆస్కారం లేదని అంటున్నది శైలజ. ఇప్పటి వరకూ ప్రతి రోజూ ఢిల్లీ నగరంలో 15 క్యాబ్‌లతో 130మందికి పైగా సేవలందిస్తున్నారు. మార్కెటింగ్ సిబ్బంది, సాంకేతిక నిపుణుల్లో ఐదుగురు ఫుల్‌టైమ్ ఎంప్లాయిస్, పది మంది ఫ్రీలాన్సర్లతో సంస్థను నడుపుతున్నారు. మహిళలు, పిల్లలను సురక్షితంగా గమ్యాలకు చేరుస్తున్న 'కోలా క్యాబ్' సేవలను అందరూ ప్రశంసిస్తున్నారు. తర్వలో ఇతర నగరాలకు 'కోలా క్యాబ్' సేవలను విస్తరించనున్నామని శైలజా మిట్టల్ చెబుతున్నది.

# నవ్వుతో ప్రయోజనాలు!




**నవ్వడం ఒక భోగం. నవ్వించడం ఒక యోగం. నవ్వలేక పోవడం ఒక రోగం అన్నారు ఆనాటి మహానుభావులు. నవ్వు నాలుగు విధాల చేటు అని మన పెద్దవాళ్లు అంటుంటే.. ఇప్పటి తరం మాత్రం నవ్వు నాలుగు విధాల మేలు అంటున్నారు.**

- ఈ కాలంలో ప్రతి ఒక్క పని ఒత్తిడితో కూడుకున్నదే. ఆఫీస్, కాలేజ్ ఎక్కడికెళ్లినా టెన్షనే. అంతెందుకు ఇంట్లో పని కూడా టెన్షన్‌తోనే జరిగిపోతుంటుంది. ఈ ఉరుకులు పరుగుల జీవితంలో ఆందోళన, ఒత్తిళ్లు లేకుండా ఏ పనీ జరగదు. వీటిని తగ్గించుకునే మార్గం నవ్వు ఒక్కటే.
- అధిక రక్తపోటు చిన్నవాళ్ల నుంచి పెద్దవాళ్ల వరకు వేధిస్తుంది. గుండెపై అత్యంత ప్రభావం చూపే అధిక రక్తపోటు హార్ట్ పనితీరును నెమ్మది చేస్తుంది. అందుకే నవ్వుతో బీపిని కంట్రోల్ చేసుకోవచ్చు.
- రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి రకరకాల పద్ధతులు అమలు పరుస్తుంటాం కదా. అందుకు వాడే మందుల కంటే నువ్వు అనే మందును తీసుకుంటే చాలు అంటున్నారు నిపుణులు. దీంతో ఇన్ఫెక్షన్లు, ఆత్రుత, కోపం ఇవన్నీ తగ్గిపోతాయట.
- ఒత్తిడితో, నిద్రలేమితో గడుపుతున్న వారి సంఖ్య ఇటీవలి కాలంలో ఎక్కువగా కనబడుతుంది. నిద్రపోయే ముందు కాసేపు నవ్వుకొని పడుకుంటే.. మనసు ప్రశాంతంగా ఉండి వెంటనే నిద్ర పడుతుంది.
- ఫేషియల్, ఎక్సర్‌సైజ్ కంటే నవ్వు బాగా పనిచేస్తుంది. నవ్వడం వల్ల ముఖం మీది ఉన్న కండరాలు కదిలి, రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. దీంతో నిత్య యవ్వనంగా కనిపిస్తారు.
- శరీరంలో నెగెటివ్ ఎనర్జీ అనేది ప్రతికూల ఆలోచనలకు పునాది వేస్తుంది. అందుకే సానుకూల ఆలోచనలు మనస్సులో మెదలాలంటే అందుకు మంచి రెమెడీ నవ్వు. ఎప్పుడూ నవ్వుతూ ఉండడం వల్ల ఆలోచనా సరళి సానుకూలంగా స్పందిస్తుంది.

# నెలసరి సమస్యలుంటే పిల్లలు పుట్టరా?

**నా వయసు 27 సంవత్సరాలు. నెలసరి 2-3 నెలలకోసారి వస్తున్నది. అప్పడప్పడు మందులు వాడితేగానీ రాదు. ఇలాంటి పరిస్థితి వల్ల ఆరోగ్యానికి ఏమైనా ప్రమాదమా? నెలసరి సక్రమంగా రావడానికి ఏం చేయాలి? సంతానం కలగాలని.. పిల్లలతో ఆనందదాయక జీవితం గడపాలని ఉంది. క్రమం తప్పిన నెలసరి గర్భ ధారణకు నష్టం చేకూరుస్తుందంటారా? దయచేసి తెలుపగలరు.**
**- కె.పద్మావతి, భువనగిరి**




నెలసరి సరిగ్గా రాకపోవడానికి చాలా కారణాలు ఉండవచ్చు. మామూలుగా హార్మోన్ల అసమతుల్యత వల్ల, థైరాయిడ్ సమస్యల వల్ల నెలసరి సక్రమంగా రాదు. దీనికోసం ఎర్రరక్త కణ పరీక్షలు చేయించాలి. థైరాయిడ్ సమతుల్యతను పెంపొందించేందుకు మందులు వాడితే సరిపోతుంది. పీసీఓఎస్‌కు హార్మోన్లు సరిచేసుకుంటూ ప్రెగ్నెన్సీ కోసం చికిత్సలు చేయించుకోవాలి. కొన్నిసార్లు ఆధునిక సంతాన సాఫల్య చికిత్సా విధానాలు అవసరం రావచ్చు. ఇక నెలసరి సక్రమంగా రాకపోవడానికి మరో కారణం వయసు. దీని కారణంగా అండాల సంఖ్య, నాణ్యత తగ్గుతాయి. సాధారణంగా 35 సంవత్సరాల పైబడిన వారిలో అండాల సంఖ్య క్రమంగా తగ్గుతుంది. ఆధునిక జీవనశైలి కారణంగా నేటి యువతులలో 22-24 సంవత్సరాల లోపు ఉన్నవారిలో కూడా నెలసరి సమస్యలను చూస్తున్నాం. కాబట్టి బిజీ లైఫ్‌లో పడి అస్తవ్యస్థమైన జీవన విధానం కాకుండా సక్రమమైన లైఫ్‌స్టయిల్‌ను అలవర్చుకోవాలి. పౌష్టికాహారం తినాలి. ఈ రోజుల్లో తప్పనిసరిగా వ్యాయామం చేయాలి.

**డాక్టర్ ప్రీతిరెడ్డి**
ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

## వంటింటి చిట్కాలు

- పప్పు ఉడికిన తర్వాత ఉప్పు వేయాలి. ముందుగా వేస్తే పప్పు ఉడకడానికి ఎక్కువ సమయం పడుతుంది.
- అరటిపూసలోని పీచు తీసేయాలంటే పూసను చిన్న ముక్కలుగా తరిగి కొంచెం మజ్జిగ చిలకరిస్తే పీచు కవ్వంతో తేలికగా వస్తుంది.
- ఉల్లిపాయలు తరిగేందుకు అరగంట ముందు వాటిని పాలిథిన్ కవర్లో వేసి ఫ్రిజ్‌లో పెడితే తరిగేటప్పుడు కళ్లు మండవు.
- గారెల పిండి రుబ్బేటప్పుడు రెండు గరిటెల అన్నం వేసి మెత్తగా రుబ్బండి. ఈ పిండితో చేసిన గారెలు ఎంతో రుచిగా ఉంటాయి.
- బెల్లంపాకం గానీ, పంచదార పాకం గానీ పట్టేటప్పుడు త్వరగా ముదురుపాకానికి వస్తే రెండు స్పూన్ల పాలు పోసి కదపండి.






# కాలేజీ ఎంపికలో జాగ్రత్త

## ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ యాదయ్య

**ఎంసెట్ ర్యాంకులు ప్రకటించారు. చాలామంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యింది. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభమయ్యింది. చాలామంది ఏ కాలేజీలో చేరాలి? బ్రాంచీకి ప్రాముఖ్యత ఇవ్వాలా? కాలేజీకి ప్రాధాన్యం ఇవ్వాలా అనే సంశయంలో ఉన్నారు. అదేవిధంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి, ఇప్పటివరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాని వారికి ఉన్న సందేహాల నివృత్తి కోసం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, ఎంసెట్ కన్వీనర్, ప్రొఫెసర్ ఎన్.యాదయ్య నిపుణతో చెప్పిన విషయాలు, సూచనలు ఆయన మాటల్లో..**



- ఈసారి ఎంసెట్ ప్రవేశాలలో స్వల్ప మార్పులు చేశాం. గతంలో ర్యాంకుల ఆధారంగా తేదీలను ఇచ్చి ఆయా నిర్దేశిత కేంద్రాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసేవారు. ఈసారి విద్యార్థులకు మరింత సులభంగా, ఇబ్బందులు లేకుండా ఉండటానికి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాం. దీనివల్ల విద్యార్థులు కోరుకున్న తేదీన కోరుకున్న సెంటర్‌లో కోరుకున్న సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేశాం. దీనివల్ల విద్యార్థులు చాలా తక్కువ సమయంలో వెరిఫికేషన్‌ను పూర్తిచేసుకున్నారు. ఎక్కువ సమయం వృథా కాకుండా నివారించగలిగాం. అంతేకాకుండా ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొదటి ఫేజ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయింది.
- ఇక విద్యార్థులకు జూలై 6 నుంచి వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ ప్రక్రియలో చాలామంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు అనేక సందేహాలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఏ కాలేజీలో చదవాలి? ఏ బ్రాంచీ తీసుకోవాలి? ఈ విషయాలను ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం...

### కాలేజీ ఎంపిక:

- కాలేజీ ఎంపిక అనేది మంచి ర్యాంకు వచ్చినవారికి పెద్దగా ఇబ్బంది ఉండదు. వారు కోరుకున్న కాలేజీలో చేరవచ్చు. ఇక మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన వారికి అనేక సందేహాలు. ప్రధానంగా కాలేజీ ఎంపిక కోసం కొన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుంటే కాలేజీ ఎంపిక చాలా సులువుగా చేసుకోవచ్చు. వీటిలో ప్రధానంగా కింది అంశాలను పరిశీలించాలి.
- కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంకు ప్రాతిపదికగా తీసుకోవాలి.
- ఎన్‌బీఏ, న్యాక్ అక్రెడిటేషన్లు పరిశీలించాలి
- కాలేజీ ఎక్కడ ఉంది, రవాణా సౌకర్యం, ఉన్న ప్రదేశానికి రాకపోకలకు ఎంత సమయం తీసుకుంటుంది వంటి ప్రాథమిక అంశాలను తెలుసుకుని లెక్కలోకి తీసుకోవాలి.
- ప్లేస్‌మెంట్స్ విషయంలో ప్రచార పటాటోపాలను చూసి మోసపోవద్దు. క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. ఏయే కంపెనీలు వస్తున్నాయి, ఏటా ఎంతమందికి ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయనే విషయాన్ని పూర్వ విద్యార్థుల ద్వారా, వెబ్‌సైట్‌ల ద్వారా తెలుసుకోవాలి.
- కాలేజీలో సీనియర్ ఫ్యాకల్టీ ఉన్నారా లేరా తెలుసుకోవాలి. సీనియర్ ఫ్యాకల్టీ వల్ల విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. ఆయా సబ్జెక్టుల్లో విలువైన సూచనలు, ప్రాజెక్టుల రూపకల్పన, అకడమిక్, ప్రాక్టికల్‌గా కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది.
- ల్యాబొరేటరీలను పరిశీలించుకోవాలి. పూర్వ విద్యార్థుల ద్వారా లేదా ప్రస్తుతం సెకండియర్, థర్డ్, ఫోర్త్ ఇయర్ చదువుతున్నవారి ద్వారా విషయాలను తెలుసుకోవాలి.
- సంబంధిత సబ్జెక్టులే కాకుండా అదనంగా ఏం బోధిస్తున్నారు? క్యాంపస్, ఆఫ్‌క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఏమైనా నేర్పిస్తున్నారా? సాఫ్ట్ స్కిల్స్‌ను నేర్పిస్తున్నారా? ఏయే క్లబ్‌లు ఉన్నాయి? టెక్ ఫెస్ట్‌లు, ఇంటర్ కాలేజీ కాంపిటీషన్లలో ఈ కాలేజీ పార్టిసిపేషన్ ఉందా ఇతరత్రా విషయాలు తెలుసుకోవాలి.
- లైబ్రేరీ, ప్లేగ్రౌండ్ తదితర అంశాలను సైతం లెక్కలోకి తీసుకుంటే తప్పక మంచి కాలేజీని ఎంపిక చేసుకోవడం సులభమే.

### బ్రాంచీ ఎంపిక:

- ఇటీవల కాలంలో బ్రాంచీ ఎంపికలో చాలామంది మూసగా పోతున్నారు. ఎక్కువ మంది సీఎస్ఈ కావాలనే కోరుకుంటున్నారు. అది తప్పుకాకున్నా నిజంగా విద్యార్థికి ఏ సబ్జెక్టు లేదా ఏ బ్రాంచీమీద పట్టు లేదా అభిరుచి ఉందో పరిశీలించుకోవాలి. అవసరమైతే ఆయా సబ్జెక్టుల్లో నిపుణులను, సీనియర్ల సలహాలను తీసుకోండి.
- తల్లిదండ్రులు పిల్లల మనోభీష్టాన్ని గుర్తించి తదనుగుణంగా బ్రాంచీలను ఎంపిక చేసుకుంటే ఆయా రంగాలలో రాణించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థికి ఉదాహరణలతో చెప్పి ఏ బ్రాంచీ తీసుకుంటే మంచిదో చెప్పండి.
- సాధారణంగా అన్ని బ్రాంచీలకు మంచి అవకాశాలే ఉంటాయి. కొన్నింటికి ఎంఎన్‌సీలలో అధిక వేతనం రావచ్చు, కానీ ఆ బ్రాంచీలకు ప్రభుత్వ, పీఎస్‌యూలలో అవకాశాలు తక్కువగా ఉండవచ్చు. అన్ని బ్రాంచీలకు నవరత్న, మినీరత్న, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి.
- ముఖ్యంగా విద్యార్థులు తల్లిదండ్రులు గుర్తుంచుకోవాల్సిన అంశం ర్యాంకును బట్టి కొన్ని సందర్భాలలో అనుకున్న బ్రాంచీ రాకపోవచ్చు. కానీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆ బ్రాంచీ మీద ఫోకస్‌గా చదివితే తప్పక ఆ రంగంలో అగ్రస్థానానికి చేరుకోవచ్చు. చదివే బ్రాంచీపై మక్కువ పెంచుకుని ఎక్కువ కృషి చేస్తే తప్పక ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.
- ఆయా కాలేజీల్లో రకరకాల బ్రాంచీలు ఉంటాయి. అవి చదివితే కెరీర్ తప్పక ఉంటుంది. లేకపోతే ఆ కాలేజీలు ఆ బ్రాంచీలను పెట్టరు అనే విషయాన్ని గుర్తుంచుకోండి.
- చివరగా కాలేజీ, బ్రాంచీల ఎంపిక అనేది పూర్తిగా విద్యార్థి అభీష్టం మీదనే ఆధారపడుతుంది. కొన్ని సందర్భాలలో కాలేజీ చూసుకుంటే బ్రాంచీ దొరకకపోవచ్చు. బ్రాంచీ చూసుకుంటే కాలేజీ దొరకకపోవచ్చు. కానీ బాధపడాల్సిన అవసరం లేదు, మీ ఇష్టమైన దానిలో చేరి ఫోకస్డ్‌గా చదివితే తప్పక రాణిస్తారు.

### ఆప్షన్ల ఎంపిక కోసం:

- ఎవరైతే సర్టిఫికేషన్ పూర్తయ్యిందో వారు వెబ్ ఆప్షన్లను ఇచ్చుకోవాలి. దీనికోసం అభ్యర్థులకు ఇప్పటికే లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను పంపాం. వీటిని ఎట్టి పరిస్థితుల్లో ఇతరులతో షేర్ చేసుకోవద్దు. పూర్తిగా సీక్రెట్‌గా ఉంచుకోవడం మంచిది.
- ఆప్షన్లు ఇచ్చేముందు మ్యానువల్ ఆప్షనల్ ఫార్మ్ ప్రింట్ తీసుకుని మ్యానువల్‌గా కాలేజీ, డిస్ట్రిక్ట్ కోడ్, కోర్సు కోడ్‌లను ప్రాధాన్యత క్రమంలో రాసుకోండి.
- ఒకటికి రెండుసార్లు పైన చెప్పిన అంశాలను అంటే కాలేజీ, బ్రాంచీలను ప్రాతిపదికగా తీసుకుని జాబితాను తయారుచేసుకోండి.
- తల్లిదండ్రులు, నిపుణులు, సీనియర్ విద్యార్థులను సంప్రదించి జాగ్రత్తగా జాబితాను రూపొందించుకోండి.
- మ్యానువల్‌గా ఓకే అనుకున్నాక ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను ఇచ్చుకోండి. సాధ్యమైనన్ని ఎక్కువ ఆప్షన్లను ఇచ్చుకోండి.
- చివరగా విద్యార్థులకు చెప్పే విషయం ప్రతి చిన్న విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. ఇది మీ జీవితంలో అత్యంత మలుపు తిప్పే కాలం ఇది. జీవితంలో స్థిరపడాలనుకునే రంగాన్ని జాగ్రత్తగా నిర్ణయించుకుని ఇష్టంతో ముందుకుపోవాలి.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

### ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎవరికి...?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో చాలామందికి రకరకాల అనుమానాలు ఉన్నాయి. వీటి నివృత్తి కోసం ఎంసెట్ ప్రవేశాలకు సంబంధించిన అధికారులు తెలిపిన వివరాలు..
- ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యార్థులందరికీ ప్రయోజనం చేకూరాలని ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.
- మొదటి పదివేల ర్యాంకు లోపు వచ్చిన అన్ని కేటగిరీల అభ్యర్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుంది.
- ఆదాయ ధృవీకరణ పత్రం ప్రకారం జనరల్ (ఓసీలకు) రూ. లక్ష లోపు ఆదాయం ఉన్న వారికి, ఎస్సీ, ఎస్టీలైతే రూ. 2 లక్షల ఆదాయం ఉన్నవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుంది.
- ఇక బీసీ అభ్యర్థుల విషయానికి వస్తే అర్బన్ ఏరియా విద్యార్థులకు రూ. 2 లక్షలు, రూరల్ ఏరియా అభ్యర్థులైతే రూ. 1.50 లక్షల లోపు ఉండాలి.
- ఆదాయ ధృవీకరణ పత్రం ప్రకారం అర్హత ఉన్నవారికి ఎస్సీ/ఎస్టీలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుంది.
- పైన పేర్కొన్న ఆదాయ పరిమితుల్లో ఉండి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివిన అన్ని కేటగిరీల విద్యార్థులందరికీ ఏ ర్యాంక్ వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.
- డీఆర్‌డీఏ స్కీంలో చదువుకున్న ఎస్సీ/ఎస్టీల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.
- ప్రభుత్వం పేర్కొన్న ఆదాయ పరిమితుల్లో ఉన్న ప్రతి విద్యార్థికి (పదివేల కంటే ఎక్కువ ర్యాంక్ వచ్చినవారు) ప్రభుత్వం రూ. 35 వేలు రీయింబర్స్‌మెంట్ కింద ఇస్తుంది. మిగిలిన ఫీజును అభ్యర్థులు చెల్లించాలి.
- ఈసారి కొత్తగా ప్రవేశపెట్టిన ఇంటర్నల్ స్లైడింగ్‌లో సీటు పొందిన అభ్యర్థులకూ (అర్హత ఉన్నవారికి) ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

# వెబ్ ఆప్షన్లు కీలకం

- అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత ఇంట్లో/ ఇంటర్నెట్ సెంటర్/ ఇతర ఇంటర్నెట్ అవకాశం ఉన్నచోటికి వెళ్లి వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలి.
- కొంతమంది ఇప్పటికే ఆప్షన్లు ఇచ్చి ఉంటారు. మరోసారి తల్లిదండ్రులు, విద్యార్థులు కాలేజీలు, కోర్సులకు సంబంధించి కసరత్తు చేసుకోవడం మంచిది. అంటే ఏ కాలేజీలో చేరాలి? ఏ బ్రాంచీలో చేరాలి? అక్కడ ఫీజు కట్టగలమా? హాస్టల్ సౌకర్యం ఉందా (అవసరమైన వారికి) తదితర వివరాలను తెలుసుకోవాలి.
- టీఎస్ఎంసెట్ వెబ్‌సైట్‌లో యూజర్ మ్యానువల్‌ను క్షుణ్ణంగా చదవండి.
- ఆప్షన్స్ నమోదు చేసేటప్పుడు కాలేజీలు, కోర్సులను ప్రియారిటీ ప్రకారం నమోదు చేసుకున్నారా లేదా చూసుకోండి.
- ముఖ్యంగా ఇంటర్నెట్ సెంటర్లలో వెబ్ ఆప్షన్లు ఇచ్చేవారు ఆప్షన్లు సేవ్ చేసిన తర్వాత బయటకి వచ్చే ముందు తప్పనిసరిగా లాగ్ అవుట్ కావాలి.
- నిర్ణీత తేదీలోపు విద్యార్థి ఎన్నిసార్లయినా ఆప్షన్లు మార్చుకోవచ్చు. మొదటి లిస్ట్ సీట్ అలాట్‌మెంట్‌ను జూలై 10న ప్రకటిస్తారు. జూలై చివరి వారంలో సెకండ్ ఫేజ్ మొదలవుతుంది.
- సీటు అలాట్‌మెంట్ అయిన తర్వాత అభ్యర్థులు ఆర్‌వోసీ ఫాం నంబర్, టీఎస్ఎంసెట్ హాల్‌టికెట్ నంబర్, పాస్‌వర్డ్, జనన తేదీతో లాగిన్ కావాలి. తర్వాత ప్రొవిజినల్ అలాట్‌మెంట్ ఆర్డర్ ప్రింట్ తీసుకోవాలి.
- అలాట్‌మెంట్ ఆర్డర్‌లో పేర్కొన్న ట్యూషన్ ఫీజును నిర్ణీత గడువులోగా చెల్లించాలి. లేకుంటే సీటు రద్దవుతుంది.
- ట్యూషన్ ఫీజును క్రెడిట్/డెబిట్/నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చు. తర్వాత ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అప్పుడు అలాట్ అయిన సీటు ఉంటుంది. ఆ కాపీని ప్రింట్ తీసుకోవాలి.
- ఒకవేళ అభ్యర్థి అలాట్‌మెంట్ ఆర్డర్‌లో జీరో ట్యూషన్ ఫీజు (ఎటువంటి ట్యూషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుంటే) ఉంటే నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. లేకుంటే సీటు రద్దవుతుంది. ఆ కాపీని ప్రింట్ తీసుకోవాలి.

### ఎక్కువ ఆప్షన్లు ఇవ్వండి

- వెబ్ ఆప్షన్ల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాల్సిన ముఖ్య విషయం ఏ ర్యాంక్ వచ్చిన అభ్యర్థులైనా సాధ్యమైనన్ని ఎక్కువ ఆప్షన్లను ఇవ్వాలి. ఎక్కువ ఆప్షన్లు ఇవ్వడంవల్ల ఎటువంటి నష్టం ఉండదు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి 2 వేల ర్యాంక్ వచ్చింది. గతేడాది ప్రకారం మంచి కాలేజీలో వస్తుందన్న నమ్మకంతో నాలుగైదు ఆప్షన్లు మాత్రమే ఇచ్చారనుకుందాం. ఈసారి ర్యాంకుల పరిస్థితిని బట్టి ఆ కాలేజీల్లో సీటు రాకుంటే మళ్లీ రెండోదశ కౌన్సెలింగ్‌కు వెళ్లాల్సి వస్తుంది. అప్పుడు మంచి ర్యాంక్ వచ్చి కూడా మొదటిదశలో మిగిలిపోయిన సీట్లలో ఎంపికచేసుకోవాల్సి వస్తుంది. కాబట్టి సాధ్యమైనన్ని ఎక్కువ కాలేజీలు, కోర్సులు ఆప్షన్లు ఇచ్చుకుంటే మంచిది. అలాట్‌మెంట్ ర్యాంక్, సీట్ల ప్రాతిపదికనే జరుగుతుంది. కాబట్టి ఎక్కువ ఆప్షన్లు ఇచ్చినా మీరు ఇచ్చిన ప్రియారిటీ బట్టే సీటు అలాట్ అవుతుంది. మరో ముఖ్య విషయం కాలేజీల వివరాలు, కోర్సుల వివరాలను క్షుణ్ణంగా తెలుసుకుని ఆప్షన్లు ఇవ్వాలి. గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ విషయంలో ఆ కాలేజీల వివరాలు తెలుసుకోవాలి. మీ ప్రియారిటీ ప్రకారం ఆప్షన్లు ఇవ్వాలి.
- మొదటి ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్‌లో అభ్యర్థి అనుకున్న కాలేజీలో/కోర్సులో సీటు రాకుంటే రెండో కౌన్సెలింగ్‌కు వెళ్లాలి. అయితే ఇక్కడ కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. మొదటి ఫేజ్‌లో అలాట్ అయిన సీటుకు సంబంధించి నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించకపోతే ఆటోమేటిక్‌గా సీటు రద్దవుతుంది. ఒకవేళ ఫీజు చెల్లిస్తే సీటు ఉంటుంది. రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు వెళ్లవచ్చు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం ఇప్పుడు వచ్చిన కోర్సు/కాలేజీ కంటే ఉన్నతమైంది మాత్రమే ఆప్షన్లుగా ఇవ్వాలి.
- రెండో రౌండ్‌లో సీటు అలాట్ అయితే మొదటి రౌండ్‌లో వచ్చిన సీటు రద్దవుతుంది. ఫీజు బదిలీ చేయబడుతుంది. ఒకవేళ రెండో రౌండ్‌లో సీటు రాకుంటే మొదట వచ్చిన సీటు ఉంటుంది. రెండో రౌండ్‌లో కూడా అభ్యర్థి అనుకున్నది రాకుంటే మూడో రౌండ్‌కు వెళ్లవచ్చు. ఇక్కడ కూడా ఇప్పటికే అలాట్ అయిన కోర్సు/కాలేజీ కంటే ఉన్నతమైందే ఆప్షన్లుగా ఇవ్వాలి. లేకుంటే మంచి ర్యాంక్ వచ్చి కూడా ఏదో ఒక కోర్సు/కాలేజీలో జాయిన్ కావాల్సి వస్తుంది. మొదట సీటు రద్దయి రెండోరౌండ్‌లో వేరే సీటు అలాట్ అయితే మొదటి సీటును ఎట్టిపరిస్థితుల్లో ఇవ్వడం కుదరదు. అది వేరేవారికి అలాట్ చేస్తారు. కాబట్టి రెండు/మూడు రౌండ్‌లకు వెళ్లేవారు చాలా జాగ్రత్తగా నిపుణులు/సీనియర్ల సలహాలు తీసుకుని ఆప్షన్లు ఎంపికచేసుకోవాలి.
- విద్యార్థి ఇష్టాయిష్టాలను బట్టి రెండు, మూడు రౌండ్ల కౌన్సెలింగ్‌లకు వెళ్లవచ్చు. అయితే వీటికి సంబంధించిన విషయాలను సమగ్రంగా తెలుసుకోవడం మంచిది.



- బి. శ్రీనివాస్
ఎంసెట్ అడ్మిషన్ల క్యాంప్ ఆఫీసర్

---

గ్రూప్-2 ఇంటర్వ్యూ గైడెన్స్

# పథకాలపై పట్టుండాలి

- రాష్ట్ర ప్రభుత్వ విధానాల్లో మొదటి ప్రాధాన్యం అణగారిన వర్గాల సంక్షేమానికి ఇవ్వడానికి ప్రధాన కారణం తెలంగాణ సమాజంలో 80 శాతానికి పైగా బలహీన వర్గాల జనాభా ఉండటమే.

### రాష్ట్ర జనాభాలో వివిధ వర్గాల వాటా...

1. వెనుకబడిన వర్గాలు- 52.20 శాతం
2. షెడ్యూల్డ్ కులాలు- 15.44 శాతం
3. షెడ్యూల్డ్ తెగలు- 9.34 శాతం
4. ముస్లిం మైనార్టీలు- 12 శాతం

- అందువల్ల కులవృత్తులను ప్రోత్సహించడం మొదలు దళితులకు మూడెకరాల భూ పంపిణీ వంటి శాశ్వత ప్రయోజనాన్ని కల్పించే అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నది.



### మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్

- దీన్ని ఐక్యరాజ్యసమితి రూపొందించింది.
- 2000 నుంచి 2015 వరకు పేదరికం, ఆకలి, వ్యాధులకు వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు విధివిధానాలను రూపొందించి అమలు చేశాయి.
- 2015లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ అభివృద్ధి విజన్‌ను రూపొందించింది.

**'ప్రపంచ మార్పు సుస్థిరాభివృద్ధికి 2030 ఎజెండా'**

- ప్రజల కోసం, భూగోళం కోసం, సౌభాగ్యం కోసం కార్యాచరణ ప్రణాళిక
- **17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడం**
- **ఈ లక్ష్యాల సాధనకు ఎంచుకున్న విధానాలు..**
  1. మానవాభివృద్ధి
  2. ఆర్థికాభివృద్ధి
  3. పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి
  4. సుపరిపాలన (స్మార్ట్ గవర్నమెంట్)
- మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌ను సాధించడానికి తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, పథకాలను ప్రవేశపెట్టింది.
- ఈ లక్ష్యాలను నెరవేర్చడమే బంగారు తెలంగాణ లక్ష్యం

### తెలంగాణలో శ్రామిక శక్తి (15-59 ఏండ్లు)

1. రోజువారీ కూలీలు- 31 శాతం
2. వ్యవసాయ కూలీలు- 23 శాతం
3. సొంత వ్యవసాయం చేసుకునే వారు- 11 శాతం
4. పని లభించనివారు- 7 శాతం
5. బీడీ కార్మికులు- 4 శాతం
6. డ్రైవర్లు- 3 శాతం
7. చిన్న వ్యాపారులు- 2 శాతం
8. వలస కూలీలు- 2 శాతం
9. ఇతరులు- 17 శాతం

### రాష్ట్రంలోని శ్రామిక శక్తిలో విద్యాస్థాయి

1. నిరక్షరాస్యులు- 34 శాతం
2. సెకండరీ విద్య- 29 శాతం
3. ఇంటర్ విద్య- 10 శాతం
4. గ్రాడ్యుయేషన్- 14 శాతం
5. పోస్ట్‌గ్రాడ్యుయేషన్- 4 శాతం
6. డిప్లొమా విద్య- 2 శాతం

### తెలంగాణలో భూ వినియోగం (2015-16)

1. నికర సాగు భూమి- 37.3 శాతం
2. బంజరు భూములు- 26.9 శాతం
3. అటవీ భూములు- 22.7 శాతం
4. వ్యవసాయేతర పనులకు వినియోగించే భూమి- 8 శాతం
5. ఇతర భూములు- 5.1 శాతం

- సగటు కమతం విస్తీర్ణం 1.12 హెక్టార్లు (2010-11)

### సంక్షేమ యంత్రాంగం

- ప్రభుత్వాల అంతిమ లక్ష్యం అణగారిన వర్గాల అభ్యున్నతి
- యూరప్‌లో సంభవించిన పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచి విప్లవం, అమెరికాలో ఏర్పడిన మహా ఆర్థికమాంద్యం ప్రభావం వల్ల దేశ ఆర్థిక వ్యవహారాల్లో రాజ్యం ఒక బలమైన శక్తిగా అవతరించింది.
- రాజ్యం ఆర్థిక లక్ష్యాలతోపాటు సామాజిక న్యాయం సమానత్వం వంటి లక్ష్యాలను సాధించే సాధనంగా పరిణామం చెందింది.
- సామాజిక సమస్యలు విసిరే సవాళ్లను అధిగమించడం కోసం రూపొందించిన విధానాలను సంక్షేమ యంత్రాంగం అంటారు.
- ఇంగ్లండ్‌లో 1834లో రూపొందించిన పూర్ లా సంక్షేమ యంత్రాంగానికి పునాది.

### షెడ్యూల్డ్ కులాల సంక్షేమం

- **రాజ్యాంగ రక్షణలు:** 15(4), 16(4), 17, 23, 46, 330, 332, 338, 341
- **రిజర్వేషన్ల కల్పన**
- సంక్షేమ మంత్రిత్వ శాఖ- 1985
- సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ- 1998
- జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్
- జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి కమిషన్- 1989

### షెడ్యూల్డ్ తెగల సంక్షేమం

- రాజ్యాంగ రక్షణలు: 15(4), 16(4), 19(5), 23, 46, 164, 244, 330, 332, 335, 338, 339(1)

### రిజర్వేషన్ల కల్పన

- గిరిజన ఉప ప్రణాళిక- 5వ ప్రణాళిక
- సమగ్ర గిరిజనాభివృద్ధి ప్రాజెక్టులు
- గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ- 1999
- జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (89వ రాజ్యాంగ సవరణ- 2003)
- గిరిజన సహకార మార్కెటింగ్ అభివృద్ధి సమాఖ్య- 1987
- జాతీయ షెడ్యూల్డ్ తెగల ఆర్థికాభివృద్ధి సంస్థ- 2001

### వెనుకబడిన తరగతుల సంక్షేమం

- **రాజ్యాంగం:** 340వ నిబంధన
- కమిషన్లు- కాకా కాలేల్కర్- 1953
- మండల్ కమిషన్- 1978
- జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ- 1992
- జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్- 1993

### మైనార్టీల సంక్షేమం

- **రాజ్యాంగం:** 29, 30, 347, 350(ఎ), 350(బి) నిబంధనలు
- మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ- 2005
- ప్రధానమంత్రి నూతన 15 సూత్రాల కార్యక్రమం- 2006
- జాతీయ అల్పసంఖ్యాక వర్గాల కమిషన్- 1993
- జాతీయ మైనారిటీ ఆర్థికాభివృద్ధి కమిషన్- 1994
- **కేంద్ర వక్ఫ్ బోర్డ్**- 1964
- మౌలానా ఆజాద్ ఫౌండేషన్- 1989

### మహిళా శిశు సంక్షేమం

- **రాజ్యాంగం:** 15, 37(ఎ), 39(డి), 42 నిబంధనలు

**చట్టాలు:**

- ప్రత్యేక వివాహ చట్టం- 1954
- హిందూ వివాహ చట్టం- 1955
- హిందూ వారసత్వ చట్టం- 1956
- హిందూ దత్తత చట్టం- 1956
- మహిళలు, బాలికలతో నీతిబాహ్య వ్యాపార నిరోధ చట్టం- 1956
- ప్రసూతి సౌకర్యాల చట్టం- 1961
- వరకట్న నిషేధ చట్టం- 1961
- కుటుంబ కోర్టు చట్టం- 1984
- మహిళల పట్ల అమర్యాద సవరణ నిరోధక చట్టం- 1986
- సతీసహగమన నిషేధ చట్టం- 1987
- గృహహింస నిరోధక చట్టం- 2005
- బాలికలపై లైంగిక దాడుల నియంత్రణ చట్టం- 2012
- నేర న్యాయ సవరణ చట్టం- 2013
- పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేదింపుల నిషేధ చట్టం- 2013
- నిర్భయ చట్టం- 2013

### దివ్యాంగుల సంక్షేమం

- **రాజ్యాంగం:** 7వ షెడ్యూల్‌లోని రాష్ట్ర జాబితాలో వైకల్యం అనే అంశాన్ని చేర్చారు.
- **నిబంధనలు:** 14, 16, 21, 41, 46, 47, 253లలో దివ్యాంగుల సంక్షేమం అభివృద్ధికి చర్యలు
- వికలాంగుల చట్టం- 1995
- వికలాంగుల పునరావాస కేంద్రాలు- 1992
- కృత్రిమ అవయవాల ఉత్పత్తి సంస్థ- 1972
- జాతీయ వికలాంగుల ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్
- జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం- 1982
- దీన్ దయాల్ వికలాంగుల పునరావాస కార్యక్రమం- 1999



నూతనకంటి వెంకట్
జాయింట్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం

III.
నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 8 జూలై 2019

# హాస్పిటల్ మేనేజ్‌మెంట్



**రోజురోజుకు పరిస్థితులు మారుతున్నాయి. పరిస్థితులకు అనుగుణంగా ప్రజల జీవన విధానం మారుతున్నది. దీంతో రోగాల బారిన పడుతున్నారు. ప్రజల్లో పెరుగుతున్న రోగాలకు తగ్గట్టే ఆస్పత్రులు కూడా పెరుగుతున్నాయి. రోగులు, సహాయకులతో ఆస్పత్రులు బిజీబిజీగా మారుతున్నాయి. దీంతో ఆస్పత్రుల నిర్వహణ అనేది క్లిష్టమైన ప్రక్రియ. అందువల్లనే ఆస్పత్రుల నిర్వహణ కోసం కోర్సులు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఆ కోవలోకి చెందినవే హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు. ఈ కోర్సుల వివరాలు మీ కోసం అందిస్తున్నాం.**

- ప్రస్తుతం ఉన్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అనేది చాలా మంచి కోర్సు. ఇది ఆరోగ్య రంగంలో అత్యంత ముఖ్యమైన, లాభదాయకమైన సంతృప్తినిచ్చే వృత్తి. ఒకప్పుడు సీనియర్ వైద్యులు హాస్పిటల్ మేనేజర్ పాత్రను పోషించేవారు. దీంతో ట్రీట్‌మెంట్, ఆపరేషన్లు వంటి బాధ్యతలతో పాటు రోగులకు తమ సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. కాబట్టి వైద్యులను ఇటువంటి హాస్పిటల్ మేనేజర్ విభాగం నుంచి తప్పిస్తేనే ఆస్పత్రులు రోగులకు మేలైన సేవలు అందించగలుగుతాయి. అందుకే ఆస్పత్రుల్లోని సంబంధిత విభాగాల నిర్వహణకు ప్రొఫెషనల్లను తయారుచేయాలన్న ఉద్దేశంతో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు రూపకల్పన చేశారు.
- హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అనేది ఆస్పత్రి నిర్వహణ లేదా ఆస్పత్రి పరిపాలన అంటారు. ఆరోగ్య సంరక్షణ సర్వీసులు, వారికి అవసరమైన సేవలను అందించేవారికి మధ్య ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఆస్పత్రి భౌతిక, ఆర్థిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకునేలా చేస్తుంది. ఆస్పత్రి, మెడికల్ సదుపాయాలను సరైన విధంగా నిర్వహించడంలో హాస్పిటల్ మేనేజర్లు చాలా అవసరం.
- వైద్యులు, రోగులు, నర్సులు, వైద్య అనుబంధ విభాగాల సిబ్బంది అందరినీ సమన్వయం చేసుకుంటూ ఆస్పత్రి కార్యకలాపాలు సాఫీగా జరిగేలా చూసేవారే హాస్పిటల్ మేనేజర్. ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ కలగడంతో ముందస్తు వైద్యసేవలు వినియోగించుకునేవాళ్లు అధికమయ్యారు. దీంతో ఆస్పత్రులు వాటి సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. అంతేకాకుండా కొత్త ఆస్పత్రులు కూడా ఏర్పాటవుతున్నాయి. సంబంధిత విభాగాలను నిర్వహించడానికి స్పెషలైజ్డ్ మానవ వనరులు అవసరం. కాబట్టి చాలా విద్యాసంస్థలతో పాటు ఆస్పత్రులు కూడా హాస్పిటల్/హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తున్నాయి.
- ఈ కోర్సు చేయాలనుకునేవారికి సేవా దృక్పథం ఉండాలి. ఎక్కువ సమయం పనిలో గడపటానికి సన్నద్ధం కావాలి. సహనమూ అవసరమే. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఒత్తిడిలోనూ పనిచేయగలిగే నేర్పు, గడువులోగా పని పూర్తిచేయగల సమర్థత అవసరం.
- ఫైనాన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌పై మంచి నాలెడ్జ్ ఉండాలి. అందరితో పనిచేయించగల నైపుణ్యం ఉండాలి.

### ఏం చేస్తారు?

- హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అభ్యర్థుల విధులు కూడా ఇతర పరిశ్రమల్లోని మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్ మాదిరిగానే ఉంటాయి. హాస్పిటల్ నిర్వహణ, సిబ్బంది నియామకం, పరిపాలన సంబంధ విధులు, వివిధ విభాగాల మధ్య సమన్వయం, ఆరోగ్య సేవల మూల్యాంకనం వంటి తదితర బాధ్యతలను వీరు నిర్వహిస్తారు. హాస్పిటల్ ఎఫిషియన్సీని పెంచడంతోపాటు నాణ్యమైన వైద్యాన్ని అందించడంలో కీలకంగా వీరు పనిచేస్తారు.

### కెరీర్

- అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్, ఆపరేషన్స్ అసిస్టెంట్ హోదాతో వీరికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. చదువుకున్న విద్యాసంస్థ, అభ్యర్థి నైపుణ్యాన్ని బట్టి మేనేజర్ ఆపరేషన్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వంటి పోస్టుల్లో తీసుకుంటున్నారు.
- నైపుణ్యం పెరిగేకొద్దీ సీనియర్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, జూనియర్ వైస్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) హోదా వరకు చేరుకోవచ్చు.
- ప్రారంభంలో వీరికి ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వేతనం లభిస్తుంది. తర్వాత హోదాను, నైపుణ్యాన్ని బట్టి వేతనం భారీగా పెరుగుతుంది.



### ఉపాధి

- ప్రస్తుతం పెద్ద పట్టణాలకే పరిమితమైన కార్పొరేట్ ఆస్పత్రులు చిన్న పట్టణాలకు సైతం విస్తరిస్తున్నాయి. ఇవి 24 గంటలూ సేవలు అందించాలి. కాబట్టి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సంబంధిత కోర్సులు చేసిన అభ్యర్థులకు బాగా డిమాండ్ ఉంది.
- ఈ కోర్సులు చదివినవారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు జాతీయ, అంతర్జాతీయ వైద్య విభాగ సంస్థలు, మెడికల్ కాలేజీలు, హెల్త్ ఏజెన్సీలు, ల్యాబొరేటరీలు, క్లినిక్‌లు, మానసిక చికిత్సా కేంద్రాలు, హెల్త్ కేర్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లు, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్లు, పునరావాస కేంద్రాలు, హాస్పిటల్ సంబంధించిన సప్లయ్ సంస్థలు, కార్పొరేట్ ఫార్మసీలు, ఫార్మా సంస్థలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆరోగ్య బీమా సంస్థలు మొదలైన చోట్ల అవకాశాలు లభిస్తాయి.
- నైపుణ్యాలు ఉన్నవారికి విదేశాల్లోనూ ఆకర్షణీయ వేతనాలతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి.

### ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్

- ఈ కోర్సు చేయాలంటే 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- ఈ కోర్సు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉంది.
- రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

### మాస్టర్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్

- ఈ కోర్సు చేయడానికి 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులు.
- ఈ కోర్సు అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, డెక్కన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లలో అందుబాటులో ఉంది.
- ఎంట్రన్స్ పరీక్ష ద్వారా ఈ కోర్సులోకి ఎంపిక చేస్తారు.

### పీజీ డిప్లొమా ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్

- ఈ కోర్సు చేయడానికి 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులు.
- క్యాట్, మ్యాట్, సీమ్యాట్, గ్జాట్, జీమ్యాట్, ఏటీఎంఏలో క్వాలిఫై అయి ఉండాలి.



### కోర్సులు

- ఇంటర్ తర్వాత మెడికల్, నాన్ మెడికల్ బ్యాగ్రౌండ్ ఉన్నవారు బ్యాచిలర్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్/అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేయవచ్చు.
- పీజీ డిప్లొమా ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్/అడ్మినిస్ట్రేషన్
- పీజీ డిప్లొమా ఇన్ హాస్పిటల్ అండ్ హెల్త్ మేనేజ్‌మెంట్
- ఎమ్మెస్సీ ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్

### మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్

- ఇటీవలనే నిమ్స్ హాస్పిటల్ ఈ కోర్సును ప్రారంభించింది.
- ఏదైనా డిగ్రీ పూర్తిచేసి 30 ఏండ్లలోపు ఉన్నవారు అర్హులు.

... సత్యం చాపల

# నూతన విద్యావిధానం ముసాయిదా

## సివిల్స్ జనరల్ ఎస్సే

వ్యక్తి వికాసానికి, సమాజ ప్రగతికి, మానవజాతి పురోగతికి తోడ్పడే అద్భుతమైన సాధనం విద్య. విద్య శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే విద్యా విధానం సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. అంతేకాదు భవిష్యత్ అవసరాలని ముందే అంచనావేసి ఆ మేరకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి. అందుకే 1986 నాటి జాతీయ విద్యావిధానం స్థానంలో సరికొత్త విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ జాతీయ విద్యావిధానం ముసాయిదాను ఇప్పటికే కేంద్రానికి అందించింది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖను విద్యామంత్రిత్వ శాఖగా మార్చాలన్న ఈ ముసాయిదా.. పాఠశాల విద్య, ఉన్నత విద్యతోపాటు సంస్థాగత మార్పులు కూడా సూచించింది. అందులో ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం..

- **అరిస్టాటిల్ అందించిన విద్య అలెగ్జాండర్‌ను ప్రపంచ విజేతగా తీర్చిదిద్దింది.**
- **రామకృష్ణుడి బోధనలు నరేంద్రుడిని వివేకానందుడిగా మార్చివేశాయి.**



### విజన్

- జాతీయ విద్యావిధానం లక్ష్యం అందరికీ నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మన దేశాన్ని సుస్థిరమైన, శక్తిమంతమైన జ్ఞాన సమాజంగా మార్చడానికి దోహదపడే భవిష్యత్‌ను ఊహించి భారతీయ కేంద్రీకృత విద్యావ్యవస్థని రూపొందించడం.

### పాఠశాల విద్యలో మార్పులు :

1. పూర్వబాల్య సంరక్షణ, విద్యను (Early Childhood Care and Education) పాఠశాల విద్యలోనే భాగంగా పరిగణించాలని సూచించింది.
2. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, మేధోపరమైన అభివృద్ధి ఆధారంగా పాఠశాల విద్యలో 5+3+3+4 విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించింది. అంటే పాఠశాల విద్యలోని వయసును నాలుగు దశలుగా విభజిస్తారు. ఆ మేరకు తరగతులుంటాయి.
   - **పునాది దశ (Foundation Stage) (3-8 ఏండ్లు):** ఇందులో మూడేండ్లు ప్రీప్రైమరీతో పాటు ఒకటి, రెండు తరగతులుంటాయి.
   - **సంసిద్ధతా దశ (Preparatory Stage) (8-11 ఏండ్లు):** మూడు, నాలుగు, ఐదు తరగతులు
   - **మధ్య దశ (11-14 ఏండ్లు):** ఇందులో 6,7,8 తరగతులు
   - **ద్వితీయ దశ (14-1 ఏండ్లు):** 9 నుంచి 12 తరగతుల వరకు ఉంటాయి.
3. పాఠ్యాంశాలను పిల్లలపై ఒత్తిడి తగ్గించే విధంగా మార్పులు చేయాలి
4. కళలు, సంగీతం, ఆటలు, యోగా, సామాజిక సేవ వంటివి కూడా పాఠ్య ప్రణాళికల్లో భాగంగానే పరిగణించాలని సూచించింది. అంతేకాదు నిజ జీవితంలో ఉపయోగపడే వివిధ నైపుణ్యాలు కూడా ఇందులో భాగమే.
5. విద్యా హక్కు చట్టం 2009 విస్తరణ : ఈ చట్టం ప్రస్తుతం 6 నుంచి 14 ఏండ్ల వయసు వారికి వర్తిస్తుంది. దీన్ని 3 నుంచి 18 ఏళ్ల వయసు వారికి కూడా విస్తరించాలని సూచించింది.
6. బోధన విద్యలో మార్పులు: నాణ్యతలేని బోధన అందించే విద్యాసంస్థలని మూసివేయలని సూచించింది.

### ఉన్నత విద్యకు సంబంధించినవి

- ఉన్నత విద్యా వ్యవస్థ పుర్నిర్మాణంతోపాటు స్థూలంగా మూడు రకాల విద్యా సంస్థలు ఉండాలని సూచించింది.
- **మొదటిరకం:** అన్ని స్థాయిల్లో ప్రపంచ స్థాయి పరిశోధన- అధిక నాణ్యత గల బోధనపై దృష్టి పెడుతుంది.
- **రెండో రకం:** పరిశోధనలో సహకారంతోపాటు అధిక నాణ్యతగల బోధన పై దృష్టి పెడుతుంది.
- **మూడో రకం:** అండర్ గ్రాడ్యుయేట్ విద్యపై దృష్టి సారించిన విభాగాలలో అధిక నాణ్యత గల బోధనపై దృష్టి పెడుతుంది.
- ఉన్న విద్యా వ్యవస్థలలోని ఈ సరికొత్త సంస్థాగత నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి మిషన్ నలంద, మిషన్ తక్షశిల ప్రారంభిస్తారు. ప్రస్తుతం ఉన్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ అయిన బీఏ, బీఎస్సీ, బీకాం వంటి కోర్సులలో కూడా మార్పు చేయాలని కస్తూరి రంగన్ కమిటీ సూచించింది.

- బోధన వృత్తిలోకి రావాలనుకునే వాళ్లకు 4 ఏళ్ల ఇంటిగ్రేటెడ బీఎడ్ డిగ్రీ కనీస విద్యార్హతగా నిర్ణయించాలని సూచించింది.

### వ్యవస్థాపరమైన మార్పులు

1. రాష్ట్రీయ శిక్షా ఆయోగ్ ఏర్పాటు. ప్రధానమంత్రి నేతృత్వంలో ఏర్పడే ఈ సంస్థ భారతదేశంలో విద్యాప్రగతి సంరక్షకుని గా వ్యవహరిస్తుంది. విద్యా సంబంధ విషయాల్లో కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయకర్తగా పనిచేస్తుంది.
2. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో పరిశోధన సంస్కృతిని విస్తరించడానికి ఈ సంస్థ తోడ్పడుతుంది.
3. జాతీయ ఉన్నతవిద్యా నియంత్రణ సంస్థ ఒక్కటే అన్ని రకాల విద్యాసంస్థలని (వృత్తి నిపుణత కలిగిన సంస్థలతో కలిపి) నియంత్రిస్తుంది.
4. ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌ను హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ గా మారుస్తారు.
5. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు సమాన ప్రాధాన్యం

### జాతీయ విద్యా విధానంలోని మరికొన్ని అంశాలు

- ఉన్నత విద్య అంతర్జాతీయీకరణ
- దూరవిద్యలో నాణ్యత పెంచడం
- అన్ని విద్యాస్థాయిల్లో సాంకేతికతను అనుసంధానించడం
- విద్యా ఫలితాల్లో లింగ, సామాజిక అసమానతలని తొలగించడం మొదలైనవి.

### త్రిభాషా సూత్రం- వివాదం-సవరణలు

- కస్తూరి రంగన్ కమిటీ 1968 నాటి త్రిభాషా సూత్రాన్ని నిర్దిష్టంగా అమలు చేయాలని సూచించింది. ఇందులో భాగంగానే హిందీయేతర రాష్ట్రాల్లోని పాఠశాల పాఠ్యాంశాల్లో హిందీ భాషని తప్పనిసరి చేసింది. అయితే హిందీయేతర రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కేంద్రం ఆ అంశాన్ని తొలగించింది.

### ముగింపు

- వ్యక్తి గమనాన్ని, ప్రపంచ గమ్యాన్ని సమూలంగా మార్చివేయగలిగేది విద్య. అలాంటి విద్యను అందరికి అందేలా రూపొందించే విద్యా విధానమేదైనా విద్యార్థుల బంగారు భవిష్యత్ కి బాటలు వేయగలగాలి.



మల్లవరపు బాలలత
సీఎస్‌బీ సివిల్స్ అకాడమీ,
హైదరాబాద్

## సుడోకు

డైలీ సుడోకు 84 సమాధానం


| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 6 | 9 | 8 | 1 | 4 | 5 | 7 | 2 |
| 5 | 8 | 7 | 6 | 2 | 3 | 9 | 4 | 1 |
| 1 | 2 | 4 | 7 | 5 | 9 | 8 | 3 | 6 |
| 2 | 4 | 8 | 1 | 7 | 5 | 3 | 6 | 9 |
| 7 | 5 | 6 | 9 | 3 | 8 | 2 | 1 | 4 |
| 9 | 1 | 3 | 4 | 6 | 2 | 7 | 8 | 5 |
| 8 | 9 | 1 | 2 | 4 | 7 | 6 | 5 | 3 |
| 6 | 7 | 5 | 3 | 9 | 1 | 4 | 2 | 8 |
| 4 | 3 | 2 | 5 | 8 | 6 | 1 | 9 | 7 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -85

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 3 | | | | | 7 |
| 5 | | | | 9 | | 4 | 3 | |
| | | | 8 | 4 | | | | 9 |
| 9 | | | | | | 3 | 7 | 8 |
| | 7 | | | | | | 2 | |
| 4 | 3 | 2 | | | | | | 1 |
| 2 | | | | 8 | 9 | | | |
| | 5 | 1 | | 2 | | | | 6 |
| 8 | | | | | 6 | | | |





సునీత తాటి, సమంత, రానా, నందినిరెడ్డి, వివేక్ కూఛిబొట్ల

# 'ఓ బేబీ' గొప్ప బహుమతి

'ఈ సినిమాకు పనిచేసిన రోజుల కంటే ఈ చిత్ర ప్రచారానికే ఎక్కువ రోజులు కేటాయించాను. ఏ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానల్ చూసినా నీ ముఖమే కనిపిస్తోందని అన్నారు. అది విని నాకే సిగ్గుగా అనిపించింది' అన్నారు సమంత. ఆమె నటించిన తాజా చిత్రం 'ఓ బేబీ'. నందినిరెడ్డి దర్శకత్వం వహించారు. డి. సురేష్‌బాబు సమర్పణలో సునీత తాటి, టి.జి.విశ్వప్రసాద్, హ్యూన్ హు, థామస్ కిమ్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం హైదరాబాద్‌లో థ్యాంక్స్‌మీట్‌ని ఏర్పాటు చేసింది. సమంత మాట్లాడుతూ 'ఈ సినిమా రిలీజ్‌కు ముందు రోజు రాత్రంతా నిద్రపోకుండా గడిపాను. సోషల్ మీడియాలో సినిమాపై పాజిటివ్ ట్వీట్‌లు చూసి ఈ సినిమాకు నా పని అయిపోయింది. ఇక వీళ్లు చూసుకుంటారని రిలాక్స్ అయ్యాను. మీడియా, విమర్శకుల నుంచి తొలి స్పందన లభించింది. దీంతో ప్రేక్షకుల్లోకి సినిమా చాలా సులువుగా వెళ్లిపోయింది. ఈ సక్సెస్ నాకు లభించిన గ్రేట్ గిఫ్ట్‌గా భావిస్తున్నాను. ఈ సినిమా తరువాత ఏం చేయాలి? ఎలాంటి సినిమా చేయాలి? అనే కన్ఫ్యూజన్‌లోనే వున్నాను. రెండు రోజులు ఇదే ఆలోచనల్లో ఉంటాను. ఆ తరువాత కొత్త తరహా సినిమా చేయాలి. మరింత బాగా నటించాలి అని ఆలోచిస్తాను. అలా ఆలోచించడం కొంచెం పిచ్చే. బేబీ పాత్రలో నన్ను ఆదరించి నాకు ఈ సక్సెస్ రూపంలో మంచి బహుమతి ఇచ్చారు' అని తెలిపింది. రానా మాట్లాడుతూ 'ఓ బేబీ ఎంత పెద్ద విజయాన్ని సాధించిందో ప్రత్యేకంగా నేను చెప్పక్కర్లేదు. ఈ సినిమా కలెక్షన్స్ కోసం డిస్ట్రిబ్యూటర్లని అడిగితే మీ సినిమా కన్నా బాగా ఆడుతోంది అన్నారు. ఏడాదికి నేను మూడు చిత్రాల్లో నటించాలన్నది మా నాన్న కోరిక. అంత టాలెంట్ అయితే నాకు లేదు. నాకు ఒక సినిమానే మూడేళ్లు పట్టేస్తుంది. సమంత పిచ్చికి అడ్రస్ దొరికింది. తను ఎన్ని సినిమాలు చేయాలనుకుంటే అన్ని సురేష్ ప్రొడక్షన్స్‌లో చేసుకోవచ్చు. సమంత, నందిని, సునీత ఈ ముగ్గురూ సరైన గొడుగు లాంటి సురేష్ ప్రొడక్షన్స్‌లోకి వచ్చేసి నేను ఆనందించేలా చేశారు. ముగ్గురు మహిళలు కలిసి హృదయాలకి హత్తుకునే చిత్రాన్ని రూపొందించారు. ఇలాంటి ఒక ప్రత్యేకమైన చిత్రాన్ని, ఓ కొరియన్ కథని తెలుగు ప్రేక్షకులు ఆదరించారు. ఇలాంటి కథని తెలుగు నేటివిటీకి అనుగుణంగా తీర్చిదిద్దిన నందిని రెడ్డికి హ్యాట్సాఫ్' అన్నారు. నందినిరెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా చూసిన చాలా మంది భావోద్వేగానికి లోనయ్యారు. మా అమ్మ, అమ్మమ్మ గుర్తొచ్చిందని నన్ను కౌగిలించుకుని ఏడ్చారు. నా జన్మ ధన్యమైంది అనిపించింది' అన్నారు.

ఈ కార్యక్రమంలో తేజ, సునయన, సునీత తాటి, వివేక్ కూచిభోట్ల తదితరులు పాల్గొన్నారు.



# సమాజం కోసం..

సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'బందోబస్త్'. మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ కీలక పాత్రను పోషిస్తున్నారు. కె.వి.ఆనంద్ ('రంగం' ఫేమ్) దర్శకుడు. సుభాస్కరణ్ నిర్మాత. ఈ చిత్ర టీజర్‌ను రానా శనివారం ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. 'భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, రైతులు, నదీ జలాల సమస్యల్ని చర్చిస్తూ రూపొందిస్తున్న చిత్రమిది. ఇందులో సూర్య కమాండోగా, ముస్లిమ్ వ్యక్తి కథిర్‌గా, సుభాష్‌గా విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నారు. టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. సామాజికాంశాల్ని స్పృశిస్తూ దర్శకుడు ఈ చిత్రాన్ని సందేశాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. హారీస్‌జైరాజ్ స్వరపరచిన పాటల్ని త్వరలో విడుదల చేస్తాం. ఆగస్ట్ 30న సినిమాను ప్రేక్షకులముందుకు తీసుకొస్తాం. ఈ సినిమాలో ఆర్య, సాయేషాసైగల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు' అని చిత్ర బృందం పేర్కొంది. బోమన్ ఇరానీ, సముద్రఖని, పూర్ణ, నాగినీడు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎం.ఎస్.ప్రభు, సంగీతం: హారీష్ జైరాజ్, నిర్మాణ సంస్థ: లైకా ప్రొడక్షన్స్, దర్శకత్వం: కె.వి.ఆనంద్.



సూర్య

# లవ్ యాక్షన్ డ్రామా

తెలుగు, తమిళ భాషల్లో వరుసగా చిత్రాల్ని అంగీకరిస్తూ జోరుమీదున్న నయనతార మాతృభాష మలయాళంలో మాత్రం విరామం తీసుకుంటూ నటిస్తున్నది. 2016లో 'పుథియనియమం' తర్వాత మలయాళ సినిమాలకు దూరంగా ఉన్న ఆమె మూడేళ్ల తర్వాత లవ్ యాక్షన్ డ్రామాతో మాలీవుడ్‌లో పునరాగమనం చేస్తున్నది. నివిన్ పాల్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి ధ్యాన్ శ్రీనివాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను శనివారం చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో ఎరుపు రంగు షర్ట్ ధరించి కాఫీ కప్పుతో నయనతార చిరునవ్వులు చిందిస్తుండగా.. మద్యం గ్లాస్‌తో నివిన్ పాల్ కనిపిస్తున్నారు. చాలా కాలం తర్వాత ఆధునిక వస్త్రధారణలో కనిపిస్తున్న నయన లుక్ అభిమానులను ఆకట్టుకుంటున్నది. శోభ అనే పాలక్కాడ్ ప్రాంతానికి చెందిన బ్రాహ్మణ యువతిగా నయనతార కనిపించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. భార్య తనను హతమార్చుతుందనే మానసిక వ్యాకులతతో బాధపడే ఓ భర్త కథతో ఆద్యంతం వినోదభరితంగా ఈ సినిమా సాగనున్నట్లు తెలిసింది.



జాన్వీకపూర్

# 'దోస్తానా' సీక్వెల్‌లో..

జాన్ అబ్రహం, అభిషేక్‌బచ్చన్, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దోస్తానా'. బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన ఈ చిత్రానికి దాదాపు పదేళ్ల విరామం తరువాత సీక్వెల్‌ని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఈ చిత్రాన్ని కరణ్‌జోహార్ ధర్మా ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించబోతున్నారు. కార్తిక్ ఆర్యన్, జాన్వీకపూర్ ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. కోలిన్ డీ కన్హా దర్శకుడిగా పరిచయం కానున్నారు. జాన్వీని కథానాయికగా పరిచయం చేస్తూ కరణ్‌జోహార్ 'సైరట్' రీమేక్‌ని తెరకెక్కించిన విషయం తెలిసిందే. తాజా చిత్రంలో జాన్వీకపూర్ పాత్ర చిత్రణ ఛాలెంజింగ్‌గా సాగుతుందని, ఇందులో కార్తిక్ ఆర్యన్, జాన్వీ అన్నా చెల్లెళ్లుగా కనిపించనున్నారని తెలిసింది. కరణ్‌జోహార్ మాట్లాడుతూ 'దోస్తానా' సీక్వెల్ కోసం చాలా ఉత్సుకతతో ఎదురుచూస్తున్నాను. కార్తిక్ ఆర్యన్, జాన్వీకపూర్‌తో మళ్లీ ఆ మ్యాజిక్‌ని రిపీట్ చేయాలనుకుంటున్నాను. మరో కీలక పాత్ర కోసం ప్రతిభావంతుడైన కొత్త నటుడిని వెతుకుతున్నాను' అని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని చిత్ర బృందం వెల్లడించనుంది.



మంచు విష్ణు

# మూడు కొత్త చిత్రాలు

గత సినిమాల ఫలితాల్ని దృష్టిలో పెట్టుకొని సినిమాలకు కొంత విరామం తీసుకున్న మంచు విష్ణు మళ్లీ స్పీడు పెంచుతున్నారు. మూడు సినిమాలు చేయబోతున్నారు. ఇందులో ఒకటి హాలీవుడ్ సినిమా కావడం గమనార్హం. వీటితో పాటు ఏపీ రాజకీయాల ఆధారంగా ఓ వెబ్‌సిరీస్‌ను నిర్మిస్తున్నారు. రెండు కొత్త చిత్రాలతో పాటు వెబ్‌సిరీస్‌ను ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. విష్ణు, కాజల్ అగర్వాల్ జంటగా ఐటీ రంగ నేపథ్యంలో యథార్థ ఘటనల ఆధారంగా ఓ యాక్షన్ డ్రామా సినిమా రూపొందనున్నది. 2800 కోట్ల రూపాయల దోపిడీ ఎలా జరిగిందనే పాయింట్‌తో జాతీయ అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల కలయికలో ఈ చిత్రం రూపుదిద్దుకోనున్నది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలోనే వెల్లడించనున్నారు. అలాగే సుబ్బరాజు అనే నూతన దర్శకుడితో ఓ న్యూ ఏజ్ థ్రిల్లర్ సినిమా నిర్మించనున్నారు విష్ణు. ఈ చిత్రానికి 'మిరా రోడ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నిజజీవిత సంఘటనలతో రూపొందనున్న ఈ చిత్రం ఈ ఏడాది చివరలో విడుదలకానుంది. అలాగే విష్ణు హాలీవుడ్‌లో అరంగేట్రం చేయబోతున్నారు. జెఫ్రీచిన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఆంగ్ల చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నది. వాస్తవిక అంశాల స్ఫూర్తితో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి విష్ణు సతీమణి విరానికా నిర్మాతగా వ్యవహరించనున్నారు. వయామార్, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ సంస్థలు నిర్మిస్తున్నారు. ప్రముఖ హాలీవుడ్ నటుడు కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం జరుగుతున్నది. దీంతో పాటు పొలిటికల్ డ్రామా వెబ్‌సిరీస్‌ను నిర్మిస్తున్నారు విష్ణు.



నివేథా పేతురాజ్

# అఖిల్ జోడీగా..

'మెంటల్ మదిలో' చిత్రం ద్వారా తెలుగులో అరంగేట్రం చేసింది తమిళ సొగసరి నివేథా పేతురాజ్. తొలి సినిమాలోనే అందం, అభినయం కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఈ అమ్మడికి తెలుగులో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అక్కినేని అఖిల్ సరసన నివేథా పేతురాజ్ నటించబోతున్నది తెలిసింది. వివరాల్లోకి వెళితే..బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో అఖిల్ ఓ చిత్రాన్ని చేయబోతున్న విషయం తెలిసిందే. త్వరలో చిత్రీకరణ ప్రారంభంకానుంది. ఇందులో అఖిల్‌కు జోడీగా నివేథా పేతురాజ్‌ను ఎంపిక చేసినట్లు తెలిసింది. 'చిత్రలహరి' 'బ్రోచేవారెవరురా' సినిమాలతో యువతరంలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది నివేథా పేతురాజ్. ప్రస్తుతం ఈ సుందరి అల్లు అర్జున్-త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నది. చిత్రసీమలో అరంగేట్రం చేసిన అనతి కాలంలో ఈ తమిళ సోయగం భారీ సినిమా అవకాశాలతో తారాపథంలో దూసుకుపోతున్నది.

# హారర్ థ్రిల్లర్ 'హేజా'



మున్నాకాశీ

మున్నా కాశీ కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హేజా'. ముమైత్‌ఖాన్, నూతన్ నాయుడు, లిజిగోపాల్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. వి.ఎన్.వి క్రియేషన్స్ పతాకంపై కె.వి.ఎస్.ఎన్ మూర్తి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. టీజర్‌ను చిత్రబృందం ఇటీవల విడుదలచేసింది. మున్నాకాశీ మాట్లాడుతూ 'మిస్టర్ 7, యాక్షన్ త్రీడీ, చిత్రం చెప్పిన కథ, మామ ఓ చందమామ చిత్రాలకు సంగీతాన్ని అందించాను. తొలిసారి హీరోగా నటిస్తూ నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. హారర్ థ్రిల్లర్ కథాంశంతో ఉత్కంఠను పంచుతుంది. ముమైత్‌ఖాన్ ఈ సినిమాతో తెలుగులో రీఎంట్రీ ఇస్తున్నది. హేజా ఎవరు? ఆ పేరు వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించే క్రమంలో ఓ యువకుడు తెలుసుకున్న వాస్తవాలేమిటన్నది ఉత్కంఠను పంచుతుంది' అని తెలిపారు. ఇదివరకు తెలుగు తెరపై వచ్చిన హారర్ సినిమాలకు భిన్నంగా ఉండే చిత్రమిదని నిర్మాత తెలిపారు.

# ఆ సీన్ భయపెట్టింది!

తమిళ చిత్రం 'అడై'లో అమలాపాల్ ఎక్స్‌పోజింగ్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవకాశాల కోసమే ఆమె ఇలాంటి సినిమాలు చేస్తున్నదంటూ పలువురు అభ్యంతరాల్ని వ్యక్తంచేస్తున్నారు. ఈ విమర్శలపై అమలాపాల్ ధీటుగానే స్పందించింది. సినిమాలు చూడకుండానే కొందరు తొందరపాటుతో తమ అభిప్రాయాలను వెల్లడిస్తుంటారు. నటీనటుల శ్రమను, కష్టాన్ని తగ్గిస్తూ మాట్లాడుతుంటారు అలాంటి వారి విమర్శలకు నేనెప్పుడూ విలువనివ్వను. వాటిని ఏ మాత్రం పట్టించుకోను. 'అడై' నిజాయితీతో కూడిన ప్రయత్నం. తొలుత దర్శకుడు ఈ కథ గురించి చెప్పినప్పుడు స్ట్రెయిట్ సినిమా అంటే నమ్మలేకపోయాను. హాలీవుడ్ చిత్రం స్ఫూర్తితో కథ రాశారనిపించింది. కథపై రత్నకుమార్‌కు ఉన్న పట్టు చూసి నమ్మకం కలిగింది' అని తెలిపింది. అలాగే సినిమాలోని అర్ధ నగ్నంగా కనిపించే సన్నివేశం గురించి చెబుతూ 'తొలుత ఆ సీన్ గురించి దర్శకనిర్మాతలు చెప్పినప్పుడు ఆందోళన వద్దని వారితో చెప్పాను. కానీ ఆ సీన్ చిత్రీకరించే ముందు చాలా ఒత్తిడిగా ఫీలయ్యాను. సెట్స్‌లో ఏం జరుగుతుందో? ఆ సన్నివేశాన్ని ఎలా తీస్తారో? అనే భయాలు నాలో మొదలయ్యాయి. చిత్ర బృందంపై నమ్మకం ఉంచితేనే అలాంటి సన్నివేశాల్ని తెరకెక్కించగలమనిపించింది. అందుకే ధైర్యంతో వారిని నమ్మాను. 15 మంది యూనిట్ సభ్యుల మధ్య కట్టుదిట్టమైన భద్రతలో ఆ సీన్స్‌ను తెరకెక్కించాం' అని తెలిపింది.



అమలాపాల్